సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ వారపత్రిక
RNI No. APTEL 2015/ 66622

# రాజధాని వార్తలు

www.rajadhanivartalu.com facebook.com/rajadhaniv

అమరావతి సోమవారం 12 - ఆదివారం 18 డిసెంబర్, 2016 సంపుటి : 2 సంచిక 12 | ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు పత్రిక | Whatsapp No: 9440662699 | పేజీలు 8 వెల : రూ. 5.00

## మా ఊరి "మస్‌జిద్-ఏ-అక్సా"



**రాజధాని ప్రతినిధి- రాయపూడి :** రాజధాని ప్రాంతం అయిన రాయపూడి, తాడికొండ, అమరావతిలో ముస్లిం జనాభా ఎక్కువగా ఉంటుంది. రాయపూడిలో దాదాపు 500 ముస్లిం కుటుంబాలు ఉన్నాయి. అరవయ్యో దశాబ్దం వరకు పీర్ల పంజాలోనే నమాజులు జరుపుతున్న నేపథ్యంలో అక్కడే ఒక మస్‌జిద్ ఏ అక్సా మసీదును నిర్మించారు. 2007న అదే స్థలంలో కొత్త మసీదును పున:నిర్మించారు. దీనికోసం పటాన్ వజీర్ ఖాన్ దక్షిణం వైపు ఉన్న మరో నాలుగు సెంట్ల స్థలాన్ని సుమారు రూ. 1లక్ష 50 వేలతో,కొని మసీదుని ఇచ్చారు. రాయపూడి వాస్తవ్యులు మందడం మాస్టారుగా చిరపరిచితులైన పటాన్ హుస్సేన్ ఖాన్ మనుమడు, ఎన్‌ఆర్‌ఐ హుస్సేన్ మస్‌జిత్ నిర్మాణ కోసం సుమారు రూ. 13 లక్షలు అందించి అందమైన భవన నిర్మాణానికి సహకరించారు. దీనితోపాటుగా గ్రామస్తులు రూ.1.50 వేలు చందాలుగా అందించగా, మైఖాసిం కుటుంబం లక్షరూపాయలను వితరణగా ఇచ్చారు. దీనికోసం గుంటూరుకు చెందిన ప్రముఖ ఆర్కిటెక్ట్ హకీం నమూనాను అందించారు. కర్నూలు ఆర్కిటెక్ట్ అల్లాబక్ష్ 40 అడుగుల ఎత్తైన రెండు మీనార్లను నిర్మించారు. మస్‌జిద్ కోసం అప్పటి గ్రామసర్పంచ్‌తో పాటు ముస్లింయేతరులు కూడా శక్తికొద్దీ సహాయ సహకారాలందించారు. ప్రస్తుతం దీనిలో 200 మంది ప్రతిశుక్రవారం నమాజు చేస్తున్నారు. మస్‌జీద్ నిర్వహణ ఖర్చుల కోసం లక్షరూపాయలతో వజీర్‌ఖాన్ టెంట్ హౌస్‌ను ఏర్పాటు చేశారు.

## సుప్రీంకోర్టులో సవాలు చేస్తాం



**రాజధాని ప్రతినిధి-మంగళగిరి :** ఓటుకు నోటు కేసుపై విచారణ కోసం సుప్రీం కోర్టును ఆశ్రయిస్తామని ఎమ్మెల్యే ఆళ్లరామకృష్ణ తరపు న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి అన్నారు. కేసులు కొట్టించుకోవడం చంద్రబాబుకు కొత్తేమీ కాదని ఆయన అన్నారు. ఆడియో టేపుల్లో ఉన్నది చంద్రబాబు గొంతేనని తాము శాస్త్రీయంగా నిరూపించినా కేసును కొట్టేశారని, దీనిపై సుప్రీం కోర్టుకు వెళ్తామన్నారు. జయలలిత లాంటి చాలా మంది పెద్దలు క్వాష్ ఫిటీషన్లను దాఖలు చేయలేదని, ఎలాంటి తప్పు చేయలేదని నమ్మకం చంద్రబాబుకు ఉంటే ఎందుకు క్వాష్ పిటీషన్ దాఖలు చేశారని ప్రశ్నించారు. ఓటుకు నోటు కేసును ఒకప్పుడు పీవీ నరసింహారావు కూడా శిక్ష అనుభవించారని కానీ ఇప్పుడు మాత్రం ఓటు నోటుకు ఇచ్చి కొన్నా అది అవినీతిని కిందకు రాదని తీర్పులో ఉటంకించారని చెప్పారు. తాము సుప్రీంకోర్టు ఆశ్రయిస్తామని, అక్కడ న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉందన్నారు.

# అమరావతికి మహర్దశ



**రాజధాని,ప్రతినిధి-అమరావతి :** నూతన రాజధాని అమరావతి దశ తిరగబోతోంది. కార్పొరేట్ కార్యాలయాలు నిర్మించుకునేందుకు మరిన్ని సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి. ఇప్పటికే విద్యా వైద్య రంగాల్లో వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ముందుకు వచ్చాయి.ఒక్క విద్యారంగంలోనే సుమారు రూ.24వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు సుముఖత చూపాయి. విట్, ఎస్‌ఆర్‌ఎం లాంటి విశ్వవిద్యాలయాలు నిర్మాణాలకు శంకుస్థాపనలు కూడా చేశాయి. అదేవిధంగా వైద్యరంగంలోను పలు సంస్థలకు భూముల కేటాయింపు చేశారు. బీఆర్‌ఎస్ వెంచర్స్ అండ్ హోల్డింగ్స్ లిమిటెడ్ తమకు కేటాయించిన భూమిలో వైద్య విశ్వవిద్యాలయం, ఇతర యూనిట్ల కోసం సుమారు 15.6లక్షల చదరపు అడుగుల భవనాలను నిర్మించనుంది. వాటితోపాటు వివిధ రంగాలకు చెందిన పలు సంస్థలు, ట్రస్టులు తమకు భూమి కేటాయించాలని కోరుతున్నాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఫుడ్ కార్పొరేషన ఆఫ్ ఇండియా, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్), ఇండియన ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్)లు తమ తమ కార్యాలయాలు నెలకొల్పేందుకు భూములు అడిగాయి. వీటితో పాటు బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయం, నందమూరి బసవతారకం క్యాన్సర్ ఫౌండేషన్, ఆప్కాబ్, ఎపీఎస్‌ఎఫ్ తదితర సంస్థలు భూములు అడుగుతున్నాయి. ఈ ప్రతిపాదనను పరిశీలించిన ప్రభుత్వం 10ఎకరాలు వరకు ఇవ్వాలని భావిస్తోంది. ఇందులో సుమారు 5లక్షల చదరపు అడుగుల్లో నిర్మాణాలు చేపడతారు. ఆడిటోరియమ్‌లు, మెడిటేషన హాళ్ళు, తరగతి గదులు, భోజనశాలలు, ఆడియో, వీడియో శిక్షణ గదులు, పరిపాలనా భవనం ఇలాంటివన్నీ నిర్మిస్తారు. వీరికి ఎకరా రూ.4.1కోట్ల విలువ కట్టి.. దానిపై లీజు నిర్ణయించాలనే ఉద్దేశంతో ఉన్నారు. భూ కేటాయింపు చేస్తే దశలవారీగా అభివృద్ధి చేస్తామని, ఎక్కువ భాగంలో పచ్చదనం నింపుతామని సదరు సంస్థ ప్రతిపాదించింది. ఇలా పెద్దఎత్తున ఆసక్తి చూపుతున్న సంస్థలన్నీ నిర్మాణాలను చేపడితే ఇక్కడ భారీగా ఆర్థిక కార్యకలాపాలు జరిగే అవకాశాలున్నాయి. మౌలిక సదుపాయాల కల్పన కూడా పెరుగుతుంది. ప్రసిద్ధి చెందిన ఎత్తైన కట్టడం బుర్జ్‌ఖలీఫా, దుబాయ్‌లో సముద్ర ఒడ్డుకు కాస్త లోపలున్న దీవుల్లో నిర్మించిన ప్రఖ్యాత నిర్మాణాల సమాహారం పామ్ దుబాయ్ నిర్మాణ సంస్థలతో చర్చించనున్నారు. అమరావతిలో ఒక ఐకానిక్ నిర్మాణం, ప్రాజెక్టు లాంటిది చేపట్టే అంశంపై చర్చ జరిగే అవకాశాలున్నాయని సమాచారం. మరోవైపు రాజధానిలో ఒక్కో గ్రామానికి రూ.25లక్షల చొప్పున కేటాయించింది. వీటికి మ్యాచింగ్‌గా కేంద్రం ఒక్కోగ్రామానికి రూ.25లక్షలు ఇవ్వనుంది.




## శేఖర్ రెడ్డి పదవి గోవిందా...




**చెన్నై:** శేఖర్ రెడ్డిని టీటీడీ పాలకమండలి సభ్యుడి పదవి నుంచి ఏపీ ప్రభుత్వం తొలగించింది. ఐటీ దాడుల్లో పెద్ద మొత్తంలో నగదు, బంగారంతో పట్టుబడ్డ నేపథ్యంలో ఏపీ దేవాదాయ శాఖ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీలో చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత శేఖర్‌రెడ్డిని టీటీడీ పాలకమండలి సభ్యుడిగా నియమించిన విషయం తెలిసిందే. మరో వైపు శేఖర్‌రెడ్డి ఇళ్లు, కార్యాలయాల్లో ఐటీ సోదాలు కూడా కొనసాగాయి. ఐటీ అధికారుల దాడుల నేపథ్యంలో రూ. 24 కోట్ల కొత్త కరెన్సీని వేరే చోటుకి తరలించాలని ప్రయత్నిస్తుండగా వేలూరులో అధికారులు పట్టుకున్నారు. శేఖర్ రెడ్డి నివాసం వద్ద ఆగివున్న కారులో 12 బాక్సుల్లో ఉన్న నగదును స్వాధీనం చేసుకున్నారు. ఒకో బాక్సులో రూ.2 కోట్లు మేరకు కొత్త కరెన్సీ ఉన్నట్లు తెలుస్తోంది.అలాగే శేఖర్‌రెడ్డితో పాటు ఆయన వ్యాపార భాగస్వాములు ప్రేమ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, కిరణ్‌రెడ్డికి చెందిన చెన్నై, వేలూరు జిల్లాల్లోని ఇళ్లు, కార్యాలయాలపై గురువారం నుంచి జరిపిన దాడుల్లో పెద్ద 170 కోట్ల నగదు, 130 కిలోల బంగారం పట్టుబడింది.నోట్ల రద్దు ప్రకటన తర్వాత మొదటిసారిగా పెద్దమొత్తంలో నగదు, బంగారం పట్టుబడిన ఈ కేసును ఆదాయపు శాఖ సీబీఐకి సిఫారసు చేస్తోంది.

**ఆరు నెలలుగా నిఘా...**

చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత శేఖర్‌రెడ్డిని టీటీడీ పాలకమండలి సభ్యుడిగా నియమించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో మంచి పలుకుబడి కలిగి ఉండటమే కాకుండా అధికార తెలుగుదేశం పార్టీ నేతలతో సత్సంబంధాలు కొనసాగిస్తున్న శేఖర్‌రెడ్డితో పాటు ఇతరుల కార్యకలాపాలను నిఘా వర్గాలు సుమారు ఆరు నెలల పాటు పరిశీలించినట్టు తెలుస్తోంది. సెల్‌ఫోన్ సంభాషణలను రికార్డు చేశారని సమాచారం.నిఘా వర్గాలు ఇచ్చిన సమాచారం నేపథ్యంలోనే దాడులు జరిగినట్లు తెలుస్తోంది. కాగా, శేఖర్‌రెడ్డి హైదరాబాద్ వచ్చినప్పుడు ఒక ప్రముఖ హొటల్‌లో టీడీపీ ముఖ్య నేతతో భేటీ అవుతారని సమాచారం. ఈ నేపథ్యంలోనే చంద్రబాబు ఆయనను టీటీడీ బోర్డు సభ్యుడుగా నియమించారని చెబుతు న్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఐటీ అధికారులు కాట్పాడిలో సీల్ చేసిన శేఖర్‌రెడ్డి ఇంటిని తనిఖీ చేసి, ఆయన సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

## ఊరవారం రాజధాని


- విజయవాడలో డిసెంబర్ 23 నుంచి అంతర్జాతీయ కూచిపూడి డ్యాన్స్ కన్వెకేషన్.
- అమరావతి ప్రభుత్వం భవనాల సముదాయంలో మాస్టర్ ఆర్కిటెక్ట్‌గా- నార్మన్ పాస్టర్
- జనవరి 12,13,14,తేదీల్లో ఎయిర్ షో, అంతర్జాతీయ మ్యూజిక్ ఫెస్టివల్
- ఫిబ్రవరి 9 నుంచి అమరావతిలో జాతీయ మహిళా పార్లమెంటరీ సదస్సు
- జనవరి 20న జీఎస్ఎల్వీ - మార్క్ 3 ప్రయోగం : ఇస్రో చైర్మన్ కిరణ్‌కుమార్
- 19న పోలవరం కాంక్రీట్ పనులకు శ్రీకారం : మంత్రి దేవినేని ఉమా
- 'హజ్ యాత్ర - 2017కు పాస్‌పోర్టు సిద్ధం చేసుకోండి' :ఏపీ హజ్ కమిటీ చైర్మన్ హుస్సేన్
- విజయవాడలో 15 నుంచి పుస్తక ప్రదర్శన : రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.వి.రమణాచారి
- సచివాలయంలో పబ్లిసిటీ సెల్ : మంత్రి నారాయణ
- 20 నుంచి 24 వరకు భవానీ దీక్షల విరమణ
- ఆరు నెలల్లో బాపట్ల గాలి గోపురపు పనులు పూర్తి చేయాలి : ఎమ్మెల్యే కోన



రాత్రింబవళ్లు కరకట్ట ప్రక్కన కృష్ణానదీతీరాన ఇసుకను తోడేస్తున్న దృశ్యం నది ఒడ్డున యంత్రాలతో ఇసుక తవ్వకాలను నిలిపివేయాలని ఇరు తెలుగు రాష్ట్రాలకు జాతీయ హరిత ట్రిబ్యునల్ తాజాగా ఆదేశించింది.

# తీవ్ర తుఫానుగా మారిన 'వార్దా'

## కావలి వద్ద తీరం దాటనున్న 'వర్ద'



**విశాఖపట్నం:** అండమాన్ తీరం వద్ద ఏర్పడిన 'వర్ద' తుపాను కోస్తాంధ్రలోని కావలి వద్ద తీరాన్ని దాటే సూచనలు కనిపిస్తున్నాయని భారత వాతావరణ విభాగం వెల్లడించింది. ప్రస్తుతమిది మచిలీపట్నానికి 870 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉందని అధికారులు తెలిపారు. 12వ తేదీ రాత్రికి ఇది కావలి-బిట్రగుంట సమీపంలోనే తీరాన్నిదాటే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు. అయితే తీరాన్ని దాటకముందే దీని తీవ్రత క్రమంగా తగ్గే అకాశముందని వాతావరణశాఖ భావిస్తోంది. ప్రస్తుతమిది పశ్చిమ వాయువ్యదిశగా గంటకు 22 కిలోమీటర్ల వేగంతో కదులుతోందని వాతావరణశాఖకు చెందిన ఉపగ్రహ ఛాయాచిత్రాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతంస ముద్రంలోనే పెనుతుపానుగా మారిన వర్ద ప్రభావంతో ఆపరిసర ప్రాంతాల్లో గంటకు వంద నుంచి 120 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తున్నట్లు వాతావరణశాఖ తెలిపింది. కోస్తాంధ్ర తీరం వెంబడి గంటకు 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తున్నాయి. మరో వ్కెపు 11వతేదీ రాత్రి నుంచి ఓ మోస్తరు నుంచి విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. కోస్తాంధ్రలోని మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు రాష్ట్ర విపత్తు నిర్వహణశాఖ కూడా జిల్లా యంత్రాంగాలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించాయి. విద్యుత్, సమాచార వ్యవస్థలకు సంబంధించి ప్రత్యామ్నాయ చర్యలు కూడా చేపట్టాలని సీఎం ఆదేశించారు.

**చంద్రబాబు గల్ఫ్ పర్యటన రద్దు**

వర్ద తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గల్ఫ్ పర్యటనను రద్దు చేసుకున్నారు. వర్ద తుపాను, నోట్ల రద్దు అంశాలను సమర్థంగా ఎదుర్కోవాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని నిర్ణయించారు. విపత్తు నిర్వహణ, ఆర్థికశాఖ అధికారులు, బ్యాంకర్లతో శనివారం ఉదయం సీఎం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.

**అధికారులు అప్రమత్తంగా ఉండాలి**

వార్దా తుపానుపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాను ప్రభావిత జిల్లాలైన నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. విద్యుత్ స్తంభాలు, సిమెంటు, నగదు, రేషన్ సరకులు సిద్ధం చేసుకోవాలని సూచించారు.

## 18న మానవతావాదుల మహాసమ్మేళనం

**రాజధానిప్రతినిధి, విజయవాడ :** విజయవాడలోని బెంజ్‌సర్కిల్‌లోని వేదిక ఫంక్షన్‌హాల్ డిసెంబరు మానవతావాదుల మహాసమ్మేళనం సెమినార్ జరుగుతుందని అధ్యక్షుడు వరప్రసాద్ తెలిపారు. శాస్త్రీయ భావాలు,ప్రాధాన్యత,సంఘ సంస్కరణ ఉద్యమాలు, నేటి సమాజం, ప్రపంచీకరణ, మతోన్మాదం, భారతదేశం అంశాలపై ఉదయం 10 గంటల నుంచి 6.30 వరకు ప్రసంగిస్తారు. వల్లభనేని కాశీ విశ్వనాథం రచించిన గోరా నాస్తికుని జీవితం, సరస్వతీ గోరా రచించిన గోరాతో నాజీవితం, లవణం రచించిన నాస్మృతిపథంలో, అబ్రహా కోవూరు జీవితం, హేమాలతాలవణం మృత్యోర్మా అమృతంగమయ, తాయెత్తు గమ్మత్తు, జాషువా కలం చెప్పిన కథ, గోరా రచించిన దేవుని పుట్టుపూర్వోత్తరాలు, మూఢనమ్మకాలు- నాస్తిక దృష్టి, నాస్తికత్వం ఆవశ్యకత, నేను నాస్తికుణ్ణి, డాక్టర్ విజయం రచించిన నోబెల్ సైటిస్టులు, సమాజప్రగతికి మార్గదర్శకులు, నేరస్థ జాతుల సంస్కరణ-కృషిలపై వకుళాభరణం లలిత, గాంధీ, కేహెచ్‌ఎస్ఎస్ సుందర్ ప్రసంగించనున్నారు.








- మా ఊరి "మస్‌జిద్-ఏ-అక్సా" — 2లో
- జగమంత కుటుంబం — 3లో
- త్వరలో హజ్ యాత్ర నోటిఫికేషన్ — 6లో
- ఈ వెతలు తీరేదెన్నడు ? — 7లో
- ఎదురీత ఆమె నైజం — 8లో

# రాజధాని వార్తలు
కలం

## అచితూచి మాట్లాడాలి

ఏదైనా మాట్లాడేటప్పుడు ఒకటికి పదిసార్లు ఆలోచించి మాట్లాడాలనే వాళ్లు పెద్దలు.. ఎందుకంటే అనాలోచితంగా మాట్లాడితే మళ్లీ మనమే చింతించాల్సి వస్తుంది అనేది మాత్రం నిజం.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాటకారి. ఏదైనా తనకు అనుకూలంగా చేసుకుంటారనడంలో సందేహం లేదు. అయితే ఒక్కోసారి అవి గురితప్పి తమకే చేటు చేస్తాయని గుర్తించుకోవలి. సత్యం నాదేళ్ల తన వల్లే అంతపెద్ద పొజిషన్‌లోకి వెళ్లారని, సింధు రియోల్ ఓలంపిక్స్‌లో కాంస్య పతకం సాధించింది తనవల్లే నని చెప్పడం ఆయన ప్రతిష్టను పెంచగపోగా, ప్రతిపక్షాలు జోక్‌లు వేసుకుంటానికి ఆస్కారం ఇచ్చినట్లయ్యింది. నల్లధనాన్ని చట్టబద్దంగా మార్చుకోవడానకి ప్రధాని మోడీ స్వచ్ఛందంగా పన్నుకట్టమని పూర్తి రహస్యంగా వుంచుతామని ప్రకటించిన విషయం తెలిసిందే.. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో ఎవరో 10 వేల కోట్ల నల్లధనాన్ని చట్టబద్దత చేసుకున్నారని, అవి ప్రతిపక్షనాయకుడు వైఎస్ జగన్‌వే అని మంత్రులంతా నానా యాగీ చేశారు. ప్రజలంతా ఒక స్థాయిలో నమ్మేశారు కూడా... ఇదే సమయంలో ఆ పార్టీవాళ్లు ఆడబ్బు ఎవరిదో తెలపాలని ప్రధానికి లేఖరాస్తూ... అత్యంత గోప్యతగా ఉండే పేర్లు బయటకు ఎలా వచ్చాయని అడిగితే బిక్క మొహాలు వేశారు. నిజానికి ఆ పదివేల కోట్లు బాణాపురం లక్షణరావుకు చెందినవని తరువాత తెలిసింది. ప్రధాని మోడీ పెద్దనోట్లు రద్దు చేయగానే
నేనే లేఖరాశాను... ఇదంతా నా ఘనతే అని చెప్పుకున్నారు. పైసాపైసా కూడాబెట్టుకొని పెళ్లిళ్లకోసం , చదువుల కోసం బ్యాంకుల్లో దాచుకుంటే డబ్బులు లేవని, కేవలం ఆరువేలు మాత్రమే తీసుకెళ్లాలని బ్యాంకులు కోరుతున్న నేపథ్యంలో ప్రజల్లో అసహనం రావడాన్ని గమనించిన చంద్రబాబు మాటమార్చారు. పెద్దనోట్ల రద్దు మంచిదేకాని, అమలు సరిగా లేదని,ముందుగా సంసిద్దంగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సన్నాయి నొక్కులు మొదలు పెట్టారు. అంతేకాకుండా నగదు రహిత లావా దేవీలు జరపాలని ప్రజలకు ఉద్బోధిస్తున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అనేక దేశాల్లో పర్యటించిన మంత్రులు కూడా అదే పాట పాడుతున్నారు. అమెరికాలో డబ్బులు జేబులో పెట్టుకు తిరగరని, డెబిట్, క్రెడిట్ కార్డులతోనే అన్ని లావాదేవీలు జరుపుతుంటారని సెలవిస్తున్నారు. అమెరికా పద్దతులకి మనకి పోలికేంటి ? పెద్ద చదువులు చదవకపోయినా వారికి కార్డులు ఉపయోగించే పరిజ్ఞానం ఉంటుంది. ప్రస్తుతం ఇక్కడ అలాంటి పరిస్థితిలేదు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అందునా అప్పుడప్పుడైనా కాస్తోకూస్తో ఆన్‌లైన్ షాపింగ్‌లు చేసేవారే పూర్తి స్థాయిలో నగదురహిత లావాదేవీలు జరపడానికి భయపడుతున్నారు. మరి గ్రామీణుల మాటేమిటి ? అయినా సైబర్‌నేరాలు జరిగితే స్పందించేందుకు ఏ శాఖలు ఏర్పాటు చేశారు ? ఎంతవరకు సామాన్యులకు అవి రక్షణగా నిలుస్తాయి ? అంటే ప్రభుత్వం నోరువిప్పలేని పరిస్థితి.. బ్యాంకు ఖాతాల హ్యాకింగ్‌తో అమెరికాలో డబ్బులు అపహరణకు గురైతే వెంటనే ప్రభుత్వం స్పందిస్తుంది. ఖాతాదారుడు క్లెయిమ్ చేసుకుంటే తప్పకుండా బాధితుడి ఎకౌంట్‌లో తిరిగి డబ్బులు వేస్తుంది. ఆ పరిస్థితి ఇక్కడ అమలు చేస్తామని మంత్రులు హామీ ఇవ్వాలి. అయినా ఇప్పటి వరకు నగదు రహిత కార్యకలాపాలకు ప్రభుత్వాలు చేసిన ప్రయత్నాలు సఫలీకృతం కాలేదు. బంగారం విషయంలోకూడా ఇదే పరిస్థితి... కాబట్టి ఆచితూచి మాట్లాడటం మంచి పద్దతి..

# ట్రిపుల్ తలాక్ అమలువద్దు

- అలహాబాద్ హైకోర్టు సంచలన తీర్పు
- విడాకుల్లో ఇదొక కించపరిచే చర్య అని వర్ణన

**అలహాబాద్ :** ట్రిపుల్ తలాక్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న మహిళాలోకానికి మద్దతునిచ్చే విధంగా అలహాబాద్ హైకోర్టు సంచలన, చారిత్రక తీర్పువెలువరించింది. ట్రిపుల్ తలాక్ నిర్ణయంతో దిక్కుతోచని స్థితిలో జీవితం గడుపుతున్న ముస్లిం మహిళలకు ఊరట కలిగించే విధంగా న్యాయం చెప్పింది. ముస్లిం సంప్రదాయం ప్రకారం పాటించే ఈ చర్య క్రూరమైనదని వ్యాఖ్యానించింది. రాజ్యాంగానికి, మహిళల ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లే విధంగా ఉందని తెలిపింది. కేసును విచారించిన న్యాయమూర్తి సునీత్ కూమార్.. విడాకుల్లో ఇదోకించపరిచే చర్యగా అభివర్ణించారు. హక్కులను కాలరాసే చర్యలకు మద్దతిచ్చేఏలా బోర్డులు రాజ్యాంగం కంటే గొప్పవికావని అన్నారు. ప్రస్తుతం కేసు సుప్రీం కోర్టులో విచారణ కొనసాగుతున్నందున తాను ఇంతకుమించి జోక్యం చేసుకోలేనని స్పష్టం చేశారు. తన భర్త వేరే మహిళకు ఆకర్షితుడై తనకు విడాకులు ఇచ్చాడని, తనకు న్యాయం చేయాలని వేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి పై విధంగా స్పందించారు. వేరే మహిళలకు ఆకర్షితుడై తమ భార్యలకు ట్రిపుల్‌తలాక్ ద్వారా విడాకులు కోరే పద్దతి మహిళల హక్కులను కాలరాయటమేనని చెప్పారు. లా బోర్డులు ఏకపక్ష నిర్ణయాలు ఇవ్వటం సరికాదని పేర్కొన్నారు. ట్రిపుల్ తలాక్‌ను సవాలు చేస్తూ పలువురు మహిళలు, ఎన్‌జీవోలు వేసిన వ్యాజాన్ని గతంలో దేశ అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టి వాదనలు కూడా విన్నది. కేంద్రం ట్రిపుల్ తలాక్‌కు వ్యతిరేకంగా కేంద్రం వాదనలు వినిపించి, స్త్రీ, పురుష సమానత్వానికి ఈ పద్దతి వ్యతిరేకమని పేర్కొంది. అయితే కేంద్ర వాదనను ముస్లిం పర్సనల్ లా బోర్డు వ్యతిరేకిస్తోంది.

**హైకోర్టు తీర్పు ఉత్సాహాన్ని ఇచ్చింది:న్యాయవాది షయనా బానో**

అలహాబాద్ హైకోర్టు తీర్పు ఉత్సాహాన్ని ఇచ్చిందని, ముస్లిం మహిళలకు జరుగుతున్న అన్యాయంపై పోరాడేందుకు ఉపయుక్తమైన తీర్పు అని ఓ ముస్లిం మహిళ తరపున సుప్రీంకోర్టులో వాదిస్తున్న న్యాయవాది షయానా బానో తెలిపారు. ట్రిపుల్‌తలాక్‌తో ఇబ్బందిపడుతున్న మహిళలందరికీ ఇది ఉత్సాహాన్నిచ్చే తీర్పుఅని అన్నారు. ముస్లిం లా బోర్డు స్త్రీ, పురుషులకు సమాన హక్కులు కల్పించే విధంగా నిర్ణయాలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైనదని అన్నారు. సుప్రీం కోర్టులో తమకు అనుకూలంగా తీర్పు వెలువరుతుందన్న ఆశ ఈ తీర్పుతో కలిగిందన్నారు. మత గురువులందరికీ ఈ తీర్పు ఓ సందేశాన్ని పంపిందన్నారు. మహిళలు ఎంత క్షోభ అనుభవిసున్నారో తెలియాల్సిన అవసరం వాళ్లకు ఉందని అన్నారు.


**సుప్రీంలో సవాల్ చేస్తాం:ముస్లిం లా బోర్డు**

హైకోర్టు తీర్పును సుప్రీంలో సవాల్ చేస్తామని ముస్లిం మత గురువు ఖలీద్ రషీద్ ఫిరంగి తెలిపారు. హైకోర్టు తీర్పును గౌరవిస్తున్నామని, అయితే తమకు తీర్పునచ్చని పక్షంలో పైస్థాయి కోర్టులో అప్పీలు చేసుకునే అధికారం రాజ్యాంగం కల్పించిందన్నారు. అఖిల భారత ముస్లిం లాబోర్డు చట్టబద్దంగా నిర్ణయం తీసుకుని ముందడుగు వేస్తుందని చెప్పారు. ఈ తీర్పు కచ్చితంగా సుప్రీంలో వీగిపోతుందన్నారు. మత ధర్మంలో జోక్యం చేసుకోవటానికి ఎవరికి వీలులేదని తెలిపారు. కోర్టు తీర్పు షరియత్‌కు వ్యతిరేకమని చెప్పారు.

**రాజ్యాంగమే అత్యున్నతం**

ట్రిపుల్ తలాక్ తీర్పులో రాజ్యాంగమే అత్యున్నతమైనదని కేంద్ర మంత్రి వెంకయ్య నాయుడు స్పష్టం చేశారు. స్త్రీ, పురుషులకు సమానత్వం కల్పించాలన్నదే తమ ధ్యేయమని, కోర్టు తీర్పుకు మద్దతిస్తున్నామని చెప్పారు.ట్రిపుల్ తలాక్‌తో బాధపడుతున్న మహిళలకు న్యాయం జరగాలని ఆకాంక్షించారు.

– కేంద్ర మంత్రి వెంకయ్య నాయుడు



ప్రముఖ హీరో అక్కినేని నాగార్జున తనయుడు అక్కినేని అఖిల్, ప్రముఖ వ్యాపారవేత్త జీవీ కృష్ణమూర్తి మనవరాలు శ్రియా భూపాల్ నిశ్చితార్థ వేడుకలోని హాజరైన సమంత, నాగ చైతన్య

## ఘనంగా మిలాదున్ నబీ




**రాజధాని ప్రతినిధి :** అంతిమ ప్రవక్త మొహమ్మద్ (స ॥వ॥) జన్మదినాన్ని మిలాదున్ నబీ పండువగా ప్రపంచవ్యాప్తంగా, ఇండ ియాలోని ముస్లింలు జరుపుకుంటారు. ఇస్లామిక్ కాలెండరు ప్రకారం మూడవ నెలలో ఈ పండుగ వస్తుంది. పండుగ రోజైన డిసెంబర్ 12న ముస్లింలు ప్రత్యేక ప్రార్ధనలు జరుపుతారు. మసీదులను ప్రత్యేకంగా అలంకరిస్తారు. ముస్లిం సొదరులు ఒకరికొకరు ఆప్రాయంగా బహుమతులు ఇచ్చుపుచ్చుకుంటారు. ముస్లిం దేశాలలో మిలాదున్ నబీ పండుగను అధికారిక సెలవుదినంగా గుర్తించారు.

## ట్రాఫిక్ పోలీసుల చేతివాటం

**కాకినాడ:** పెద్ద నోట్ల పట్టివేతలో తూర్పుగోదావరి జిల్లా ట్రాఫిక్ పోలీసులు చేతివాటం ప్రదర్శించిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. గత ఆదివారం అర్ధరాత్రి కొవ్వాడ రైల్వే గేటు వద్ద ఓ వాహనంలో తరలిస్తున్న రూ. 84.50 లక్షల పెద్ద నోట్లను ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నారు. అనంతరం నిందితులతో రూ. 5 లక్షలకు బేరం కుదుర్చుకొని.. ముగ్గురిని వదిలేసి, ఒకరివద్ద రూ. 18 లక్షలు మాత్రమే దొరికినట్లు చిత్రీకరించారు.ఈ వ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికి చేరడంతో విచారణ జరిపారు. ట్రాఫిక్ ఎస్సై శంకర్ ప్రసాద్‌తో సహా ముగ్గురు ట్రాఫిక్ పోలీసులను ఎస్పీ రవి ప్రకాశ్ వీఆర్‌లో పెట్టారు. ట్రాఫిక్ పోలీసుల నుంచి రూ 5 లక్షలు రికవరీ చేసినట్లు సమాచారం. తనిఖీల సందర్భంగా వదిలేసిన ముగ్గురు నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## బ్యాంకులకు 3రోజులు సెలవు

**హైదరాబాద్ :** శనివారం నుంచి బ్యాంకులకు మూడు రోజుల పాటు వరస సెలవులు వచ్చాయి. కొత్త నోట్ల కోసం జనం బ్యాంకుల వెంట పరుగులు దీస్తున్న ఈ సంక్షోభ సమయంలో వరసగా మూడు రోజులు సెలవులు రావడంతో తమ పరిస్థితి పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డట్లు అవుతుందని ఖాతాదారులు వాపోతున్నారు. మరోవంక నెల రోజుల బ్యాంకు ఉద్యోగుల కష్టానికి ఈ మూడు రోజుల వరస సెలవును ఉపశమనం కలిగించబోతున్నాయి. తిరిగి బ్యాకులు తెరుచుకొనే నాటికి నగదు మరింతగా అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

# నోట్ల రద్దు బుద్దిలేని నిర్ణయం

- 'పేటీఎం' అంటే 'పే టూ మోడీ'
- విరుచుకుపడిని రాహుల్ గాంధీ



**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేపట్టిన పెద్దనోట్ల రద్దు సాహసోపేతమైన చర్యకాదనీ, మతిమాలిన నిర్ణయమనీ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ విమర్శించారు. ఇ–వాలెట్ సర్వీస్ అయిన 'పేటీఎం' అంటే 'పే టూ మోడీ' అనిఅర్థమన్నారు. పెద్ద నోట్ల రద్దు జరిగి 30 రోజులైన సంర్భంగా పార్లమెంట్ ఆవరణలోని మహాత్మగాంధీ విగ్రహం సమీపంలో ప్రతిపక్షాల నాయకులు మౌనప్రదర్శన నిర్వహించారు. అనంతరం రాహుల్ మాట్లాడుతూ ఇది ప్రధానమంత్రి వ్యక్తిగత ప్రతిపాదన చేసిన ప్రయోగమనీ, ఈ విషయంలో నిపుణులు చెప్పిన ప్రతి అభిప్రాయాన్నీ పక్కనపెట్టి, సాహసోపేతంగా అభివర్ణించుకుంటున్న ఈ నిర్ణయం తీసుకున్నారనీ పేర్కొన్నారు. "కానీ సాహసోసేతమైన నిర్ణయాలు మూర్ఖపు నిర్ణయాలు కూడా కావచ్చు. ఇది మూర్ఖపు నిర్ణయం. ఇది ఈ దేశాలన్ని అల్లకల్లోలం చేసింది" అని అన్నారు. "కంపెనీలు ప్రతిరోజూ మూతపడుతున్నాయి. ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇప్పటివరకూ వంద మందికిపైగా జనం మరణించారు. ఆయన నవ్వుతున్నారు. ఆయనవైఖరి చూస్తుంటే దేశ ప్రజలే ఇబ్బందులు పడుతున్నారు" అని ధ్వజమెత్తారు. "ఇప్పుడు మోడీ నగదురహిత ఆర్థిక వ్యవస్థవైపు మళ్ళుతున్నారు. పేటీఎం వేనుక ఉన్న ఉద్దేశం పేటూ మోడీ (మోడీకి చెల్లించండి) అనే. ప్రతి నగదు లావాదేవీ ద్వారా గరిష్టమైన ప్రయోజనాన్ని కొద్దిమంది వ్యక్తులు పొందుతారు. జరుగుతున్నది అదే. ఇది దేశాన్ని దారుణంగా నాశనం చేస్తుంది. ప్రజలని, ముఖ్యంగా రైతులు, కార్మికులు తదితరుల ప్రయోజనాలు దెబ్బతీస్తుంది" అని ఆరోపించారు. లోక్‌సభలో చర్యనుంచి మోడీ పారిపోతున్నారని వ్యాఖ్యానించారు.

## పోలీస్ కానిస్టేబుల్ దేహదారుడ్య పరీక్షలు వాయిదా

**రాజధాని ప్రతినిధి, వెలిశెట్టి కేశవరావు – నెల్లూరు :** ప్రతికూల పరిస్థితుల దృష్ట్యా ఈ నెల 9 నుంచి జరగాల్సిన పోలీస్ కానిస్టేబుల్ దేహదారుడ్య పరీక్షలు ఈ నెల 19 కి వాయిదా వేసినట్లు ఎస్పీ విశాల్ తెలిపారు. బుధవారం ఉమేష్ చంద్ర కాన్ఫెరెన్స్ హాల్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 9 నుంచి దేహదారుడ్య పరీక్షలు జరగాల్సి ఉందని, ప్రతికూల పరిస్థితుల దృష్ట్యా 19 నుంచి 24 వరకు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. 9వ తేదీ హాజరు కావాల్సి అభ్యర్దులు 19వ తేదీన, 10వ తేదీ వారు 20వ తేదీ, 11న అభ్యర్దులు 21న, 12న అభ్యర్దులు 22, 13 అభ్యర్దులు 23న అలాగే 14వ తేదీ అభ్యర్దులు 24న హాజరు కావాలన ఆయన కోరారు.

## 15 నుంచి కొత్త 500 నోట్లు

**న్యూఢిల్లీ :** సంక్షోభకాలంలో ఇదొకరకంగా శుభవార్తే. మరో వారం రోజుల్లో దేశవ్యాప్తంగా కొత్త 500 నోట్లు విస్తృతంగా అందుబాటులోకి రాబోతున్నాయి. ఈనెల 15నుంచి అవి భారీగా బ్యాంకులకు, ఏటీఎంలకు చేరస్తున్నాయి. రిజర్వుబ్యాంకు గవర్నర్ ఉర్జిత్ పటేల్ ఈ విషయం ప్రకటించారు. ప్రతి రోజూ 5వేల కోట్ల రూపాయలను అందుబాటులో ఉంచుతామని స్పష్టం చేశారు. ప్రస్తుతం అటు బ్యాంకుల్లోనూ, ఇటు ఏటీఎంల్లోనూ కొత్త 2000 రూపాయల నోట్లు మాత్రమే ఎక్కువగా అందుబాటులో ఉండటంతో వినియోగ దారులనుంచి భారీ ఎత్తున నిరసన వ్యక్తం అవుతున్న సంగతి తెలిసిందే. ఈ సమస్యను కొత్త రూ.500 నోట్ల విడుదలతో పరిష్కరించాలని ఆర్బీఐ నిర్ణయించింది.

## రిసోర్స్‌శాట్ 2ఏలో ఆన్‌బోర్డ్ కెమెరాలు

**చెన్నై :** ఇస్రో ఆంధ్రప్రదేశ్ శ్రీహరికోట నుంచి ప్రయోగించిన రిసోర్స్‌శాట్ 2ఏ ఉపగ్రహంలో ఆన్‌బోర్డ్ కెమెరాలు పూర్తి స్పష్టత లభించేందుకు వీటిని అమర్చినట్టు ఇస్రో పేర్కొంది. అంతరిక్ష కక్షలోనికి ప్రవేశించినప్పుడు రాకెట్ భాగాలు విడిపోవటాన్ని, సోలార్ ప్యానల్స్‌ను వెలుపల అమర్చిన కెమెరా ద్వారా స్పష్టంగా చూడవచ్చు అని వెల్లడించింది. మరో కెమెరా ద్వారా మెటార్ల స్టాప్లు, హీట్ షీడ్స్‌ను పరిశీలించే అవకాశం ఉన్నట్లు తెలిపింది. రాకెట్‌పై అమర్చిన ఈ కెమెరాలు బంధించిన దృశ్యాలను ఇస్రో వెబ్‌సైట్‌లో ఉంచింది.

## 'ఉత్తుత్తి' పార్టీలపై ఈసీ వేటు?

**న్యూఢిల్లీ :** ప్రపంచంలోనే అతి ఎక్కువ సంఖ్యలో రాజకీయ పార్టీలున్న దేశం మనది. దేశంలో సుమారు 1,900 రాజకీయ పార్టీలు ఉన్నాయి. కానీ వీటిలో ఏ ఎన్నికలోనూ, ఎన్నడూ పోటీ చెయ్యని పార్టీలు 400కు పైగానే ఉంటాయని ప్రధాని ఎన్నికల కమిషనర్ నసీమ్ జైదీ పేర్కొన్నారు. నల్ల డబ్బును తెల్ల ధనంగా మార్చుకోవడం కోసమే ఇవి నడుస్తూ ఉండొచ్చున్న అనుమానాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అలాంటి పార్టీలను తన జాబితాలోంచి తొలగించి కసరత్తును ఎన్నికల సంఘం ప్రారంభించింది. "వాటి పేర్లను తొలగించినట్టయితే చందాలు, విరాళాలమీద ఉన్న ఆదాయపు పన్ను మినహాయింపు వాటికి వర్తించకుండా పోతుంది" అని జైట్లీ పేర్కొన్నారు. పార్టీల జాబితాను ఏడాదికోసారి దిద్దుబాట్లు చేస్తారని తెలిపారు. వాటిని రిజిస్ట్రేషన్‌ను ఎన్నికల సంఘం ఎందుకు రద్దు చెయ్యడం లేదన్న ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ అది సుదీర్ఘప్రక్రియ అని అన్నారు. "చివరికి మేం ఆ పని చెయ్యొచ్చు, క్రమరహితంగా ఉన్న వాటిని గుర్తించడం ఈసీ తీసుకుంటున్న తక్షణ చర్య" అని తెలిపారు. ఏ ఎన్నికలోనూ, ఎన్నడూపోటీచెయ్యని, రిజిస్టర్ అయిన రాజకీయ పార్టీల జాబితాలో సమగ్రనివేదిక ఇవ్వాల్సిందిగా రాష్ట్రాల సిసిఇలను కోరామనీ, అలాగే వాటికి వచ్చిన విరాళాలు, చందాల వివరాలు కూడా పంపమని సూచించామనీ ఆయన చెప్పారు. రిజిస్టర్డ్ పార్టీల జాబితా నుంచి ఏటా తొలగింపుల ప్రక్రియ ఇక నుంచి కొనసాగుతుందని వెల్లడించారు.




## ఎస్‌వీఆర్,ఎస్ఆర్, ఎన్ఎస్ఆర్ జూనియర్‌కాలేజి రజతోత్సవ ఏర్పాట్లు





ముఖ్యఅతిథిగా హాజరైన మల్లెల హరేంద్రనాద్ చౌదరి, శ్రీ గోగినేని కనకయ్య చేతుల మీదుగా ముఖ్యమంత్రి ప్రతిభాపురస్కారం అందుకుంటున్న బాలమ్మ, పక్కన ప్రిన్సిపల్ పి.సాల్మన్‌రాజు, మాజీ ప్రిన్సిపల్ జె.ఎస్.ఆర్.ప్రసాద్ (ఫైల్)

**రాజధాని ప్రతినిధి :** తుళ్ళూరు ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలోని శ్రీరావెల వెంకట సుబ్బారావు , నాగళ్ళ శేషగిరి రావు జూనియర్ కళాశాల మార్చిలో రజతోత్సవం జరుపు కోనుంది. తుళ్ళూరు మండలంలోని 21 గ్రామా లకు ఉన్న ఏకైక కళాశాల ఇది. డిసెంబర్ 1991లో తుళ్ళూరు గ్రామానికి చెందిన ప్రముఖ విద్యావేత్త ఆర్‌వీఆర్ బీఈడీ కాలేజీ కరస్పాండెంట్ గద్దే మంగయ్య , నాగార్జున వర్సిటీ మాజీ రిజిస్ట్రాట్ రావెల మంగయ్యలు ఈ కాలేజీని నెలకొల్పారు. గుంటూరు టుబాకో కంపెనీ యాజమాని మాదల రాజేశ్వరరావు, నాగళ్ల శేషగిరి రావు ఈ కళాశాలకు అన్నివిధాలుగా సహాయ సహకారాలు అందించారు. దీంతో ఎస్.వి.ఆర్. ఎస్.ఆర్ & ఎన్.ఎస్.ఆర్ జూనియర్ కళాశాలగా అవతరించింది, దీనికి గద్దె వెంకటేశ్వరరావు (దేవుడు), తొట్టెంపూడి నారాయణరావు , జొన్నలగడ్డ వీరభద్రయ్య, జొన్నలగడ్డ శంకరరావు, మరికొంతమంది ప్రముఖులు దీని అభివృద్ధికి సహకరించారు.

**మొదటి బ్యాచ్**

జమ్ముల హనుమంతరావు వద్ద ప్రైవేట్‌గా ఇంటర్మీడియట్ చదువుతున్న 42 మంది విద్యార్థినీ విద్యార్థులను ఈ కళాశాలకు అప్పగించారు. ఈకళాశాల మొదటి వార్షికోత్సవనికి రాయపాటి సాంబశివరావు ఎంపీ, ముఖ్యఅతిధిగా ఆయన సోదరుడు, జిల్లాపరిషత్ మాజీ ఛైర్మన్ రాయపాటి శ్రీనివాస్,. కళాశాల కమిటి అధ్యక్షులు రావెల వెంకటసుబ్బారావు, ఆనాటి తాడికొండ అసెంబ్లీ ఎమ్మెల్యే డా॥ టి.వెంకయ్యలు హాజరయ్యారు. అతిధులుగా ఆర్‌ఐఓ , గుంటూరుకు చెందిన ఆనాటి డీఈఓ భీమశంకరశాస్త్రి, విశిష్ట అతిధిగా విద్వాన్ శ్రీ గోగినేని కనకయ్య కళాశాల కరెస్పాండెంట్ గద్దె మంగయ్యలు హాజరయ్యారు.

**ప్రధమ సిబ్బంది నియామకము**

ఈ కాలేజీలో గంజి పీటర్ సాల్మన్‌రాజు ఇంగ్రీషు లెక్చరర్‌గా, మందపాటి రాజ్యలక్ష్మి తెలుగు, పువ్వాడ అన్నపూర్ణ ఎకనామిక్స్ , శ్రీ జమ్ముల శివరామప్రసాద్ కామర్స్ , ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్, గుంటి యోగయ్య సివిక్స్ లెక్చరర్‌గా, రావెల సుభద్రాదేవి కళాశాల ప్రిన్సిపల్‌గా ఆహ్వానింపబడ్డారు ఈమె తుళ్ళూరు గ్రామ ఆడపడుచు ఆమె 1993 జనవరిలో ప్రిన్సిపల్‌గా చార్జి తీసుకొని కళాశాలను పురోగతి కి తోడ్పడ్డారు. జె.ఎస్.ఆర్. ప్రసాద్ ప్రిన్సిపల్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ జూనియర్ కళాశాలను డిగ్రీ కళాశాలగా రూపొందించారు. తర్వాత బాధ్యతలను చేపట్టిన పి.రాంబాబు డీన్‌గా వ్యవహరించారు.

**గంజి పీటర్‌సాల్మన్‌రాజు ప్రిన్సిపల్‌గా బాధ్యతలు స్వీకరించి**

కళాశాల అభ్యున్నతికి , వికాసానికి మార్గం వేశారు. క్రికెట్‌లో తనకున్న అనుభవంతో పిల్లలందరికి శిక్షణ ఇచ్చారు. అంతేకాకుండా స్పోకెన్ ఇంగ్లీష్ బోధనతో కళాశాల ఉన్నతికి సోపానాలను వేశారు. కళాశాల అత్యున్నత స్థాయి పురస్కారం కుమారి బాలమ్మ ప్రతిభా పురస్కారం పొందినది వీరి సమయంలోనే

**2012 నుండి 2014 వరకు :**

ప్రిన్సిపల్‌గా పనిచేసిన శ్రీ పి.సుబ్బారావు గారు స్నేహశీలి. పిల్లలకు మంచి మిత్రులుగా మెలిగారు.

**2014 నుండి 2016 వరకు**

సరిత ప్రిన్సిపల్‌గా ఉన్న సమయంలో కళాశాల వికాసానికి కృషిచేసారు. 2016 జూన్ నుండి పి.సుబ్బారావు హయాంలోనే కళాశాల రజితోత్సవం జరుపుకోనుంది.

**కళాశాలను సందర్శించిన అతిధులు**

ప్రముఖ రచయిత జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ మొదటి వార్షికోత్సవానికి విచ్చేసారు. సీనియర్ ఐపీఎస్ అధికారులైన అంజనా సిన్హా, తెలంగాణ డీజీపీ కూడా విచ్చేశారు. విద్యాన్ గోగినేని కనకయ్య కళాశాలకు వితరణలు ఇచ్చారు. గుంటూరుకు చెందిన డా. ఆలా వెంకటేశ్వర్లు , రాయపూడి వాసులు మల్లెల హరేంద్రనాద్ చౌదరి కళాశాలకు ముఖ్య అతిధులుగా విచ్చేసారు. ఈ కళాశాల 25వ సం॥లో ప్రవేశించి రజతోత్సవం జరుపుకోవటం ఆనందించదగ్గ విషయం ఉత్తమ విలువలతో నిర్వహిస్తున్న ఈ కళాశాల రజతోత్సవానికి పూర్వ విద్యార్థులందరిని సమీకరించుకొని ఒక పూర్వవిద్యార్థి కమిటి గా ఏర్పడి విద్యావికాసానికి కృషి చేయాలని ప్రజలుకోరుతున్నారు.

# మార్చి 1 నుంచి ఇంటర్ 17 నుంచి టెన్త్

**రాజధాని ప్రతినిధి–విజయవాడ :** ఇంటర్, టెన్త్ పరీక్షల షెడ్యూలు ఖరారైంది. వెలగపూడి సచివాలయంలో సంబంధిత అధికారులతో సమావేశమైన అనంతరం మంత్రి గంటా శ్రీనివాసరావు పరీక్ష తేదీలను ప్రకటించారు. ఇంటర్‌మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలు మార్చి 1 నుండి ద్వితీయ సంవత్సరం నుండి మార్చి 2వ తేదీ నుండి ప్రారంభమవుతాయని మంత్రి వెల్లడించారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఈదఫా జబ్లింగ్ విధానంలో జరుగుతాయని స్పష్టం చేశారు. ప్రతి సంవత్సరం ప్రభుత్వం జబ్లింగ్ విధానంలో జరపాలని ప్రకటించడం, పరీక్ష తేదీలు దగ్గరపడిన తర్వాత ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల ఒత్తిడికి తలొగ్గి ఉపసంహరించుకోవడం ఓ తంతుగ మారిన విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకురాగా, ఈసారి అటువంటిదేమీ వుండదని జంబ్లింగ్ విధానం ఖచ్చితంగా అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. ఖాళీగా వున్న భర్తీ ప్రక్రియ త్వరలో చేపడతామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 986 పోస్టుల భర్తీకి ముఖ్యమంత్రి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని తెలిపారు. ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీలను కూడా త్వరలో భర్తీ చేస్తామన్నారు. విశాఖపట్నం జిల్లా మధురవాడ ప్రాంతంలోని చంద్రపాలెం గ్రామం వద్ద ఓ ప్రభుత్వ పాఠశాలను సకల సదుపాయాలతో మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దామని, ఇదే తరహాలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి డివిజన్‌లో ఒక స్కూలును ఆదర్శ పాఠశాలగా అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి వివరించారు. జ్యోతిరావుపూలే సతీమణి సావిత్రీభాయి జయంతిని పురస్కరించుకొని జనవరి 3వ తేదీన ఇక ప్రతి సంవత్సరం మహిళా ఉపాధ్యాయ దోనోత్సవం జరపాలని నిర్ణయించినట్లు మంత్రి ప్రకటించారు.

మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రీభాయి మహిళా విద్యాభివృద్ధి కోసం విశేష కృషి చేశారని, వారు అన్నిరంగాల్లో రాణించాలని తపించేవారని గుర్తు చేశారు. మహిళా ఉపాధ్యాయులు ఆమెను స్ఫూర్తిదాయకంగా తీసుకునేలా ఆమె జయంతి రోజును ఇక మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపునున్నామన్నారు. రాష్ట్రంలోని పాఠశాలలన్నీ తమ వార్షికోత్సవాలను వసంతోత్సవం పేరిట ఘనంగా నిర్వహించాలని ఆదేశాలిచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతోపాటు, వారి తల్లిదండ్రులను కూడా భాగస్వాములను చేసి ఒక పండుగ వాతావరణాన్ని నెలకొల్పేలా నిర్వహించాలని మంత్రి పిలుపునిచ్చారు.

# జగమంత కుటుంబం

**ఏకాకి జీవితం ఆమెది...**



ఆమె


జీవితం వడ్డించిన విస్తరి కాకపోయినా, తీవ్రస్థాయిలో ఆటుపోట్లు ఎదురైనా ఒంటరి మహిళ ఒక శక్తిగా మారి రాష్ట్ర చరిత్రలో తన స్థానాన్ని పదిలం చేసుకున్న విజయలలిత జీవితం నుంచి స్ఫూర్తిగా తీసుకోవాలని...

మూడేళ్లకే తండ్రిని కోల్పోయిన కూతురు. కుటుంబ పోషణ కోసం తల్లి కూతుర్ని పిన్ని దగ్గర వదిలేసింది. అక్కడే చాలా కాలం పెరిగింది. కూతురు భవిష్యత్ కోసం కాన్వెంటులో చేర్చారు. అక్కడ అన్నీ ఉన్నా... ఎవరూ లేని జీవితం అది ఎవరిదో కాదు.. దివంగత తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత..ఒకసారి స్కూల్లో అమ్మ గురించి నిర్వహించిన కాంపిటీషన్‌లో తన బాధనే వ్యక్తం చేసిన ఆమె స్కూల్ సిస్టర్ల మనసును కదిలించింది. అప్పటి నుంచే ప్రతి ఏడాది ఎండాకాలంలో ఒకసారైనా ఇంటికి పంపాలని నిర్ణయం తీసుకునేట్లు చేసింది. అప్పటి నుంచి ఎప్పుడూ ఆమె ప్రేమరాహిత్యాన్నే ఎక్కువగా అనుభవించారు. నమ్మక ద్రోహాలు, రాజకీయ వైకుంఠంపాళిలో ఆమె నిచ్చెనలు ఎక్కడం, పాములకు బలవడం అదో నిరంతర ప్రక్రియగా జరిగిపోయాయి. నిజానికి ఆమె ఎదుర్కొన్న అవమానాలు అన్నీ ఇన్నీకావు... పాపం ఎన్నిరాత్రుళ్లు ఆమె కళ్లు ధారాపాతంగా వర్షించాయో... అసెంబ్లీలో ద్రౌపదిలా వస్త్రాపహరణానికి గురైన ఘటన బహుశ ఆమెను జీవితాంతం బాధించి ఉంటుందేమో... అది మగపురుగు అహంకారాన్నికి పరాకాష్టగా చెప్పుకోవచ్చు. అయినా తననితాను ఓదార్చుకుంది, బాధను ఓర్చుకుంది, రెట్టింపు శక్తి కూడగట్టుకొని రాజ్యాధికారాన్ని పొందింది. అంతకంతకూ పగతీర్చుకుంది. ఆమె పరిస్థితుల్లో మరొకరు ఉంటే ఎప్పుడో కుంగిపోయి ఉండేవారు. ఆత్మహత్యకు పాల్పడి ఉండేవారు. పరాజితులుగా మిగిలిపోయేవారు... అయితే విజయలలిత అంత తేలిగ్గా ఓటమిని అంగీకరించరు. విజయం సాధించేవరకు ఆమె పట్టు విడవరు. ఆ సంకల్పబలమే ఆమెను అత్యున్నత స్థాయిలో నిలిపింది.

సామాన్య కుటుంబంలో పుట్టినప్పటికీ అసామాన్య ధైర్యసాహసాలు ఆమె సొంతం. నిర్ణయం తీసుకుంటే ఎంతటి వారు చెప్పినా తాను ఎలాంటి ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొన్నా మొక్కవోని ధైర్యంతో ముందడుగు వేయడం జయలలిత నైజం...అదే ఆమెను ఎవ్వరికీ దగ్గరకానీకుండా చేసింది... అదే ఆమెను అమ్మగా ప్రజల ముందు నిలబెట్టింది. దిగువమధ్య,, మధ్య తరగతి కుటుంబాలకు ఆమె విస్తరించిన సంక్షేమ పథకాలు అన్నీ ఇన్నీకావు. అప్పుడే పుట్టిన వారి నుంచి పండు ముదుసలి వరకు ఆమె ప్రజాపథకాలు వినియోగించుకుంటారు. మహిళల కోసం విద్యా, వైద్య సేవలు, గ్రామీణ మహిళలకోసం స్వయం సహాయ గ్రూపులు ఆమెను ఎంతో ఎత్తుకు నిలిపాయి. అందుకే ఆమె మరణాన్ని వెల్లడించడానికి సైతం ఆసుపత్రి వర్గాలు వెనుకడుగు వేశాయి. కేంద్ర రాజకీయ నాయకులు సైతం వెంటనే ఒక ప్రకటన చేయడానికి జంకారు. ప్రస్తుతం అన్నాడీఎంకే పార్టీ పరిస్థితి కాలమే నిర్ణయించాలి. అమ్మలేని రాష్ట్రం ఎలా మనగలుగుతుందో వేచి చూడాల్సిందే...









## బ్యాంకుల ముందు భారీ జనం

**మేడికొండూరు :** రూ.500, రూ.1000 నోట్ల రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో బ్యాంకుల ఎదుట ప్రజలు బారులు తీరున్న సంగతి విధితమే. మండలంలోని పేరేచర్ల ఎస్‌బిఐ వద్ద సోమవారం ఖాతాదారులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. నెలారంభం కావడంతో సాధారణ ప్రజలకు తోడుగా పింఛన్ దారులు, జీతాల కోసం ఉద్యోగులు క్యూలైన్లలో నిలుచోవడంతో క్యూ లైన్ల దూరం పెరిగి పోయింది. తమ డబ్బులు తాము తీసుకోవడానికి క్యూలైన్లో గంటల కొద్ది నిలబడాల్సి వస్తుందని వృద్ధులు, ఉద్యోగస్తులు వాపోయారు.

## సత్యనారాయణ స్వామి కళ్యాణోత్సవాలు

**బాపట్ల :** పట్టణంలోని విజయలక్ష్మీపురంలో వేంచేసి ఉన్న శ్రీ షష్టిదేవీ సమేత శ్రీ సత్యనారాయణస్వామి కళ్యాణోత్సవాలు నిర్వహించారు. శ్రీ సత్యనారాయణస్వామి కళ్యాణోత్సవాల్లో ఎమ్మెల్సీ ప్రభాకర్, ఆలయకమిటీ చైర్మన్ హరినారాయణ, శ్రీనివాస్, అర్చకులు వరప్రసాద్, నెమలికంటి హనుమంతరావు పాల్గొన్నారు.

## బంగారం నిల్వలపై వివరణ ఇవ్వాల్సిందే...

**రాజధాని ప్రతినిధి, ఢిల్లీ :** ప్రభుత్వం నల్లధనంపై యుద్ధం ప్రకటించింది కాబట్టి పన్ను చెల్లింపుదారులు తమ ఆస్తులతో పాటు బంగారం, నగల వివరాలను వెల్లడించాల్సి ఉంటుందని పన్ను నిపుణులు చెబుతున్నారు. కేంద్రబడ్జెట్ 2015లో ఆర్థికమంత్రి సంపదపన్నును పూర్తిగా ఎత్తివేశారు. ఒక వేళ మీ వద్ద రూ.30లక్షల కంటే ఎక్కువ మొత్తంలో బంగారం నగలు ఉంటే మాత్రం టాక్స్ రిటర్న్‌లో వాటిని ప్రస్తావించాలి. ఆ విలువపై ఒక శాతం పన్ను కట్టాల్సి ఉంటుంది. సంపద పన్ను తొలగించిన వెంటనే ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ఏడాదికి రూ.50 లక్షల కంటే ఎక్కువ ఆదాయం సంపాదించేవారు 2016-17 మదింపు సంవత్సరంలో తమ ఆస్తులు, అప్పుల పట్టీను ఐటీఆర్ (ఇన్‌కంటాక్స్ రిటర్న్) ఫైల్ చేయాలని పేర్కొన్నారు. ఒక వేళ ఈ ఆర్థిక సంవత్సరం రిటర్న్‌లో బంగారం వివరాలు ఇస్తే... అవన్నీ ప్రాసెస్ అయిన తర్వాత మీరు దిగులు చెందాల్సిన పనిలేదని వ్యక్తిగత పన్ను నిపుణులు చెబుతున్నారు.

## వాల్మీకి ఫెడరేషన్‌కు రూ.1,000 కోట్లు కేటాయించాలి

**కర్నూలు :** వాల్మీకుల ఎస్‌టి జాబితా కోసం ప్రాణత్యాగానికి సిద్ధమేనని వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎం సుభాష్ చంద్రబోస్ అన్నారు. వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని కోరుతూ ఈ నెల 16 నుండి మూడు రోజుల పాటు కర్నూలులోని కృష్ణదేవరాయలు సర్కిల్‌లో సత్యాగ్రహం చేస్తున్నట్లు తెలిపారు. వాల్మీకులను ఎస్‌టిలుగా గుర్తించే ప్రక్రియ ఆరు నెలల వ్యవధిలోనే పూర్తి చేసి, చట్టబద్ధత కల్పించాలని, వాల్మీకి ఫెడరేషన్ వెయ్యికోట్ల రూపాయలు నిధులు కేటాయించాలని తదితర డిమాండ్ల సాధన కోసం ఈ నెల 16 వ తేది నుండి మూడు రోజుల పాటు సత్యాగ్రహం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి వాల్మీకులంతా కలసి రావాలని ఆయన పిలుపు నిచ్చారు.

# నోట్ల రద్దుతో స్తంభించిన ఆర్థిక వ్యవస్థ

- పీకల్లోను ఇబ్బందుల్లో ప్రజలు
- వ్యవసాయ పనులకు తీవ్ర ఆటంకం
- ఇప్పటికే నాగా తీవ్రవాదుల ఆర్థిక దిగ్భంధంతో నష్టం

**ఇంఫాల్ :** పాత పెద్ద నోట్ల రద్దు మణిపూర్‌పై పెను ప్రభావం చూపుతోంది. ఇప్పటికే నెలరోజుల క్రితం ఆర్థిక దిగ్భంధం నేపథ్యంలో నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటడంతో ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇపుడు నోట్ల రద్దు మరోసారి వారిపై దెబ్బ వేసి అదే పరిస్థితిలో కొట్టుమిట్టాడేలా చేస్తోంది. సదర్ హిల్స్, జిరిబం జిల్లాల ఏర్పాటును వ్యతిరేకిస్తూ యునైటెడ్ నాగాకౌన్సిల్ విధించిన దిగ్భంధంతో ఇంధన సంఘరాలతోపాటు అనేక ఆంక్షలు ఏర్పడ్డాయి. భారత్‌లోని మిగతా ప్రాంతాల్లో మాదిరిగానే రాష్ట్ర ప్రజలు బ్యాంకులు, ఏటీఎంల ముందు బారులుదీరాల్సిన దుస్థితి నెలకొంది. పెట్రోల్, డీజిల్‌ను మాత్రం పరిమితంగా పంపిణీ చేస్తున్నారు. వ్యవసాయ పనుల్లో సమయంలో రూ.500, వెయ్యి నోట్ల రద్దుతో అనేక మంది రైతులు తమ వ్యవసాయ కూలీలకు రోజువారీ చెల్లింపులు కష్టసాధ్యంగా మారింది. మరోవైపు, గ్రూపుల్లో రూ.2 వేల కొత్త నోట్లను కార్మికులకు చెల్లిస్తున్నారు. దీంతో వారు వేతనాలు అందుకోవడంతో జాప్యం ఫలితంగా తమ రోజువారీ అవసరాలను తీర్చుకునేందుకు అప్పులపై ఆధారపడుతున్నారు. చిల్లర నోట్లుగా మార్చుకోవడం సంక్లిష్టంగా మారింది. 'ఇది పెద్ద సంక్షాభం. వ్యవసాయ పనుల సమయం కావడంతో కూలీలకు చెల్లింపులు జరిపేందుకు పాత నోట్లను ఏడాది కాలంగా ఉంచుకున్నా అయితే ఆకస్మికంగా అవి చెల్లుబాటు కాకుండా పోయాయి. కూలీలు పాత నోట్లను తీసుకునేందుకు విముఖత చూపుతున్నారు' అని కౌలు రైతు బొరె సింగ్ తెలిపారు. కొన్ని నెలలుగా నా కష్టమంతా వృథా అయ్యింది. 'సాగుకు ఇబ్బందికాకుండా కూలీలకు ఎలా చెల్లింపులు జరపాలనే విషయాన్ని ఆలోచిస్తున్నా' అని చెప్పారు. ప్రస్తుత నోట్ల రద్దు చర్యతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని వ్యవసాయ పనుల్లో రోజుకు రూ. 350 సంపాదిస్తున్న మేలమ్ రంజన్ అనే కూలీ వాపోయాడు. వ్యవసాయ పనుల సందర్భంగా కూలి కోసం రెండు నుంచి మూడు రోజులు ఆగుతామని, అయితే నగదు విత్‌డ్రా పరిమితుల కారణంగా బ్యాంకుల నుంచి తగినంత డబ్బు తీసుకోవడానికి కూడా రైతులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని ఆయన చెప్పారు. 'రోజువారీ కూలి పొందకపోతే మేము ఏమీ చేయాలి. కేవలం రైతులే కాదు. ప్రతి ఒక్కరూ ఇబ్బందులు పడుతున్నారు. కానీ రోజుముగిసే సమయానికి ఇంటికి తిండి తీసుకువెళ్లడమే పెద్ద ప్రశ్నఅని పేర్కొన్నారు. పొలాలను వదిలి ప్రజలు బ్యాంకులు, ఎటీఎంల ముందర క్యూల్లో నిల్చొని ఉంటున్నారు. ఆర్థిక దిగ్బంధం విధించినపుడు కూడా నిత్యావసరాల కోసం ఇదే పరిస్థితి ఎదుర్కొన్నామని వివరించారు. మరో రోజు ప్రజలు రాత్రంతా క్యూలోనే నిల్చొని ఉండాల్సిన దుస్థితి. మరుసటి రోజుకుగానీ వారికి పెట్రోల్ పంపిణీ జరగలేదని ఇంఫాల్ శివారులోని ఒక సర్వీసు స్టేషన్‌లో పని చేసే రోమేష్ దొక్‌చెమ్ అనే ఉద్యోగి చెప్పారు.

# మన కోసం

### జనరల్ స్టోర్స్

| | | | |
|---|---|---|---|
| శ్రీ విజయలక్ష్మి | తుళ్ళూరు | చందోలు సత్యనారాయణ | 9441411432 |
| ఎపి.ఎస్.ఆర్. | తుళ్ళూరు | పురపాటి శ్రీనివాసరావు | 94411 28030 |
| ఖాజా ఖాదార్ | రాయపూడి | షేక్ జానీ | 9948450761 |
| తేజశ్వి | మందడం | నన్నపనేని నరేష్ | 9063631234 |
| దాదా | రాయపూడి | కౌసర్ | 99890 35143 |

### రియల్ ఎస్టేట్

| | | | |
|---|---|---|---|
| శ్రీ సాయిరామ్ | తుళ్ళూరు | పి. పోతురాజు | 9985853188 |
| వంశీకృష్ణ | పెదపరిమి | ఎ.రాము | 9848551688 |
| క్యాపిటల్ | తుళ్ళూరు | వి.వీరాంజనేయులు | 9346229631 |
| నాగార్జున | రాయపూడి | చెరుకూరి బాబి | 7287098458 |
| రియల్‌టర్స్ | రాయపూడి | ఎండి ఆదామ్ | 9441754056 |

### సెలూన్ షాప్

| | | |
|---|---|---|
| వెస్ట్రన్‌లుక్ | పెనుమాక గోపి | 9908183377 |

### రెస్టారెంట్స్

| | | | |
|---|---|---|---|
| గోదావరి రుచులు | తుళ్ళూరు | యన్.రామరాజు | 9703908055 |
| బిర్యానిస్ | విజయవాడ | ------- | 7032202222 |
| శ్రీ విజయ గణపతి బ్రాహ్మణ | విజయవాడ | కె.లక్ష్మి,గణపతి | 9948462515 |
| అతిధి | వెలగపూడి | సందీప్ | 9441 228460 |
| చినస్వామి రాజధాని | సచివాలయం ప్రాంతం | | 9963441052 |
| శ్రీ దుర్గావిలాస్ | మల్కాపురం | కె.వి.రాజు | 94908 50243 |
| అయ్యప్పభోజనం | వెలగపూడి | | 99084 57372 |

### జ్యూయలర్స్

| | | | |
|---|---|---|---|
| లలిత | తుళ్ళూరు | నాలమాలు మధు | 7905505854 |
| రాజా | తుళ్ళూరు | ప్రభురాజా | 9581500500 |

### షాప్స్

| | | | |
|---|---|---|---|
| రేమాండ్స్‌టైలర్స్ | తుళ్ళూరు | ఎస్.కె. జాని | 9492470426 |
| వర్షిత ఫోటోస్టాట్ | రాయపూడి | పోతురాజు | 9985853188 |
| రాయల్ ఫర్నిషింగ్స్ | తుళ్ళూరు | కె. సుబ్బారావ | 9492485385 |
| బిస్మిల్లా పెయింటింగ్ వర్క్స్ | రాయపూడి | షేక్. మజీదు | 7095880828 |
| కె.జి .ఎన్. కారు ట్రావెల్స్ | రాయపూడి | ఎస్.కె.సుబాని | 97040 74820, |
| సి .ఓ వైభవ్ డ్రస్సెస్ | తుళ్ళూరు | వెంకట పున్నారావు | 08645-244484 |
| చైతన్య గోదావరి | | | |
| గ్రామీణ బ్యాంకు | రాయపూడి | | 08645244266 |
| శైవక్షేత్రము | తాళ్ళాయపాలెం | శివస్వామిజీ | 08863297856 |
| ఉంగరాల హుస్సేన్ టెంట్‌హౌస్ | రాయపూడి | ఉంగరాల . ఖాజ | 9441275466 |
| అంజుమన్ టెంట్ హౌస్ | రాయపూడి | పఠాన్ బాషా ఖాన్ | 9502085516 |
| లాస్య డిజిటల్ స్టూడియో | రాయపూడి | రవికుమార్ | 9491647400 |
| స్టైల్ ఫర్ మెన్ | తుళ్ళూరు | ఎస్.ఎమ్.జాని | 94403 07123 |

### ట్రేడర్స్

| | | | |
|---|---|---|---|
| సాయి గణేష్ | వెలగపూడి | జొన్నలగడ్డ మనోజ్ కుమార్ | 7382371111 |
| శ్రీ చంద్రిక | రాయపూడి | కోలా శ్రీనివాసరావు | 9908073516 |

### ఎలక్ట్రికల్ వర్క్

| | | | |
|---|---|---|---|
| ఫయాజ్ | రాయపూడి | షేక్. కలాం | 9440521023 |
| న్యూస్టార్ | రాయపూడి | షేక్. ఖాజా | 9553741230 |
| స్టార్ | విజయవాడ | ఎస్.కె.షరీఫ్ | 97038 14862 |
| గ్రీన్ అండ్ కూల్ | తుళ్ళూరు | ఎస్. జాని | 96031 06678 |

# చిలుకూరులో ఆర్ అండ్ బి రోడ్డుకు ఎమ్మెల్యే శంకుస్థాపన!

**తాళం హనుమంతరావు, ఉండి(రా.వా) :** చిలుకూరు గ్రామం నుంచి గరగపర్రుకు వెళ్లే ఆర్‌అండ్‌బి రహదారికి ఉండి ఎమ్మెల్యే వేటుకూరు ఎంకట శివరామరాజు శంకుస్థాపన చేసారు. ఈసందర్భంగా గ్రామ సర్పంచ్ రుద్రరాజు బంగార్రాజు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే శివ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆర్ అండ్ బి రోడ్లు చాలా వరకు పునర్మించామన్నారు. వాండ్రం ఆర్ అండ్‌బి రోడ్డు పనులు రూ3కోట్ల అంచనాలతో జరుగుతున్నాయన్నారు. ఈ రోడ్డు బొండాడ డ్రైన్ వల్ల దెబ్బతింటుందని చెప్తూ అందుకే డ్రైన్‌పై రిటైనింగ్ వాల్ నిర్మించేందుకు మరో రూ2కోట్లు మంజూరై టెండర్ల దశలో ఉందన్నారు. అలాగే మాలవానితిప్ప రోడ్డుకు రూ4కోట్లు, రిటైనింగ్ వాల్‌కు మరో రూ2కోట్లతో ప్రతిపాదనలు పెట్టినట్లు చెప్పారు. మహాదేవపట్నం రోడ్లుకు నాబార్డు నిధులు రూ2కోట్లతో పనులు జరుగుతున్నాయన్నారు. మహాదేవపట్నం-చిలుకూరు- వెలివర్రు రోడ్డు 5కిలోమీటర్లు రోడ్డుకు నాబార్డులో ప్రతిపాదనలు పంపిపట్లు తెలిపారు. పెదఅమిరం గ్రామంలో సీసీ రోడ్డుకు రూ1.3కోట్లకు ప్రతిపాదించానన్నారు. పాలకోడేరు వంతెనకు కు రూ50లక్షలతో



ప్రతిపాదించానన్నారు. కలిగొట్ల-పాందువ్వ రోడ్డు పనులు పూర్తి అయ్యాయని, కలిగొట్లలో రోడ్డును పసటిష్ఠం చేసేందుకు రిటైనింగ్ వాల్ ప్రతిపిదనలు టెండర్ దశలో ఉందన్నారు. అయిభీమవరం-చెరుకుమిల్లి- మందపాడు రోడ్డుకు రూ3కోట్లు మంజూరైనట్లు వివరించారు. సీసలి-బొండాడ రోడ్డుకు రూ4కోట్లు మంజూరయినందున పనులు ప్రారంభం అయ్యాయన్నారు. నియోజకవర్గంలో రోడ్ల బెర్మలు, గుంతలు పూడ్చివేతలు, మరమ్మతులకు రూ3.56కోట్లతో ప్రతిపిదనలు పంపానన్నారు.వచ్చే ఏడాది మే నాటికి పనులన్నింటినీ పూర్తి చేసుకుని ప్రతిపాదనలు పంపానన్నారు. రోడ్లను పండుగలకు ముందు బాగుచేసుకుని ఉండి సెగ్మెంటు ప్రమాద రహిత జోన్‌గా తీర్చిదిద్దాలనే సంకల్పించినట్లు ఉండి ఎమ్మెల్యే శివ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు జుత్తిగ శ్రీనివాస్, ఉండి ఏఎంసి చైర్మన్ కొత్తపల్లి గోపాలకృష్ణరాజు, ఎంపిపి దలియ లక్ష్మి, జడ్‌పిటిసి కరిమెరక తులసి, యవ పారిశ్రామిక వేత్త చేకూరి బోసురాజు, పార్టీ అధ్యక్షులు సోమరాజు, అనంతలక్ష్మి, సుజాత, వేగేశ్న సుబ్బరాజు, దండు సుబ్బరాజు, కృష్ణరాజు, ఆర్ అండ్‌బి అధికారులు భాస్కరరావు, రామరాజు, దుర్గరాజు పాల్గొన్నారు.

**తుఫాను వల్ల నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు**

వర్ధ తుఫాను వల్ల రైతాంగానికి ఎటువంటి విపత్తులు సంభవించకుండా అన్ని శాఖల అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఉండి ఎమ్మెల్యే ఆదేశించారు. మండల పరిషత్తులో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అధికారులు తమ పని పద్ధతులను మెరుగపర్చుకుని ప్రజల సమస్యలను పరిష్కరించి మంచి ఫలితాలను సాధించాలని అన్నారు. పుంత రోడ్ల నిర్మాణాలకు అవసరమైన చర్యలను రెవెన్యూ, మార్కెటింగ్ శాఖాధికారులు తీసుకోవాలని అన్నారు.

## రూ.33 లక్షల కొత్తనోట్లతో బీజేపీ నేత పట్టివేత

**కోల్‌కత్తా :** పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ నాయకుడు అక్రమంగా రూ.33 లక్షల నగదును తరలిస్తూ పోలీసులకు చిక్కాడు. దీంతో అతడికి సహకరించిన మరో ఆరుగురుని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు బీజేపీ నాయకుడు మనీశ్ శర్మ అక్రమంగా భారీ మొత్తంలోని నగదు తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అరెస్టు చేశారు. మనీశ్ దగ్గర రూ.10లక్షలు, మరో ఆరుగురి నుంచి రూ.23లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదులో ఎక్కువ శాతం కొత్త రూ.2వేల నోట్లు ఉన్నాయి. పోలీసులకు అందిన సమాచారం ప్రకారం వారందరూ నల్లధనాన్ని కోల్‌కత్తాలో తెల్లధనంగా మార్చుకున్నట్లు తెలుస్తోంది. అసన్‌సోల్-దుర్గాపూర్ నుంచి కోల్‌కతాకి ఇన్నోవా కారులో వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు.కేంద్ర మంత్రి బాబుల్ సుప్రియోకు శర్మసన్నిహితుడు. ఈ విషయంపై సుప్రియోను ప్రశ్నించగా పార్టీ టికెట్ ఇచ్చామని, కానీ తర్వాత అతడ్ని దూరంగా పెట్టినట్లు తెలిపారు. అతడు నిర్వహిస్తున్న బొగ్గు మాఫియా గురించి ఏమీ తెలియదని తెలిపారు. ఆరుగురి బృందంలో రాజు ఝా అనే వ్యక్తికి బొగ్గు మాఫియాతో సంబంధాలు ఉన్నాయి.

## పారిశుధ్య పనులకు రూ.486కోట్లు : చైర్మన్ చిక్కాల

**రాజధాని ప్రతినిధి,కోనసీమ న్యూస్-జివిఎన్.రావ్ :** పురపాలక సంఘ పరిధిలో వార్డుల వారీగా పారిశుధ్య పనులను అవుట్‌సోర్సింగ్ పద్ధతిన ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు మున్సిపల్ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. మూడేళ్ల కాల వ్యవధికి 17 వార్డులకు గాను రూ.483కోట్లు పారిశుధ్య పనులకు వెచ్చించేందుకు నిర్ణయించారు. చైర్మన్ చిక్కాల వినాయకరావు(గణేష్) అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ హాలులో జరిగిన సాధారణ సమావేశంలో ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పారిశుధ్య పనులను అవుట్‌సోర్సింగ్ విధానంలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు నిర్ణయించారు. జివొ ఎంఎస్ నంబర్:279 ప్రకారం పురపాలకసంఘ పరిధిలోని 30 వార్డులకు గాను మొత్తం 46 మైక్రొ పొకెట్స్‌గా గుర్తించారు. వీటిలో 12 నుండి 28 వార్డుల వరకు అవుట్‌సోర్సింగ్ పద్ధతిన పారిశుధ్య సేవలు అందించేందుకు నిర్ణయించారు. 12వార్డులో 24 మైక్రొపొకెట్ల నుండి చెత్త సేకరణ, రవాణా, పారిశుధ్య పనులకు టెండర్ల ద్వారా ఆమోదించనున్నట్లు ప్రకటించారు. మొత్తం సంవత్సరం రూ.160కోట్లు, రెండవ సంత్సరం రూ.155కోట్లు, మూడవ సంవత్సరం రూ.154కోట్లతో పాటు ఇతర ఖర్చుల నిమిత్తం రూ.14లక్షలు కేటాయించారు. 1 నుండి 11వార్డుల వరకు 29, 30వార్డుల్లోని 22 మైక్రోపొకెట్లను ప్రస్తుతం అమలుజరుగుతున్న



విధానంలోనే పురపాలక పారిశుధ్య సిబ్బంది చర్యలు చేపడుతున్నట్లు ప్రకటించారు.

బ్యాంకులో ఖాతా లేకపోయినప్పటికీ వార్డులోని వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఇతర పెన్షన్‌దారులకు పట్టణ పరిధిలోని ఐసిఐసిఐ బ్యాంకుకు పెన్షన్లు మంజూరు చేయడంపై కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు నలభై శాతం పెన్షన్లు ఖాతా లేని ఐసిఐసిఐ బ్యాంకుకు అప్పగించడం ఏమిటని ప్రశ్నించారు. పెన్షన్లు అందక వృద్ధులు, దివ్యాంగులు పడుతున్న ఇబ్బందులను కౌన్సిలర్ దొమ్మేటి రాము, అబ్బిరెడ్డి చంటిలు వివరించారు. దీనిపై కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్ కల్పించుకుని ముందే ఐసిఐసిఐ బ్యాంకుకు పెన్షన్లు వెళ్లడాన్ని గుర్తించి జిల్లా ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. పెన్షనుదారులందరికీ పెన్షన్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు, నల్లా శ్రీదేవిపార్వతి, సరిదే నాగరాజకుమారి, జంగా స్వర్ణకనకదుర్గ, యక్కల సాయిలక్ష్మి, దేవరపల్లి శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అనాథలకు యశోధ ఫౌండేషన్ చేయూత

**హైదరాబాద్ :** యశోద గ్రూప్ ఆసుపత్రుల సామాజిక సేవా (సీఎస్‌ఆర్) విభాగం .. చారిటబుల్ ఫౌండేషన్ పలు సేవా కార్యక్రమాలను "అభయ" పేరిట నిర్వహిస్తోంది. ఇందుల్లో భాగంగా ఇంతవరకు 2 వేలకు పైగా అనాథ యువతకు శిక్షణ ఇచ్చి వారికి ఉద్యోగాల్లో చేర్పించింది. తాజాగా ముగ్గురు అనాథ యువతులకు వివాహం జరిపించింది. తమ ఆడపడుచులుగా భావించి కన్యాదానం చేసింది. వైసీఎఫ్ నాలుగు కార్యక్రమాలను రూపొందించింది. అభయ కార్యక్రమం పేరిట ఉద్యోగాల కల్పన కోసం శిక్షణ కార్యక్రమాన్ని, అక్షర పేరిట అనాథ శరణాలయాల్లో చదువుకుంటున్న పిల్లలకు ఇంగ్లీషు , గణితం వంటి సబ్జెక్టులనూ బోధించే ఏర్పాట్లు చేస్తోంది. వారధి పేరిట అనాథలకు సంబంధించిన సమస్యలు, అవసరాలను ఎప్పటికప్పుడు తీర్చే ప్రయత్నం చేస్తోంది. తమ కుటుంబం పేరిట ఒక ఉమ్మడి కుటుంబంగా అనాథ యువకులను ఒకే చోటికి చేర్చే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు యశోద గ్రూప్ ఆసుపత్రుల చైర్మన్ జి. రవీంద్రరావు తెలిపారు. సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపకత్రి ప్రాంగణంలో జరిగిన వివాహ కార్యక్రమానికి పలువురు వైద్యులు, ప్రముకులు పాల్గొన్నారు. లక్ష్మి -రాజు, స్వప్న- సతీష్, రేణుక - శ్రీనివాస్ వివాహమాడారు.

## వాతావరణ మార్పులు... రైతులు బెంబేలు

**భట్టిప్రోలు :** వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో వరి సాగు చేసిన రైతులు బెంబేలు పడిపోతున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై వర్షపు జల్లులు కురవడంతో ఒక్కసారిగా అన్నదాతలు భయందోళనకు గురయ్యారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికి వస్తున్న తరుణంలో వాతావరణంలో మార్పులతో అన్నదాత దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. మండలంలో 15 వేల ఎకరాలలో వరి పంట సాగు చేశారు. ప్రకృతి అనుకూలించడంతో పంట ఆశాజనకంగా ఉందని అధిక దిగుబడులు వచ్చి సిరులు కురిపిస్తుందని సంతోషపడుతున్న తరుణంలో ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురవడంతో రైతులు అయోమయంలో పడ్డారు.

## క్రమబద్ధీకరణ గడువు పెంపు : కమీషనర్ రవివర్మ

**రాజధాని ప్రతినిధి,కోనసీమ న్యూస్-జివిఎన్.రావ్ :** ముమ్మిడివరం నగర పంచాయితీ పరిధిలో ఏవిధమైన అనుమతులు పొందకుండా నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరించేందుకు డిశంబర్ 31 వరకు గడువు పొడిగించినట్లు కమిషనర్ పి.రవివర్మ తెలిపారు. నగర పంచాయితీ పరిధిలో అనుమతి పొందకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరించుకోవాలని, ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. నగర పంచాయితీ పరిధిలో 70 మంది భవన యజమానులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోగా, 52 మంది సుమారు రూ.60లక్షల అపరాధ రుసుము చెల్లించి భవనాలను క్రమబద్ధీకరించుకున్నారన్నారు. అలాగే మిగిలినవారు కూడా వెంటనే అపరాధ రుసుము చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలన్నారు. లేనిచో ప్రస్తుతం వారు చెల్లిస్తున్న పన్నుపై వంద శాతం అపరాధ రుసుము పెంచడమే కాకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కమిషనర్ పేర్కొన్నారు.

## 'మెట్రో రైలు' బాధితులకు పరిహారం :జేసీ

**రాజధాని ప్రతినిధి-విజయవాడ :** నిడమానూరు మెట్రో రైలు డిపో నిర్మాణానికి గుర్తించిన భూములకు నష్టపరిహారం న్యాయబద్ధంగా చెల్లించేందుకుగాను జిల్లా యంత్రాంగం తరపున సంపూర్ణ సహకారం వుంటుందని ఇన్‌ఛార్జ్ కలెక్టర్ గంధం చంద్రుడు రైతులకు హామీ ఇచ్చారు. తన క్యాంపు కార్యాలయంలో నిడమానూరు, మెట్రో రైలు డిపో నిర్మాణంలో స్థలాలు కోల్పోతున్న వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్ కలెక్టరు మాట్లాడుతూ, భూములు కోల్పోతున్న వారికి నష్టపరిచే ఉద్దేశ్యం లేదని, అభివృద్ధిపరంగా మెట్రోరైలు నిర్మాణ ఆవశ్యకత వున్నందున భూ యజమానులు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. రైతులు సూచించిన విధంగా గ్రామాల్లో భూమికి భూమి ఇవ్వాలనే ప్రతిపాదనలు ప్రభుత్వానికి తెలుపుతామని అన్నారు.

# టీ, కాఫీలను మానండి

ఆరోగ్యం



డాక్టర్. మంతెన సత్యన్నారాయణ

ఇది కాఫీ టైము, ఇది టీ టైము అని అందరికీ ఉంటున్నది. అంటే అంత టైము ప్రకారముగా మానకుండా వాటిని త్రాగేటట్లుగా మనిషి అలవాటు పడిపొయ్యాడు. తెల్లదొరలు మన దేశాన్ని పాలించినప్పుడు, వాళ్ళ అలవాట్లను మనవాళ్ళు నేర్చుకొని దాన్ని మానకుండా త్రాగుతూ, దేశమంతటా అంటువ్యాధి లాగా ఒకరికొకరు ముట్టించుకుని ఓనమాలు నేర్చుకోనివారి దగ్గర్నుండీ, బాగా చదువుకున్న వారి వరకు అందరూ త్రాగుచున్నారు. కాఫీ, టీలను త్రాగడాన్ని ఎవరూ దురలవాటుగా అనుకోరు. ఎవరూ దురలవాటని అనడంలేదు. మనదేశంలో బ్రాందీలు, విస్కీలు త్రాగితే దాన్ని దురలవాటుగా చెప్పుకుంటారు. అదే ఇతర దేశాలలో బ్రాందీలు, విస్కీలు త్రాగినా దాన్ని దురలవాటు అని అనరు. ఎందుకంటే అక్కడ ఆడ, మగ, పిల్ల, పెద్ద అందరూ కలిసి కూర్చుని త్రాగుతారు. ఇలా అందరూ త్రాగేవారే కాబట్టి ఇంక అది దురలవాటనే వారు ఎవరుంటారు? అదే మనదేశంలో అయితే బ్రాందీలను, విస్కీలను త్రాగేవారు 40,50 శాతం మంది ఉంటే మిగతా వారు త్రాగడం లేదు కాబట్టి, వీరు అనడానికి మిగిలారు. అందుకని అది దురలవాటుగా పేరుపడింది. మరి కాఫీ, టీలను దురలవాటుగా ఎందుకనటం లేదంటే, అందరూ త్రాగుతున్నారు కాబట్టి ఇక అనేవారెవరు, నాబోటివాడు అనాలి తప్ప. వాస్తవానికి కాఫీ, టీలు కూడా సిగరెట్లు, గుట్కాలు, విస్కీలు, జరదా, కిళ్ళీలలాగా ఒక వ్యసనమే. వ్యసనము అంటే, కొన్ని రోజులు త్రాగాక అది త్రాగకుండా ఒక రోజు మానినపుడు, ఆ టైముకి మీరు మరిచినా అది మరవకుండా త్రాగమని గుర్తు చేస్తూ వుంటుంది. మీరు సంవత్సరం పాటు రోజూ ఒక టైము ప్రకారం మజ్జిగ త్రాగి, ఎప్పుడున్నా ఒక్క రోజు మాని చూడండి. ఆ టైముకు మీరు మజ్జిగ త్రాగ లేదని మీ శరీరము ఇబ్బంది పడుతుందేమో. ఇది ఆహార పదార్థము కాబట్టి అలా ఇబ్బంది అనిపించదు. మరి టీ, కాఫీలు ఆహార పదార్థాలు? ప్రతి రోజూ ఎన్నోసార్లు, ఎంతమంది కొరకో త్రాగుతున్నాము. ఎంతమందికో మన చేతులతో ఇస్తున్నాము. అవి మందు పదార్థాలు తప్ప ఆహారం కాదు. టీ, కాఫీలలో ఏముంటుందో చూద్దాము.

ఒక కప్పు కాఫీలో 150 మిల్లీ గ్రాముల కెఫీన్ అనే మందు ఉంటుంది. ఒక కప్పు టీలో 150 మిల్లీ గ్రాముల టీన్ అనే మందు ఉంటుంది. ఈ రెండు మందులను నరాల సంబంధించి, రక్త నాళాల సంబంధించి ఇబ్బందులు వచ్చినప్పుడు వాడితే వాటిని తగ్గించుకోవడానికి పనిచేస్తాయి. నేను బి. ఫార్మసీ చదివినప్పుడు మాకు కాఫీల నుండి, టీల నుండి ఆ సారాన్ని తీసి మందులుగా తయారు చేయడం తెలిసింది. ఎవరికన్నా నరాల, రక్తనాళాల ఇబ్బందులను వచ్చినప్పుడు, వైద్యులు ఆ నరాలు చురుగ్గా పనిచేయడానికి ఈ మందులను వాడతారు. మనం రోజులో ఒక కప్పు కాఫీ గానీ, టీ గానీ త్రాగితే, నరాలకు సంబంధించి 150 మి.గ్రా.టాబ్లెట్ వేసుకున్నట్లే. ఎవరైనా కొందరు కాఫీ చెడ్డది, టీ మంచిది అని అంటూ ఉంటారు. వాస్తవానికి ఈ రెండూ ఒకేజాతి. అక్కాచెల్లెళ్ళు, అంతే భేదం. మనం రోజుకి ఎన్ని కప్పులు త్రాగుతున్నాము? అంటే, కొందరు 10,12 కప్పులని, మరి కొందరు 5,6 సార్లని ఇలా లెక్క వస్తుంది. ఈ విధముగా రోజు మొత్తంలో ఆ మందును ఎంత ఎక్కువగా మనలోకి పంపుతున్నామో ఆలోచించండి. ఇలా ఒక్క రోజా లేదా రెండు రోజులా? ఎన్ని సంవత్సరాల నుండి ఈ శరీరాన్ని ఆ ఉద్రేకపరిచే పదార్థాలతో ఇబ్బంది పెడుతున్నాము కదా! కాఫీ,టీలు త్రాగిన తరువాత మనలో ఏమి జరుగుతుందో చూద్దము. మామూలుగా మనలోని నరాలు సమర్థతిలో పనిచేసుకుంటూ ఉంటాయి. మీరు కాఫీ,టీలను త్రాగిన అరగంటలో అందులోని మందు మీలో పనిచెయ్యడం మొదలు పెడుతుంది. కెఫిన్ టీన్‌ల ప్రభావం వలన మనలోని నరాల వ్యవస్థ ఒక్కసారే చురుగ్గా, ఉషారుగా పని చెయ్యడం ప్రారంభిస్తుంది. మామూలుగా నడిచే ఎద్దు కొరడా దెబ్బ వేస్తే స్పీడ్‌గా పరిగెత్తి నట్లుగా మనలో సరాలు కూడా అలానే పనిచేస్తూ ఉంటాయి. ఇలా ఆ పవరు సుమారుగా 2,3 గంటల పాటు మనలో ఉంటుంది. ఆ పవరు పనిచేసినంతసేపు మీరు మరీ హుషారుగా, చురుగ్గా మనస్సు తేలికగా చక చకా చేసుకుందామనే ఊపులో ఉంటారు. ఇలా ఉంటే మంచిదేగదా అని మీరు అనవచ్చు. పరుగెత్తిన ఎద్దు కొంతసేపటికి అలుపు వచ్చి మామూలుగా పడిచే నడక కూడా నడవకుండా, దున్నపోతు నడకను తగ్గిపోతుంది. అలాగే మనలో కూడా నరాలు సహజ స్థితిలో పనిచేయాల్సింది పోయి మరీ దిగజారిపోయి పని చేస్తుంటాయి. అలాంటప్పుడు మీకు నీరసంగా, బద్ధకంగా, హుషారు తగ్గిపోయి నట్లుగా ఉంటుంది. ఆ సమయంలో శరీరం మళ్ళీ నాకు కాఫీ కావాలని లేదా టీ కావాలని గుర్తు చేస్తూ ఉంటుంది. ఆ టైముకి శరీరం అడిగినా మీరు అందివ్వకపోతే మీకు వెంటనే తలనొప్పిగా మనస్సు పనిచెయ్యనట్లుగా అనిపించి నీరసంగా అయిపోతారు. అందుకే మీకు కాఫీ, టీల టైము అయినప్పుడు ఎక్కడున్నా ముందు వాటిని త్రాగేవరకు తోచదు. ఈ అలవాట్లు శరీరాన్ని, మనస్సును దిగజారిపోయేట్లు చేస్తాయి. అందుకే వీటిని దురలవాట్లు అన్నారు. ఉత్తి పుణ్యానికి మామూలుగా పనిచేసే నరాలను ఉద్రేకపరచడమెందుకు, ఆపై మనము ఇబ్బందులు పడటమెందుకు? మనిషి అంటే, ఎప్పుడూ సమస్థితిలో ఉండవలసినవాడు. అంతేకానీ, రోజూ శరీరాన్ని, మనస్సును ఉద్రేకపరుచుకునేవాడు కాదు.

కాలక్షేపానికి త్రాగే కాఫీ, టీలలో ఏముందో తెలుసుకోకుండా, ఎన్నాళ్ళుగానో ఈ శరీరాన్ని ఏడిపిస్తూ వస్తున్నాము. కాలక్షేపానికి మీ ఇంటికి కాస్త బురదపూసుకుంటారా? మీ కారు ఆయిల్‌టాంక్‌లో కాస్త ఇసుక పోసుకుంటారా? అలా చెయ్యరే! మరి ఎన్నో కోట్లు పోసినా కొనలేని ఈ శరీరంలో కాలక్షేపానికి అలాంటి చెత్తను ఎందుకు పోస్తున్నారు. ఇది మన శరీరము. మన సుఖము కొరకే పనిలివేయండి. కాబట్టి ఇక అలాంటి టీ, కాఫీల సాంప్రదాయాలను పూర్తిగా వదిలివేయండి. మీ ఇంటికి బంధువులొచ్చినా గానీ ఇవ్వకండి. ఏం ఆశ్చర్యంగా ఉందా? లేదా ఇంకొకసారి రారని అనుమానమా? మనం బాగుపడి నలుగురినీ బాగుచెయ్యాలి గానీ, మనం చెడిపోయి నలుగురినీ చెడగొట్టకూడదు గదా! మీ ఇంటికి బంధువులొచ్చినప్పుడు ఎలా చెయ్యాలో చెబుతాను. వారు రావడంతోనే కూర్చోబెట్టి, పెద్ద చెంబుతో మంచినీళ్ళు తెచ్చి దగ్గరుండి మరీ పొట్టనిండుగా త్రాగించండి. పది నిమిషాలు ఆగి కాఫీ త్రాగుతారా, టీ త్రాగుతారా అని మర్యాదకు అడగండి. పొట్ట బరువుగా ఉంది, ఇక ఏమీ అక్కర్లేదని పని అయ్యాక వెళ్ళిపోతారు. మీరు కూడా కాఫీ, టీలను మాని ఆ టైములో ఎక్కువగా నీటిని త్రాగే అలవాటు చేసుకోండి. శరీరం శుద్ధి అవుతుంది. ఆరోగ్యానికి మంచిది. కాఫీ, టీలను మానినప్పుడు మొదటి 5,6 రోజులపాటు మనస్సు, నోరు లాగేస్తూ ఉంటాయి. వాటిపై వాంఛను పోగొట్టుకోవడానికి మానిన రోజు నుండి మీరు గోరువెచ్చని నీటిలో ఒకటి, రెండు నిమ్మకాయలు రసాన్ని పిండి (కావాలంటే 1,2 స్పూన్లు తేనె) పుల్లగా ఉండేటట్లుగా త్రాగండి. ఎప్పుడైతే నోరు పుల్లగా అవుతుందో వాటిమీద వాంఛ పోతుంది. పులుపుకు ఆ గుణం ఉన్నది. రోజుకి అలా 2,3 సార్లు త్రాగవచ్చు వీటిని మానినందుకు తలనొప్పిగా ఉంటే రెండు పూటాలా తలస్నానం చన్నీళ్ళతో చేయండి. అత్యవసరమైతే నొప్పికి మాత్రలు వేసుకోవచ్చు. వారం రోజుల్లోనే మీ శరీరం వాటి స్నేహాన్ని మరువగలదు. ఒక్కసారి పూర్తిగా మానితే ఇక మళ్ళీ జీవితంలో వాటిని ఎవరికొరకు త్రాగడమే ఎక్కువగా ఉంటుంది. ఎవరికోసమో మన జీవితాన్ని పణంగా పెట్టవద్దు. కాఫీ, టీల బదులుగా పాలుకూడా వద్దు. పాలుత్రాగే వయస్సు దాటిపోయింది. కాబట్టి ఆ టైములో పుల్లటి పండ్ల రసంలో, తేనె నిమ్మరసం నీళ్ళో, చెరుకురసమో, కొబ్బరి నీళ్ళో మొ॥గు వాటిని మంచి అలవాట్లుగా మార్చుకుంటే జీవితం మంచిగా ఉంటుంది. మనం మంచిగా అవ్వడానికి ప్రయత్నిద్దాం.

**కాఫీ, టీలను త్రాగడం వల్ల నష్టాలు**

- ప్రేగులపై వీటి ప్రభావం పడి ఆహారం మీద వాంఛపోతుంది. ఆకలి చాపడం అందరీ అనుభవమే.
- పొట్ట, ప్రేగులలో మంటలను, పూతలను రాకుండా ఒకరకమైన జిగురు పదార్థం కాపాడుతుంది. ఆ జిగురును పుట్టించేగ్లోబ్లెట్ కణాలపై వీటి ప్రభావం పడి ఆ జిగురు ఉత్పత్తిని సగానికి సగం తగ్గించివేస్తాయి దాంతో కడుపులో మంటలు, ప్రేగుపూతలు, అల్సర్స్ మొ॥నవి వస్తాయి. మనం ఈ సమస్యలు వచ్చినప్పుడు కారాలను, పులుపులను మానుతున్నామే గాని, టీ, కాఫీలను మానము. ఆ సమస్యలు అందుకే పూర్తిగా తగ్గడం లేదు.
- పొట్ట, ప్రేగులలో ఆహారాన్ని అరిగించడానికి ఎన్నో ఎంజైములు ఊరతాయి. వాటి ఉత్పత్తిని తగ్గించివేస్తాయి.
- నరాలు ఎక్కువగా ఉద్రేకపడి పనిచేస్తున్నందుకు త్వరగా అలసటుకు గురి అవుతాయి
- కాఫీ, టీల పవరు మనలో అయిపోయినపుడు మనం వాటిని మళ్ళీ త్రాగకపోతే వెంటనే తలనొప్పులొస్తాయి. అలా అలవాటు అయిన తలపొప్పులు రోజులో ఏదో ఒక టైములో వస్తూనే ఉంటాయి. 50,60 శాతం తలనొప్పులకు కాఫీ, టీలే కారణాలు అని అనవచ్చు.
- కాఫీ, టీలు కిడ్నీలపై ఉండే ఎడ్రినల్ గ్రంథులపై పనిచేసి కొంచెం కొంచెం మూత్రం ఎక్కువసార్లుగా పోసి అతిమూత్ర వ్యాధి వచ్చేట్లుగా చేస్తాయి.
- మన లివరుకు, ప్రతిరోజు ఒక కప్పు త్రాగినందుకు వచ్చిన దోషాన్ని శుభ్రం చేసుకోవడానికి రోజు పడుతుంది. మనం రోజుకి 5,6 కప్పులు త్రాగితే మిగతా కప్పులలో మందు ప్రభావాన్ని శుద్ధి చేయలేక లివరుకు సమస్యగా మారుతుంది.
- మెదడును ఎక్కువగా పనిచేయించడం చేత్త ఎక్కువగా ఆలోచనలు రావడం, స్థిరంగా లేనట్లుగా అనిపించడం, చిరాకుగా ఉండడం జరుగుతుంది.
- నరాలు ఎప్పుడూ ఉద్రేకంలో ఉండడం వల్ల రిలాక్సు కావు. దానితో సరిగా నిద్రరాదు. పడుకున్న వెంటనే నిద్ర పట్టదు.
- ప్రొద్దున్నే కాఫీ, టీలు త్రాగడం వల్ల మన శరీరానికి విసర్జన క్రియ ఆగిపోతుంది. పరగడపున మన శరీరం మనలో ఉన్న చెడును క్లీన్ చేసుకుంటూ ఉంటుంది. ఇవి త్రాగిన వెంటనే ఆ చెడువదిలే కార్యక్రమాన్ని ఆపి సడన్‌గా ఉద్రేకపడి ఈ గొడవలో పడిపోతుంది.

## బాబ్రీ మసీదును పునర్నిర్మించాలి

- లిబర్హాన్ కమిటీ నివేదికపై చర్యలు తీసుకోవాలి
- రాష్ట్రపతికి ఎంబీటీ వినతిపత్రం

**హైదరాబాద్,(కెఎన్ఎన్) :** బాబ్రీమసీదును పునర్నిర్మించాలని మజ్లిస్ బచావా తహరీక్ (ఎంబీటీ) పార్టీ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీకి విజ్ఞప్తి చేసింది. బాబ్రీమసీదు కూల్చివేతపై నియమించిన లిబర్హాన్ కమిటీ నివేదికపై వెంటనే చర్యలు తీసుకునేలా కేంద్రప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరింది. ఎంబీటీ అధ్యక్షుడు మజీదుల్లాఖాన్ నేతృత్వంలో తెలుగురాష్ట్రాల గవర్నర్ ఇ.ఎస్.ఎల్. నరసింహన్‌ను రాజ్‌భవన్‌లో కలిసిన పార్టీనాయకులు ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించి రాష్ట్రపతికి పంపాలని విజ్ఞప్తిచేశారు. త్వరలో ఉత్తర్‌ప్రదేశ్ ఎన్నికలు జరగనున్న దృష్ట్యా బాబ్రీమసీదును కూల్చిన శక్తులు మరోసారి రామజన్మభూమి అంశాన్ని రాజకీయంచేసే అవకాశముందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టుతుదితీర్పు వెలువడేంత వరకూ బాబ్రీమసీదు వద్ద యథాతథస్థితి (స్టేటస్ కో) కొనసాగే విధంగా కేంద్రాన్ని స్పష్టంగా ఆదేశించాలని కోరారు. అలాగే బాబ్రీమసీదు కూల్చివేత కేసు త్వరగా పరిష్కృతమయ్యేలా ప్రత్యేకకోర్టును ఏర్పాటు చేయాలని, మసీదు కూల్చివేత నిందితులకు వీలైనంత త్వరగా శిక్షపడేలా చూడాలని కేంద్రప్రభుత్వాన్ని ఆదేశించాలని వినతిపత్రంలో ఎంబీటీ నాయకులు విజ్ఞప్తి చేశారు.

## ఏపికి రాయల్టీ చెల్లింపు సాధ్యం కాదు

**లోక్‌సభలో కేంద్ర పెట్రోలియం శాఖ**

**న్యూఢిల్లీ :** కృష్ణా-గోదావరి పరివాహక ప్రాంతంలో ఉపరితలంపై జరుగుతున్న గ్యాస్ నిక్షేపాల వెలికితీత, తవ్వకాలకు గాను రాష్ట్ర ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించాలన్న ఆంధ్రప్రదేశ్ విజ్ఞప్తిని కేంద్ర ప్రభుత్వం తోసిపుచ్చింది. ప్రస్తుతం నిబంధనల ప్రకారం రాయల్టీని చెల్లించటం కానీ, కేంద్రానికి వచ్చే రాయల్టీని రాష్ట్రం తో పంచుకోవటం కానీ సాధ్యంకాదని కేంద్ర పెట్రోలియం,సహజమాయువు శాఖ మంత్రి ధర్మేంధ్ర ప్రధాన్ తెలిపారు. తెలుగుదేశం ఎంపి అంవతి శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు లోక్‌సభలో ఆయన లిఖితపూర్యక సమాధానం ఇచ్చారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 297, పెట్రోలియం, సహజవాయువు నిబంధనలు, ఆయిల్ (రెగ్యులేషన్,డెవలప్‌మెంట్) ,చట్టం ప్రకారం.. పెట్రోలియం కేంద్రానికి సంబంధించిన అంశమని, దీన్ని ఉపరితలంపై వెలికితీసినా రాయల్టీ చెల్లించాల్సింది కేంద్ర ప్రభుత్వానికేనని తెలిపారు. చట్టబద్ధమైన నిబంధనల ప్రకారం ఎవరు చమురు వెలికితీసినా కేంద్ర ప్రభుత్వానికే రాయల్టీ ఇవ్వాల్సి ఉంటుందని, సంబంధిత రాయల్టీని రాష్ట్ర ప్రభుత్వంతో ఉంటుందని, సంబంధిత రాయల్టీని రాష్ట్ర ప్రభుత్వంతో పంచుకునేదుకు నిబంధనలు అంగీకరించవని పేర్కొన్నారు. కేజీ బేసిన్‌లో ఉపరితలంపై జరిగే తవ్వకాలకు మైనింగ్ రాయల్టీలను రాష్ట్ర ప్రభుత్వంతో పంచుకోవాలని ఆంధ్రప్రదేశ్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిందని.. ఈ విషయంపై తమ వైఖరిని రాష్ట్రానికి తెలియజేశామని తెలిపారు. విశాఖపట్నం-చెన్నై పారిశ్రామిక కారిడార్‌కు ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఎడిబి) రుణానికి కేంద్ర ప్రభుత్వం అంగీకారం తెలిపిందని మాగంటి మురళీ మోహన్ అడిగిన ప్రశ్నపై లోక్‌సభలో కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి నిర్మల సీతారామన్ తెలిపారు. అలాగే కాకినాడ సెజ్‌లో 25 ఎకరాల భూమిలో ఐఐఎఫ్‌టి ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్టు నివేదిక తయారు కానుందని రవీంద్ర బాబు అడిగిన ప్రశ్నకు నిర్మలా సీతారామన్ తెలిపారు.

## సుప్రీం తదుపరి సీజే జగదీష్ సింగ్ ఖేహర్

- ప్రస్తుతం సీజే ఠాకూర్ పదవీకాలం జనవరి 3 వరకే
- 4న సుప్రీం కోర్టు 44వ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించన్ను ఖేహర్



**న్యూఢిల్లీ :** సుప్రీం కోర్టు తదుపరి చీఫ్ జసిస్ట్‌గా జగదీశ్ సింగ్ ఖేహర్ నియమితులు కానున్నారు. ప్రస్తత సీజేటీఎస్ ఠాకూర్ పదవీ కాలం వచ్చే నెల మూడువ తారీఖుతోముగియనుంది.దీంతో ఆయన స్థానంలో సుప్రీం ప్రధాన న్యాయమూర్తిగా జగదీశ్ సింగ్ బాధ్యతలు చేపట్టనున్నారు.జనవరి నాలుగున ఖేహర్ బాధ్యతలు స్వీకరిస్తారు. వచ్చే యేడాది ఆగష్టు 27వ తేదీ వరకు ఖేహర్ ఈ పదవిలో కొనసాగుతారు. సుప్రీం కోర్టు 44వ ప్రధాన న్యాయమూర్తిగా ఖేహర్ పేరును కేంద్రానికి ప్రతిపాదించారు.ఈమేరకు సీజే కేంద్రానికి లేఖరాశారు.జడ్జీల నియామకానికి సంబంధించిన వివాదాస్పద ఎన్‌జేఏసీ యాక్ట్‌పై ఏర్పాటైన ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనంలో ఖేహర్ కూడా ఒకరు. సిక్కు సామాజిక వర్గం నుంచి ఈ అత్యున్నత పదవికి ఎంపిక అవుతున్న తొలి వ్యక్తిగా 64 ఏళ్ల ఖేహర్ చరిత్ర కెక్కను న్నారు. ఏయేడాది జనవరిలో అరుణాచల్ ప్రదేశ్ రాజకీయ సంక్షోభం నేపథ్యంలో, అక్కడ రాష్ట్రపతి పాలనను తోసిపుచ్చుతూ తీర్పువెలువరించిన న్యాయ మూర్తిల్లో ఖేహర్ కూడా ఉన్నారు. అదేవిధంగా మనీమేటర్స్ విషయంలో సహారా చీఫ్ సుబ్రతారాయ్‌ని జైలుకు పంపిన కేసునూ ఖేహరే తీర్పుచెప్పారు. అదేవిధంగా సమాన పనికి సమానవేతనం ఇవ్వాలంటూ కాంట్రాక్టు కార్మికుల వ్యాజ్యం విషయంలో సంచలన తీర్పును ఇచ్చింది కూడా ఈయనే.

## 31 వరకు భక్తులకు అదనపు చార్జీలు ఉండవు

**టీటీడీ ఈవో సాంబశివరావు**



**తిరుపతి :** శ్రీవారి దర్శనార్థం విచ్చేసే భక్తులు తిరుపతి, తిరుమలలో నిర్వహించే నగదు ఎలాంటి అదనపు రహిత లావాదేవీలపై ఈ నెల 31వ తేదీ వరకు ఎలాంటి అదనపు చార్జీలు ఉండవని టీటీడీ ఈవో డాక్టర్ దొండపాటి సాంబశివరావు వెల్లడించారు. దీనిపై తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో బ్యాంక్ అధికారులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ పెద్ద నోట్ల రద్దు నేపథ్యంలో శ్రీవారి భక్తులకు ఎలాంటి అదనపు చార్జీలు విధించకుండా అన్ని చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రధాన ంగా తిరుమల, తిరుపతిలోని గదుల బుకింగ్, శ్రీవారి డాలర్లు, లడ్డూ ప్రసాదాలు కొనుగోళ్లకు క్రెడిట్ కార్డులను ఉపయోగించి స్వైపింగ్ మిషన్ల ద్వారా లావాదేవీలు జరపాలని భక్తులకు సూచించారు. అలాగే టీటీడీ ప్రచురణలు, డైరీలు, కాలెండర్లు కొనుగోలు చేసే భక్తుల వద్ద కూడా అదనపు చార్జీలు వసూలు చేయవద్దని బ్యాంకర్లను కోరారు. టీటీడీ పరకామణి ద్వారా బ్యాంక్‌లకు చేరుతున్న చిల్లర నాణేలు, చిన్న నోట్లను భక్తులకు చిల్లర ఇచ్చేందుకు అందుబాటులో ఉంచారని కోరారు. ఈ-హుండీ ద్వారా కానుకలు సమర్పించే భక్తులకు, ఈ-డోనేషన్ ద్వారా టీటీడీ ట్రస్టులకు విరాళాలు ఇచ్చేవారికి సర్వీసు చార్జీలు టీటీడీ భరిస్తుందన్నారు. ఈ సమావేశంలో టీటీడీ ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజీ, సీఏవో వై.ప్రసాద్, ఆంధ్రాబ్యాంక్ డీజీఎం క్రిష్ణమూర్తి, స్టేట్‌బ్యాంక్ రీజనల్ మేనేజర్ వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నోట్ల రద్దుతో ఖజానాకు రూ.130 కోట్లు

**మరో 2000 కోట్ల అక్రమ ఆస్తుల గుర్తింపు**

**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వం విధించిన పెద్దనోట్ల రద్దు నిర్ణయం అనంతరం రూ.130 కోట్ల విలువైన అక్రమ సంప దను స్వాధీనం చేసుకున్నట్లు ఆదా య పన్నుశాఖ వెల్లడించింది. నగదు, ఆభ రణాల రూపంలో మొత్తం జప్తు చేసిన సంపద విలువ రూ.130 కోట్లుగా పేర్కొంది. పన్ను చెల్లింపుదారుల నుంచి బహిరంగపరచని సంపద విలువ రూ.2,000 కోట్లుగా కాగా ఈడీ, సీబీఐ మరో 30 కేసులను గుర్తించగా, వీటిలో నేర తీవ్రతను అంచనా వేయాలని సెంట్రల్ కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సిబిడిటి) ఆ ఏజెన్సీలను కోరింది. మరో 400పైగా కేసులపై విచారణ మరింత వేగిరపచవలసి ఉందని ఓ ప్రత్యేక ప్రకట నలో వెల్లడించింది. ఆదాయంపు పన్ను చట్టం ప్రకారం తీవ్రమైన అవకతవకలున్న కేసులను గుర్తించి తక్షణ చర్యల కోసం సీబీఐ, ఈడీలకు రిఫర్ చేసే అధికారం ఉంది. దీనికి సంబంధించి సుమారు 30 కేసులను ఈడీ గుర్తించి సీబీఐకి పంపినట్లు ఎన్‌కం టాక్సుశాఖ పేర్కొంది. రద్దయిన నోట్లను డిసెంబరు మాసాం తానికి బ్యాంకుల్లో డిపాజిట్ చేయమని ప్రధాని ప్రకటించిన విషయం విదితమే. సుమారు రూ.14 లక్షల కోట్లకుపైగా నోట్లు చలామణి ఉన్నట్లు గుర్తించారు. ఆర్‌బీఐ తాజా సమాచారం ప్రకారం, నవంబరు 27లోపు సుమారు రూ.8.45 లక్షల కోట్లు బ్యాంకుల్లో డిపాజిట్ అయ్యాయి. ఆదాయపు పన్ను శాఖ, బెంగుళూరు ఇన్వెస్టిగేషన్ యూనిట్ 18 కేసులను ఈడీకి రిఫర్ చేసినట్లు తెలుస్తోంది. ఈ కేసులన్నీ రద్దయిన పెద్ద నోట్లకు సంబంధించిన వివిధ మార్గాల ద్వారా ఆదాయపన్ను శాఖ పట్టుకున్నవే. లూధియానా యూనిట్ సుమారు రూ.72 లక్షల నగదును సీజ్ చేసింది. హైదరా బాద్‌లో మరో ఐదుగురు నుంచి సుమారు రూ.95 లక్షలను పట్టుకున్నారు. పూనేలో రూ.20 లక్షలతోపాటు రూ.10 లక్షల కొత్తనోట్లను అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంకు నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఢిల్లీ యూనిట్ పరిధిలోని యాక్సిస్ బ్యాంకు, కాశ్మీర్ గేట్ బ్రాంచి కేసుల్లో అధికారులు అక్రమాలకు పాల్పడు తుండగా గుర్తిం చారు. ఈ కేసులో ఈడీ ఇద్దరు బ్యాంకు అధికారులను స్వాధీనం లోకి తీసు కున్నారు. జన్‌ధన్ అకౌంట్లలో అక్రమంగా డిపాజిట్ చేసిన సుమారు రూ.1.64 కోట్లను ఐటీ శాఖ గుర్తించింది.

## రెసిడెన్సియల్ పాఠశాలలకు పోస్టులు మంజూరు

**రాజధాని ప్రతినిధి, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ సాంఘీక సంక్షేమశాఖ రెసిడెన్సియల్ సొసైటీ ఆధ్వర్యంలో పశ్చిమగోదావరి జిల్లా చింతలపూడిలో ఏర్పాటు చేయనున్న కొత్త బాలుర రెసిడెన్సియల్ పాఠశాలకు 33 రెగ్యులర్ పోస్టులను మంజూరు చేస్తూ ఆర్థికశాఖ సోమవారం ఉత్తర్వుల జారీ చేసింది. వీటిలో 22 టీచింగ్,9నాన్ టీచింగ్ పోస్టులు ఉన్నాయి. 2013-14 విద్యా సంవత్సరం నుండి తాత్కాలిక భవనాలలో ఈ పాఠశాలను నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన పోస్టుల్లో ప్రిన్సిపల్ గ్రేడ్-2. 1, సీనియర్ రెసిడెంట్ టీచర్-9, రెసిడెంట్ టీచర్-9,ఫిజికల్ ఎడ్యుకేషనల్ టీచర్2, లైబ్రేరియన్,స్టాఫ్ నర్స్, ఆర్ట్ టీచర్ ఒక్కొక్కొ పోస్టు ఉన్నాయి. నాన్‌టీచింగ్ విభాగంలో సూపరింటిండెంట్, సీనియర్ అసిస్టెంట్ ఒక్కొక్కొటి, జూనియర్ అసిస్టెంట్/ టైపిస్ట్-2, రికార్డు అసిస్టెంట్/ రెనోఆపరేటర్1, వాచ్‌మెన్/ అటెండర్ -4 పోస్టులు ఉన్నాయి.

**గుంటూరు జిల్లాకు 44 పోస్టుల మంజూరు**

ఎపి సోషల్ వెలఫేర్ రెసిడెన్సియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిల్యూషన్స్ సొసైటీ పరిధిలో గుంటూరు జిల్లా అడివితక్కెళ్లపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన రెసిడెన్సియల్ పాఠశాల/ జూనియర్ కళాశాలకు 44 కొత్త పోస్టులను మంజూరు చేస్తూ ఆర్థికశాఖ మరో ఉత్తర్వుల జారీ చేసింది. వీటిలో 33 టీచింగ్,11 నాన్ టీచింగ్ పోస్టులు ఉన్నాయి. ఎస్సీ సబ్‌ప్లాన్‌లో2015-16 విద్యాసంవత్సరంలో ప్రారంభించిన కొత్త పాఠశాల / జూనియర్ కళాశాలకు ఈ పోస్టులు మంజూరు చేశారు. మంజూరైన పోస్టుల్లో ప్రిన్సిపాల్ గ్రేడ్-2,1 వైస్ ప్రిన్సిపాల్-1, జూనియర్ లెక్చరర్ -6, సీనియర్ రెసిడెంట్ టీచర్(పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్)-9, రెసిడెంట్ టీచర్(ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్)-9, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్-1, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ -2, లైబ్రేరియన్1, క్రాఫ్ట్, ఆర్ట్ టీచర్, స్టాఫ్ నర్స్ ఒక్కొక్కొరు నాన్ టీచింగ్ విభాగంలో సూపరిటిండెంట్, సీనియర్ అసిస్టెంట్, క్యాటరింగ్ అసిస్టెంట్ ఒక్కొక్కొరు. జూనియర్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్-1, ఫ్లంబర్ ఎలక్ట్రిషియన్, రికార్డు అసిస్టెంట్, వాచ్‌మెన్, ఆఫీస్ బడార్టినేట్ ఒక్కొరు మొత్తం 44 పోస్టును మంజూరు చేసింది.

## ప్రతి విద్యార్థికి సామాజిక స్పృహ ఉండాలి!

**తాళం హనుమంతరావు, ఉండి(రా.వా):** నర్సాపురం డిఎస్పీ పూర్ణచంద్రరావు ప్రతి విద్యార్థి చదువులో రాణించడమే కాకుండా సామాజిక స్రృహను కలిగి ఉన్నప్పుడే చదువుకు సార్ధకత ఉంటు ందని నర్సాపురం డిఎస్పీ పూర్ణచంద్రరావు అన్నారు. ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటిఐలో జరిగిన స్నాతకోత్సవంలో ప్రిన్సిపల్ పి సీతారామరాజు అధ్యక్షత వహించారు. సభలో డిఎస్పీ మాట్లాడుతూ ఐటిఐ విద్యను అభ్యసించిన వారిలో నిరుపేద కుటుంబాల నుంచి వచ్చిన వారు అత్యధిక శాతం మంది ఉంటారన్నారు. త్వరగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కలుగుతాయనే ముందు చూపుతో విద్యార్థుల తల్లిదండ్రులు ఐటిఐ వంటి చదువులకు ప్రాధాన్యత ఇస్తారన్నారు. విద్యార్థులు నిజ జీవితాల్లో ఎంత ఉన్నత స్థానాలకు చేరినా జన్మనిచ్చిన తల్లిదం డ్రులను, గురువులను, జన్మభూమిని మర్చి పోకాడదని హితవు చెప్పారు. ఉండి ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు మాట్లాడుతూ విద్యార్థులు క్రమిశిక్షణ పాటించి అంకితభావంతో విద్యాభ్యాసం చేసినట్లయితే మంచి ఉన్నత స్థాయికి చేరతాయని అన్నారు.

## క్యాన్సర్ సెంటర్ నిర్వహణకు సలహా కమిటీ

**రాజధాని ప్రతినిధి-అమరావతి :** గుంటూరు సర్వజనాసుపత్రిలో నాట్కొసాయంతో ఏర్పాటు చేసే క్యాన్సర్ చికిత్సా కేంద్రం నిర్వహణకు ప్రభుత్వం ముగ్గురు సభ్యులతో సలహా కమిటీ నియమించింది. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో అకాడమిక్ వైద్య విద్యా సంచాలకులు డా.కె.బాబ్జి, గుంటూరు జిల్లా పెద్ద ఆస్పత్రి సూపరింటెండెంట్, రేడియేషన్ ఆంకాలజిస్టులు సభ్యులుగా ఉంటారు. క్యాన్సర్ చికిత్స సంబంధించి ప్రతి నిర్ణయం, అమలు తదితర విషయాలు ఈ కమిటీ చూసుకుంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## షెహనాయ్‌లు చోరీ

**వారణాసి :** దివంగత సంగీత విద్వాంసును ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్‌కు చెందిన ఐదు షెహనాయ్‌లు చోరీకి గురయ్యాయి. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు బహహుమతిగా ఇచ్చిన షెహనాయ్ కూడా వాటిలో ఉంది. చోరీకి గురైన వాటిలో 4 వెండి షెహనాయ్‌లున్నాయి. ఖాన్ కొడుకు కజిం హుస్సేన్ ఇంట్లో నుంచి దొంగలు షెహనాయ్‌లతోపాటు ఇనాయత్ ఖాన్ పురస్కారం, రెండు బంగారు గాజులను కూడా ఎత్తుకెళ్లారు. కజిం హుస్సేన్ ఇటీవలే వారణాసిలోని దాల్మండి ప్రాంతంలోకి ఇల్లు మారారు. పూర్వీకుల ఊరికి వెళ్ళొచ్చేలోపు ఇంట్లో చోరీ జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## సచివాలయంలో ఫైర్ స్టేషన్

**రాజధాని ప్రతినిధి-అమరావతి :** వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో ఫైర్ స్టేషన్‌ను ఫైర్ సర్వీసుల శాఖ డీజీ సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీ సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ఫైర్ స్టేషన్‌లో పనులు ఇంకా పూర్తికాలేదని అప్పటి వరకు తాత్కాలిక ఫైర్ స్టేషన్‌గా కొనసాగుతుందన్నారు. సచివాలయం సమీపంలో ఉన్న 11 గ్రామాలకు ఈ ఫైర్ స్టేషన్ నుంచే సేవలు అందిస్తామని చెప్పారు. కాగా రెండు ఫైర్ వెహికిల్స్ సచివాలయానికి చేరుకున్నాయి. మరో వెహికిల్ త్వరలోనే రానుంది.

## ఎస్సీ, ఎస్టీల ఉర్దూ పోస్టులు వారికే ఇవ్వాలి

**విధానమండలి హామీల కమిటీ నిర్ణయం**

**రాజధాని ప్రతినిధి-విజయవాడ :** ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు కేటాయించిన ఉర్దూ టీచర్ల ఖాళీలను కేటాయించాలని విధాన మండలి హామీల కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. రెండు రోజులపాటు స్థానిక సబ్ కలెక్టర్ సమావేశక్షించింది. ముఖ్యంగా వ్యవసాయం, ఎక్సైజ్, రెవిన్యూ, దేవాదాయ, ఆర్థిక, టూరిజం, విద్యాశాఖలకు ప్రభుత్వం ఇచ్చినహామీలను ఏ మేరకు అమలు జరిపారనే అంశాలపై సమీక్షించారు. మీడియాతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను సాధ్యమైనంత వరకు అన్నింటినీ అమలు చేసిందని సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా రైతులు, డ్వాక్రా మహిళకు రుణ మాఫీ, 24 గంటలు విద్యుత్ సరఫరా, ఇ-పోస్ విధానంలో నిత్యావసర వస్తువుల పంపిణీ వంటి కార్యక్రమాలు సత్ఫలితాలు ఇచ్చాయన్నారు. ఎస్సీ, ఎస్టీ బీసీ వర్గాలకు ఉర్దూనేర్పించాలని కమిటీ నిర్ణయించిదన్నారు. కమిటీ సభ్యులు పీజే చంద్రశేఖర్ రావు పి.సుధాకర్ బాబు పాల్గొన్నారు.

## తూర్పు గోదావరి శిల్పికి జయ విగ్రహాల బాధ్యత

**కాకినాడ :** తమిళులఆరాధ్యదైవం దివంగత జయలలిత విగ్రహాన్ని ఆ రాష్ట్ర వ్యాప్తంగా పెద్దెఎత్తున ప్రతిష్టించేందుకు సంకల్పించిన తమిళ ప్రభుత్వం విగ్రహాల రూపకల్పనలో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన తూర్పుగోదావరి జిల్లా కొత్తపేట గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ వడర్‌కు ఈ బాధ్యతలప్పగించింది. ఫిబ్రవరి 24 జయలలిత జయంతి ఈ సందర్భంగా ఎమ్‌జిఆర్ రీసెర్చ్ వర్సిటీలోఎమ్‌జిఆర్ కాంస్య విగ్రహాన్ని నెలకొల్పాలన్న గతంలోనే జయలలిత ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితేఆకస్మాత్తుగా జయలలిత మరణించబంతో ఎమ్‌జిఆర్‌తోపాటు జయలలిత విగ్రహాన్ని కూడా అక్కడే నెలకొల్పాలని నిర్ణయించింది. దీంతో రెండు విగ్రహాల బాధ్యతను రాజ్‌కుమార్ వడయార్‌కే అప్పగించారు. అంతేకాదు.. జయలలిత జయంతిని పురస్కరించుకుని తమిళనాడులోని అన్ని జిల్లాల కేంద్రాల్లోనూ ఆమె నిలువెత్తు కాంస్య విగ్రహాల ఏర్పాటుకు ఉద్దేశించిన ఆ రాష్ట్రప్రభుత్వం ఆ మేరకు ఆ ఆర్డర్లను కూడా రాజ్‌కుమార్ వడయార్‌కే అప్పగించింది. వడయార్ అత్యంత భక్తిశ్రద్దల్తో అమ్మవిగ్రహరూపకల్పనలో నిమగ్నమయ్యారు. కేవలం ఒక్కరోజులోనే విగ్రహానికి ఒక రూపుతెచ్చారు. దానికి మరింత రూపురేఖలు దిదుతున్నారు. ఈ విగ్రహాన్ని డిసెంబర్ నెలాఖరునాటికి ఇస్తాయని అన్నారు.

## హోంగార్డులకు వస్త్రాలు పంపిణీ

**రాజధాని ప్రతినిధి,కోనసీమ న్యూస్-జీఎన్.రావ్ :** అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న యూనిఫామ్స్‌ను పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన సామాజికవేత్త చెరుకూరి సాయిరామ్ సమకూర్చిన నూతన వస్త్రాలను మున్సిపల్ చైర్మన్ చిక్కాల వినాయకరావు హోంగార్డులకు అందజేశారు. ఈ సందర్భంగా సాయిరామ్ చేస్తున్న సేవా కార్యక్రమాలను పట్టణ డిఎస్పి ఎల్.అంకయ్య, సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్‌లు అభినందించారు.

## కుక్కలు బాబాయ్ కుక్కలు...
## రక్షించండి మహాప్రభో!



**రాజధాని ప్రతినిధి,కోనసీమ న్యూస్-జీఎన్.రావ్ :** ముమ్మిడివరం నగర పంచాయితీలోని 20 వార్డుల్లోను కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. రాత్రి సమయాల్లో వీధుల్లోకి రావాలంటేనే ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గతంలో నగర పంచాయితీ అధికారులు కుక్కలను పట్టించి వేరే ప్రాంతానికి తరలించారు. అయితే ఈ మధ్య కాలంలో కుక్కలు మరీ ఎక్కువై ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. పెద్దలు, పిల్లలు రోడ్ల మీదకు రావాలంటేనే భయపడుతున్నారు. గ్రామస్థాయి నుండి మండల స్థాయి వరకు కుక్కలు స్వైర విహారం చేస్తూ పిచ్చికుక్కల బారినపడి ఎందరో గాయాలపాలై కొందరు ఆసుపత్రిలో చేరుతున్నారు. మరికొందరు చనిపోయిన సంఘటనలు చూస్తున్నారని అయినప్పటికి ప్రభుత్వ పట్టించుకోకపోవడం విచారకరమని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 20 వరకు కుక్కలు రోడ్లపై బహిరంగంగానే వాహనదారులకు అడ్డు వెళ్తుతుండడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. పాఠశాలలకు వెళ్ళే పిల్లలను ఒంటరిగా పంపించాలంటే తల్లితండ్రులు భయభ్రాంతులకు గురవుతున్నారు. దీనిపై నగర పంచాయితీ అధికారులు, నగర పంచాయితీ ప్రజాప్రతినిధులు పట్టించుకుని చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు కోరుతున్నారు.

## విలీనానికి ఆటంకాలు లేవు

**న్యూఢిల్లీ :** భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ)లో దాని అనుబంధ బ్యాంకుల విలీన ప్రక్రియ సజావుగానే సాగుతోందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ రజనీష్‌కుమార్ తెలిపారు. నోట్ల రద్దు కారణంగా ఖాతాదారులకు సేవలందిస్తూ బ్యాంకులు తీరికలేకుండా ఉన్నా విలీన ప్రక్రియకు ఎలాంటి ఆటంకం లేదని వెల్లడించారు. పెద్ద నోట్ల రద్దు కారణంగా విలీన ప్రక్రియ ఆలస్యమవుతుందా? అన్న ప్రశ్నకు నాకు తులిసి అలాంటిదేమి లేదు అని సమాధానమిచ్చారు. భారతీయ మహిళా బ్యాంకు(బీఎంబీ) సహా ఎస్‌బీఐకి చెందిన ఐదు అనుబంధ బ్యాంకులను 2016-17 ఆర్థిక సంవత్సరంలోపు ఎస్‌బీఐలో విలీనం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న సంగతి తెలిసిందే. భారతీయ రిజర్వ్ బ్యాంకు పరపతి సమిక్షపై రజనీష్‌ను ప్రశ్నించగా, ముందుగా అంచనావేయడం చాలా కష్టం. ఎందుకంటే కమిటీ విధాన నిర్ణయాలను ఇప్పుడు తీసుకుంటుంది.రెపో రేటును 25-50 బేసిస్ పాయింట్ల వరకూ తగ్గించవచ్చని అందరూ భావిస్తున్నారు. అయితే అంతకుమించి పెద్ద ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు అని వ్యాఖ్యానించారు. నగదు నిల్వల నిష్పత్తి పెంచడం ద్వారా వచ్చే లాభాలను బ్యాంకులు ఖాతాదారులకు బదలాయిస్తాయని చెప్పారు. రాబోయే వారం రోజుల వరకు వేతనాలు, పెన్షన్లను తీసుకునే వారితో బ్యాంకుల వద్ద రద్దీ ఉంటుందని, ఇక డిపాజిట్లు చేసే వారి సంఖ్య క్రమంగా తగ్గుతుందని రజనీష్ అభిప్రాయపడ్డారు.

## 50 బ్యాంకులలో ఈడీ సోదాలు

**న్యూఢిల్లీ :** పెద్దనోట్ల రద్దు అనంతరం ఆర్థికపరమైన నేరాలు జరుగుతుండటంలో దేశవ్యాప్తంగా అన్ని బ్యాంకులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నిఘాపెట్టింది. 50 బ్యాంకుల శాఖల రికార్డులను పరిశీలించింది. హవాలా, మనీ లాండరింగ్ తదితర నేరాలు జరుగుతున్నాయన్న కోణంలో విచారణ చేపట్టింది. ఈడీ అధికారులు వివిధ బృందాలుగా ఏర్పడి ప్రైవేటు, ప్రభుత్వ రంగానికి చెందిన 10 బ్యాంకుల 50 శాఖలలో సోదాలు నిర్వహించింది. లావాదేవీల రికార్డులు, బ్యాంకు స్టేట్‌మెంట్లు, తదితర కీలక పత్రాలను తనిఖీ చేశారు. పెద్దనోట్ల రద్దు తర్వాత ఒక్కసారిగా పెద్ద మొత్తాలు జమ అయిన ఢిల్లీ, ముంబై, బెంగుళూరు, హైదరాబాద్, కోల్‌కతా, చెన్నై వంటి ప్రముఖ నగరాల్లోని బ్యాంకులలో సోదాలు నిర్వహించింది. మనీలాండరింగ్ నివారణ చట్టం (పీఎంఎల్), ఫారిన్ ఎక్ఛ్ంజ్ మేనేజ్‌మెంట్ లా (ఎఫ్‌ఈఎంఏ) నిబంధనల ఉల్లంఘున జరిగిందా అనేది విచారిస్తోంది. అనుమానస్పద లావాదేవీల నివేదికలు (ఎస్‌టీఆర్‌లు), నగదు లావాదేవీ నివేదికల (సీటీఆర్‌లు)పై నిఘా ఉంచింది. ఇటీవల సీఎంఎల్‌ఏ నిబంధనలను ఉల్లంఘించినందుకు యాక్సిస్ బ్యాంకు ఢిల్లీ శాఖకు చెందిన ఇద్దరు ఉద్యోగులను అధికారులు అరెస్టు చేసిన విషయం విదితమే.

## సచివాలయంలో ప్లే స్కూల్

**రాజధాని ప్రతినిధి-అమరావతి :** సచివాల ఉద్యోగుల పిల్లల సంరక్షణ కోసం వెలగపూడిలోని అంగన్‌వాడీ కేంద్రంలో క్రచ్ విభాగాన్ని ప్రారంభిస్తున్నట్లు స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పూనం మాలకొండయ్య తెలిపారు ఆమె సచివాలయంలోని 3వ బ్లాకులో అంగన్‌వాడీ కేంద్రంలో క్రచ్ విభాగాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. సచివాలయ ఉద్యోగులు ఈ కేంద్రంలో 5నెలల నుంచి 5 సంవత్సరాల మధ్య వయసున్న తమ పిల్లలను సంరక్షణ కోసం ఉంచవచ్చని ఆమె చెప్పారు. మూడేళ్ల నుంచి ఐదేళ్ల మధ్యపిల్లల కోసం నర్సరీ ఏర్పాటు చేశామని తెలిపారు. ఇక్కడ పిల్లలు ఆడుకోవడానికి అన్ని రకాల ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వయసును బయటి వాతావరణంతో కూడా పరిచయం అవసరమేనని, అందుకే సచివాలయం ఆవరణలో వారి కోసం ప్లే గ్రౌండ్ కూడా ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉందని ఆమె తెలిపారు.

## గాలి, శేఖర్‌రెడ్డిలను అరెస్టు చేయాలి

**సీపీఐ కార్యదర్శి కె. నారాయణ డిమాండు**

**హైదరాబాద్ :** వందకోట్ల నోట్లను మార్పిడిచేసిన గాలి జనార్థనరెడ్డిని, ఆర్థిక నేరానికి పాల్పడిన టీటీడీ బోర్డు సభ్యుడు శేఖర్‌రెడ్డిలపై కేసులుపెట్టి తక్షణం అరెస్టు చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రకటన ఇలా ఉంది. వంద కోట్ల రూపాయల మార్పిడిని సంబంధించి గాలి జనార్థనరెడ్డి కారు డ్రైవర్ రమేష్ ఇచ్చిన మరణ వాంగ్మూలం ఆధారంగా గాలి జనార్థనరెడ్డిపై క్రిమినల్ కేసులు బనాయించి, తక్షణం అరెస్టుచేయాలి. అలాగే ప్రతిష్టాత్మక తిరుపతి తిరుమల దేవస్థానం బోర్డు మెంబరు శేఖర్‌రెడ్డిపై ఐటి దాడులతో బయటపడ్డ ఘోర ఆర్థిక నేరం ధార్మిక వ్యవస్థకే కళంకం తెచ్చిపెట్టింది. ఇప్పటికైనా టీటీడీ బోర్డులో ధనార్జనపరులను సభ్యులుగా, చైర్మన్‌గా వేయడమనేది-పవిత్రమని భావించే భక్తులందరి హృదయాలు ద్రవించిపోతాయి. ఇప్పటికే 15మార్లు జీఓ విడుదల చేసారు. ఇంతటి గందరగోళ పరిస్థితి ఏనాడూలేదు. భవిష్యత్తులో కూడా ఇంత ఘోర పరిస్థితి కల్పించే పాలకులు వస్తారని అనుకోను. ఏమాత్రం విజ్ఞతఉన్నా గాలి జనార్థనరెడ్డిని, శేఖరరెడ్డిని అరెస్టు చేయడమే గాక, తిరుమల దేవస్థాన ప్రతిష్టకు భంగం కలగకుండా పాలకవర్గం సమీక్షించవలసిందిగా కోరుతున్నాను.




## ఇకపై మొబైల్ ఫోనే మీ బ్యాంకు : సీఎం



**రాజధాని ప్రతినిధి, అమరావతి :** పెద్ద నోట్ల రద్ద తదనంతరం పరిస్థితులలో ప్రజల ఆర్థిక అవసరాలకు పరిష్కారంగా 'మార్పు-నేస్తం'గా ఏపీ పర్స్ మొబైల్ యాప్‌ను అందించడం జరిగిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. విజయవాడ కమాండ్ కమ్యూనికేషన్ సెంటర్‌లో పెద్ద నోట్ల రద్దు అనంతరం పరిస్థితులపైబ్యాంకర్లు ఆర్బీఐ అధికారులు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ప్రభుత్వ ఆదాయం తగ్గి, కొంత నష్టం వచ్చినా ప్రజలను కష్టాల నుంచి బయటకు వేయడం మా కర్తవ్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. కరెన్సీ నోట్ల కొరత నేపథ్యంతో ఉన్న సమస్యలు ఎదుర్కొవడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రాష్ట్రానికి వస్తున్న కరెన్సీని ఒక పద్దతి ప్రకారం ప్రజలకు అందుబాటులో పెడుతూనే.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేపడుతున్నామన్నారు. బ్యాంకుల ద్వారా రూ.2478 కోట్ల మేర ఈ రోజు లావాదేవీలు జరిగాయన్నారు. ప్రస్తుతం రూ.2040 కోట్ల నగదు అందుబాటులో ఉందని, వీటిలో రూ.211 కోట్లు చిన్న నోట్లు ఉన్నట్లు సీఎం తెలిపారు. చిల్లర సమస్యను సమర్థవంతంగా అధిగమించేందుకు ప్రతిఒక్కరూ నగదు రహిత లావాదేవీల విధానంలో మొబైల్, కార్డుల వినియోగాన్ని చేపట్టాలని తెలిపారు. జిల్లా కలెక్టర్లు ఆ దిశలో గ్రామస్థాయి నుంచి అవగాహన కల్పించేలా డిజిటల్ లావాదేవీలను పెంపొందించాలని స్పష్టం చేశామన్నారు. ఈ దిశలోఏపీ పర్స్ మొబైల్ యాస్మార్పు-నేస్తంతో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలికామని సీఎం చెప్పారు. యాప్‌ని విడుదల చేసిన నిమిషాలలోనే 1000 మందికి దీనిని వినియోగించుకున్నాంన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 10 వ్యాలెట్ కంపెనీలు, 13 బ్యాంకులు ఏపీ పర్స్ మొబైల్ యాప్‌లో సభ్యులుగా నమోదయ్యారని, మరో 6 కంపెనీలు ఆదిశలో ముందుకు వస్తున్నాయన్నారు. ఏపీ పర్స్ యాప్ ద్వారా లావాదేవీలు ప్రజలు అలవర్చుకోవాలన్నారు. ఏపీ పర్స్ మొబైల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకునే విషయంలో 15వేల మంది ద్వారా క్షేత్రస్థాయిలో సేవలందించేలా సెర్ప్ ద్వారా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. చిరు వ్యాపారులకు ఏపీ పర్స్ మొబైల్ యాప్ బాగా ఉపయోగ పడుతుందన్నారు. రాష్ట్రంలోని చౌకధర దుకాణాల ద్వారా సుమారు 70 శాతం మందికి నగదు రహిత చెల్లింపుల విధానంలో నిత్యావసర సరుకులను పంపిణీ చేశామన్నారు.

## కరెన్సీ మృతులకు నష్టపరిహారం

**లక్నో :** నోట్లరద్దు తరువాత బ్యాంకు నుంచి కొత్తనోట్లు తీసుకునే క్రమంలో మృతిచెందిన వారికి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ నష్టపరిహారం ప్రకటించారు. అలిఘర్‌లో ఓ మహిళా పాతనోట్లు మార్చుకోలేక ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో అఖిలేశ్ ఈ నిర్ణయం తీసుకున్నారు. 'నోట్ల మార్పిడిలో విఫలమై ఆత్మహత్య చేసుకున్న రజియా కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం ప్రకటించినట్టు ప్రభుత్వ అధికారి ప్రతినిధి ఒకరు వెల్లడించారు. డబ్బు కోసం ఏటీఎం వద్ద పొడవటి క్యూలో నిలబడి ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు కూడా రూ.2 లక్షల పరిహారం ఇవ్వాలని సీఎం నిర్ణయించినట్టు ఆయన తెలిపారు. రోజువారీ కూలీ చేసుకునే 45 ఏళ్ల రజియా తన వద్ద ఉన్న ఆరు రూ.500 పాత నోట్లను మార్చుకోవడానికి ఐదురోజుల పాటు నగరంలో ఉన్న అన్ని బ్యాంకుల చుట్టూ తిరిగింది. అయితే ఖాతా ఉన్నవారికే ఇక్కడ డబ్బులు ఇస్తామని బ్యాంకర్లు చెప్పడంతో ఆమె మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకుంది.

## బ్యాంకింగ్ వ్యవస్థలో 'ఇస్లామిక్'
## అనుమతించొద్దు : శివసేన

**న్యూఢిల్లీ :** బ్యాంకింగ్ వ్యవస్థలో 'ఇస్లామిక్ విండోను కాలువ నిర్మాణం, మరాఠా సామాజిక వర్గానికి రిజర్వేషన్లపై లోక్‌సభ జీరో అవర్‌లో ప్రస్తావించారు. బ్యాకింగ్ వ్యవస్థలో ఇస్లామిక్ విండో ఏర్పాటుపై శివసేన సభ్యుడు చంద్రకాంత్ ఖైయిర్ తీవ్ర ఆక్షేపణ తెలిపారు. బ్యాంకింగ్ వ్యవస్థ అంతా షరియా చట్టం ఆధారంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. ఆర్బీఐ వ్యవస్థలో 'ఇస్లామిక్ విండోను ఏర్పాటు చేయనున్నదన్న సమాచారంపై చంద్రకాంత్ స్పందించారు. సమాజంలోని ఇస్లామిక్ వర్గాన్ని ఆర్థిక పరమైన లావాదేవీల్లో భాగస్వాములను చేసే నిమిత్తం ఆర్బీఐ, కేంద్రం ఈ ప్రతిపాదనను తెరపైకి తెచాచయి. తక్షణమే సట్లేజ్ యమునా లింకు కాలువల నిర్మాణం చేపట్టాలని ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ సభ్యుడు దుష్యంత్ చౌతలా డిమాండ్ చేశారు.

## 12న మిలాద్-ఉన్-నబీ సెలవు దినం

**హైదరాబాద్ :** మిలాద్-ఉన్-నబీ పర్వదినం సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు డిసెంబరు 12న సెలవు దినాన్ని పాటిస్తాయని సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ కోఆర్డినేషన్ కమిటీ, రీజనల్ స్పోర్ట్ బోర్డు తెలిపింది. ఇంతకు ముందు డిసెంబర్ 13న నాడు మిలాద్-ఉన్-నబీ సెలవు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల సెలవు పట్టిక ప్రకారం మిలాద్-ఉన్-నబీ సెలవు దినం డిసెంబర్ 12న ఉన్నందున కేంద్ర ప్రభుత్వాల కార్యాలయాలకు కూడా మిలాద్-ఉన్-నబీ సెలవు దినం పాటించనున్నారు.

## అమరావతిలో ప్రపంచ స్థాయి డేటా సెంటర్

**ఏడీసీ చైర్‌పర్సన్ శ్రీమతి డి. లక్ష్మీ పార్థసారధితో జపాన్ ప్రతినిధులు భేటీ**

**రాజధాని ప్రతినిధి, అమరావతి :** రాజధాని అమరావతి నగరంలో ప్రపంచ స్థాయి డేటా సెంటర్‌ను స్థాపించడానికి జపాన్ సంస్థ ఇంటర్నెట్ ఇన్నోవెటివ్ జపాన్ (ఐఐజె) ప్రతినిధులు ముందుకొచ్చారు. కేదారేశ్వరపేటలోని అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) కార్యాలయంలో జపాన్ ప్రతినిధులు డేటా సెంటర్‌పై చర్చించారు. ఐఐజే సంస్థ అసిస్టెంట్ మేనేజర్ యూకో కజ్జామ రాజధానిలో అత్యాధునిక ప్రమాణాలతో నిర్మించనున్న డేటా సెంటర్ నిర్మాణం. దాని అవశ్యకతపై చైర్‌పర్సన్‌కు కూలంకుశంగా వివరించారు. అమరావతి ప్రపంచ ప్రఖ్యాత నగరంగా తీర్చిదిద్దేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పూనుకుందని ఆకర్షణీయ నగరాల్లో ఇది ఇకటిగా నిలువనుందని ఛైర్‌పర్సన్ లక్ష్మీ పార్థసారధి జపాన్ ప్రతినిధులకు వివరించారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని డేటా సెంటరును నాణ్యతా ప్రమాణాలలో రాజీ పడకుండా తీర్చిదిద్దాలని సూచించారు. అంతకుముందే రాజధాని నగరంలో పర్యటించిన జపాన్ ఐఐజే బృందం అమరావతి భౌగోళిక వైవిధ్యం, సమృద్ధిగా ఉన్న సహజ సిద్ధమైన వనరులపై సంతృప్తి వ్యక్తపరించారు. డేటా సెంటర్ నమూనా విశేషాలను ఏడీసీ అధికారులకు దృశ్య శ్రవణం ద్వారా కళ్లకు కట్టారు.

ఈ సమావేశంలో జపాన్‌కు చెందిన ఇన్నో వేటింగ్ ఎనర్జీ జపాన్ టెక్నాలజీ, ఎన్‌టీటీ డేటా కార్పొరేషన్ జపాన్, భారతదేశంలోని జపాన్ అనుబంధ సంస్థ సుమితోమా కార్పొరేషన్ సీజీఎం కజువొ యుషిజాకొ ఏడీసీ జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, అర్బన్ ప్రణాళికా విభాగాధిపతి డాక్టర్ కేవీ గణేష్‌బాబు, ప్రణాళికా విభాగం నిపుణులు లవణ్ కుమార్, ఎం.వి.పి.రావు, చేపేని వెంకటేశ్వరరావు, గోపాలకృష్ణ, ఆర్వీ, జీఐసీ ప్రతినిధులు పాల్గొన్నారు.



## షరియాకు వ్యతిరేకం : ఎంజే అక్బర్

**న్యూఢిల్లీ :** మహిళా హక్కులను కాలరాయడం షరియా చట్టానికి వ్యతిరేకమని, లింగ స్వేచ్ఛ, సామానత్వం లేకుండా ఏ రాజ్యం ఆధునికతను సంతరించుకోలేదని కేంద్రమంత్రి ఎంజే అక్బర్ అన్నారు. ఖుర్‌ఆన్ చట్టాలపై అవగాహన ఉండి దానిని అర్థం చేసుకున్న వారెవరు కూడా ఈ అంశంపై వాదించరని, లింగపరమైన చట్టాలపై నిరాకరించటం షరియా చట్టానికి వ్యతిరేకమని ఆయన స్పష్టంచేశారు. 'చట్టాలు పురుషుల దురాక్రమణకు గురవుతున్నాయి. దీనిని ఖుర్‌ఆన్ ఖండిస్తోంది.

లింగ సమానత్వం, స్వేచ్ఛ, ప్రగతి లేని రాజ్యం ఆధునిక రాజ్యం కాలేదు. అది సాధ్యం కాదు కూడా' అని అక్బర్ అన్నారు. సార్క్ చార్టర్ సందర్భంగా సార్క్ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎంజే అక్బర్ పాల్గొన్నారు. మోడరన్ స్టేట్‌కు లింగ సమానత్వంతో పాటు ఆలోచన. భావ ప్రకటన స్వేచ్ఛ, రాజకీయ- రాజకీయ యేతర వ్యక్తీకరణ స్వేచ్ఛ అవసరమని ఆయన తెలిపారు.

## మున్సిపల్ టీచర్ల జీవో విడుదల

**రాజధాని ప్రతినిధి :** మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ ఉత్తర్వ్యులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో మున్సిపల్ మంత్రి నారాయణ తాత్కాలిక సచివాలయంలో విడుదల చేశారు. ఇంతకు ముందు రాష్ట్రంలోని మున్సిపల్ కమిషనర్లు, మేయర్లు, ఛైర్మన్లు ఇష్టానుసారంగా బదిలీలు, ప్రమోషన్లు చేసే వారని ఇప్పుడు విడుదల చేసిన జీవోలు ఉపాధ్యాయులకు మేలు చేస్తాయని మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధి ఎంఎస్ ఇమాంబాషా హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ రామకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

## 15 వరకు గ్రూప్-2 దరఖాస్తుల గడువు పొడిగింపు

**హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్‌లో గ్రూప్-2 దరఖాస్తుల స్వీకరణ గడువును మరో మారు పొడిగించారు. ఈ నెల 15వ తేదీ వరకు అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు, ఈ విషయాన్ని ఎపిపిఎస్సీ చైర్మన్ ఉదయ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ గడువును ఒకసారి పొడిగించారు. ఇలా పొడిగించడం ఇది రెండవ సారి. గ్రూప్-2కు భారీగా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొలువుల జాతరకు తెరలేపింది. రాష్ట్రంలో 10వేల పోస్టులను భర్తీ చేయనుంది. ఇందులో 4వేలకుపైగా పోస్టులు పోలీసు శాఖకు సంబంధించినవి కాగా మిగిలిన పోస్టులు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందినవి. పోలీసు పోస్టులకు గత నెలలోనే పరీక్షను నిర్వహించారు. ప్రస్తుతం గ్రూప్-2 దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ జరుగుతోంది. ఇక మిగిలిన పోస్టులకు సంబంధించి కూడా నోటిఫికేషన్ల జారీకి ఎపిపిఎస్సీ సిద్ధమవుతోంది.

## వార్థాపై అప్రమత్తంగా వుండాలి

**తీరప్రాంతవాసులకు విపత్తుల నిర్వహణశాఖ హెచ్చరిక**

**రాజధాని ప్రతినిధి-విజయవాడ :** ఆగ్నేయ బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన వార్థాతుపాన్ వాయవ్యదిశలో పయనిస్తూ ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తాతీర ప్రాంతం వైపు కదులుతున్నందున తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా వుండాలని విపత్తుల నిర్వహణ శాఖ కమిషనర్ ఎం.వి.శేషగిరిబాబు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈనెల 12వ తేదీ నెల్లూరు-కాకినాడ మధ్యలో తీరం దాటే అవకాశం వుందని తెలిపారు. తీరం దాటే సమయంలో 80 నుంచి 130 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం వుండడంతో దీని ప్రభావం తీరప్రాంత జిల్లాలపై పడుతుందన్నారు. తుపాన్ వల్ల ఎటువంటి విపత్తులు, ప్రమాదాలు జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లా కలెక్టర్‌లను కోరారు. అలాగే ప్రమాద తీవ్రత ఎక్కువగా వుండే ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేసేందుకు అవసరమైన ప్రత్యేక సిబ్బందిని నియమించుకోవాలని సూచించారు. తుపాన్ బాధితులకు అందుబాటులో వుండేందుకు విజయవాడ కమాండ్ కమ్యూనికేషన్ సెంటర్‌లో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసిందని, వివరాలకు 0866 2488000 నెంబరును సంప్రదించాలని కోరారు.

## పెద్దనోట్ల రద్దును ప్రజలు స్వాగితిస్తున్నారు

పెద్దనోట్ల రద్దును ప్రజలంతా స్వాగతిస్తున్నారు. దీనికి తాజా ఉదాహరణగా అస్సాంలోని లక్ష్మాపూర్, మధ్యప్రదేశ్‌లోని షాడోల్ పార్లమెంట్ స్థానాల ఎన్నికల ఫలితాలను చెప్పుకోవచ్చు. నవంబరు 22 న వెలువడిన రెండు స్థానాల్లో మళ్లీ బీజేపీనే గెలిచింది. ఈ ఫలి తాలను బట్టి, పెద్ద నోట్ల ప్రభావం భారతీయ జనతా పార్టీ పై పెద్దగా పడలేదని అవగాహన రావటానికి వీలుంది. వీటితో పాటు తమిళనాడు, మధ్యప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్‌లలో మరో 10 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరిగాయి. మధ్యప్రదేశ్‌లోని నేపాల్ నగర్‌లో భారీ మెజారిటీతో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి విజయం సాధిం చారు. గత ఎన్నికల్లో అక్కడ గెలుపొందిన బి.జె.పి. అభ్యర్థి మెజారిటీ 22,178 రేట్లు కాగా, ఇప్పటి మెజారిటీ 42,198 కి పెరిగింది. ఇటీవల ఫలితాలు వెలువడిన 10 అసెంబ్లీ స్థానాల్లో మూడు బి.జె.పి., మూడు ఎ.ఇ.డి.ఎం.కె. పార్టీలకు దక్కగా, సి.పి.ఎం.కి రెండు, తృణమూల్ కాంగ్రెస్‌కి ఒకటి, జాతీయ కాంగ్రెస్‌కి ఒకటి దక్కాయి. దాన్ని బట్టి కూడా పెద్దనోట్ల రద్దు ప్రభాతం భారతీయ జనతా పార్టీపై పడలేదని అవగతమౌతుంది. పెద్ద నోట్ల రద్దు అనంతరం జరిగిన ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీ అభ్యర్థులు తమ స్థానాలు కాపాడుకోవటం గమనార్హం.

పెద్ద నోట్లు రద్దు ఒకటి రెండు రాష్ట్రాలకే పరిమితం కాదు. దేశ వ్యాపితంగాను, ఈ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలన్నింటి పైన ఆ ప్రభావం ఉండి తీరాలి. నోట్ల రద్దు అనంతరమే గుజరాత్‌లో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగాయి. ఇటీవల ఫలితాలు వెలువడ్డాయి. 123 స్థానాలకు ఎన్నికలు జరిపి, ఫలితాలు వెలువడగా,107 చోట్ల భారతీయ జనతాపార్టీ అభ్యర్థులే విజయం సాధించారు. . కాంగ్రెస్‌కి దక్కింది కేవలం 19 మాత్రమే. నోట్ల రద్దు అక్రమం, అసమజసం, అన్యాయం అంటూ కాంగ్రెస్ నాయకులు దేశవ్యాపితంగా ఆందోళనలు జరుపుతున్నా పార్లమెంటు, రాజ్యసభ సమావేశాలను అడ్డుకుంటున్నా, అవేవి ప్రజల తలకెక్కటం లేదని ఈ ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. కొద్ది రోజుల్లో జరిగే ఎన్నికల నాటికి, నోట్ల రద్దు విషయం ప్రజలు మర్చిపోయినా,ఆశ్చర్యపోనక్కర్లేదు.

**- దాసరి ఆళ్వార స్వామి**
**సెల్: 9393818199**

## మహాగాయకుడు ఘంటసాల జయంతి



**రాజధాని ప్రతినిధి,కోనసీమ న్యూస్-జిఎన్.రావ్ :** తెలుగు పాటకు వన్నెలు తెచ్చిన మధుర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు అని పలువురు పేర్కొన్నారు. మహాగాయకుడు ఘంటసాల జయంతిని కొంకాపల్లి సాంఘిక సంక్షేమశాఖ బాలుర వసతి గృహం వద్ద చేతివృత్తుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఘంటసాల చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఘంటశాల ఆలపించిన భగవద్గీత చిరస్మరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదుల సూర్యనారాయణమూర్తి, తెలుగు అధ్యాపకుడు నల్లా నరసింహమూర్తి, పేరి సూర్యనారాయణశర్మ, కైరం నరసింహారావు, పొలమూరి రామకృష్ణ, సింహాద్రి గంగాధర రామారావు, చిట్టూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## సినీ నటి జయలలితకు నివాళి



**రాజధాని ప్రతినిధి,కోనసీమ న్యూస్-జిఎన్.రావ్ :** తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి, సినీ నటి జయలలిత మృతికి అమలాపురం బాక్సాఫీస్ కార్యాలయంలో సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాక్సాఫీస్ రిపోర్టర్ జిన్.రావ్ మాట్లాడుతూ చలనచిత్ర రంగంలో ఎన్నో సినిమాలు నటించిన ఈమె తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుని స్థానం సాందించారన్నారు. ఎన్నో తెలుగు చిత్రాల్లో ఎందరో మహానటులతో కలసి నటించారని అన్నారు. అలాగే రాజకీయాల్లో కూడా మంచి నేతగా, తమిళ ప్రజల అమ్మగా పేరు పొందారన్నారు. ఈమె మరణం రాజకీయ, చిత్ర రంగాలకు తీరని లోటని అన్నారు. ఆమె మరణానికి చింతిస్తూ జయలలిత చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు వి.శివ, మహ్మద్ అబ్బాస్‌హైదర్, ఎస్.ఉమామహేశ్వరరావు, ఏ.తేజ, ఏ.భరత్‌రామ్, కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రావులపాలెంలో సినీ నటుడు రవివర్మ సందడి

**రాజధాని ప్రతినిధి,కోనసీమ న్యూస్-జిఎన్.రావ్ :** జయమ్ము నిశ్చయమ్మురా చిత్రంలో విలన్‌గా నటించిన రవివర్మ రావులపాలెం బేతాళుడు చిత్రం ప్రదర్శిస్తున్న పద్మశ్రీ థియేటర్‌కు చిత్రం చూసేందుకు మిత్రులతో కలసి వచ్చారు. ఈ సందర్భంగా రవివర్మ మాట్లాడుతు ఇటీవల తాను నటించిన జయమ్ము నిశ్చయమ్మురా చిత్రంలో తన పాత్రకు మంచి గుర్తింపు లభించిందన్నారు. ఇప్పటివరకు తాను వెన్నెల, రాఖీ, బొమ్మరిల్లు, అసుర, రౌడీ చిత్రాల్లో నటించానన్నారు. అలాగే కాలింగ్ బెల్ చిత్రంలో హీరోగా నటించినట్లు చెప్పారు. క్షణం సినిమా తమిళ వెర్షన్‌లో నటిస్తున్నట్లు, రానా హీరోగా నటిస్తున్న గాజీ సినిమా, హిందీ, తెలుగు చిత్రాల్లో తాను ప్రధాన పాత్రలు పోషిస్తున్నట్లు తెలిపారు. అవి త్వరలో విడుదల కానున్నట్లు చెబుతూ తన అమ్మమ్మగారి ఊరైనా ఊబలంక వచ్చినట్లు ఈ సందర్భంగా తెలిపారు.

## ఘనంగా అంబేద్కర్ 61వ వర్ధంతి



**రాజధాని ప్రతినిధి,కోనసీమ న్యూస్-జిఎన్.రావ్ :** అమలాపురం పట్టణంలో జిల్లా మాలమహానాడు ఆధ్వర్యంలో జరిగిన 61వ వర్ధంతి సందర్భంగా స్థానిక ఎమ్మార్వో కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి జిల్లా మహాలమానాడు కన్వీనర్ చీకురుమెల్లి కిరణ్‌కుమార్ పూలమాలలువేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా బడుగు, బలహీన వర్గాలకు హక్కులు కల్పించిన మహనీయుడు బాబాసాహేబ్ అంబేద్కర్ అని అన్నారు. నేటి రాజకీయ పార్టీలు రాజ్యాంగాన్ని పూర్తిగా అమలు చేసినపుడే ఆయనకు ఇచ్చిన ఘనమైన నివాళి అన్నారు. అంబేద్కర్ అందరివాడనీ, ఏ వర్గానికి సంబంధించిన వారుకాదని అన్నారు. అంబేద్కర్‌ను ప్రతిఒక్కరూ స్ఫూర్తి దాయకంగా తీసుకుని ఆయన వేసిన బాటలో నడవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సేవాసమితి కార్యదర్శి పట్నాల వెంకటరమణ మల్లికార్జునరావు(రమణ), జిల్లా మాలమహానాడు ఆర్గనైజింగ్ కార్యదర్శి మెరమళ్ల గంగాధర్, మాలమహానాడు నాయకులు ఉల్లింగి శ్రీకృష్ణ, నక్కా పెద్దిరాజు, పోతుల అర్జున్, సిహెచ్.బాలయోగి, నక్కా నాగేంద్రబాబు, బొంతు మధన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## త్వరలో హజ్ యాత్ర నోటిఫికేషన్

**హైదరాబాద్ :** వచ్చే ఏడాది హజ్ యాత్రకు సంబంధించి త్వరలోనే నోటిషికేషన్ వెలువడనున్నదని, యాత్రకు వెళ్లే వారు తమ పాస్‌పోర్టులను సిద్ధం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ హజ్‌కమిటీ చైర్మన్ మొమిన్ అహ్మద్ హుస్సేన్ తెలిపారు. హజ్ కమిటీ 4వ సమావేశం హైదరాబాద్‌లో జరిగింది. సమావేశంలో హజ్‌కమిటీ సభ్యులు అహ్మద్ షరీఫ్ (ఎమ్మెల్సీ), షేక్ మహ్మద్ ఇక్బాల్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహ్మద్ లియాఖత్ అలీతో పాటు ఇతర సభ్యులంతా పాల్గొన్నారు. 2017 హజ్‌యాత్రకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ జిల్లా హజ్‌కమిటీలకు ప్రత్యేక శిక్షణ , విజయవాడలో హజ్ భవనం ఏర్పాటు, తదితర అంశాలను కమిటీ చర్చించింది. పాస్‌పోర్టులు లేనివారు త్వరగా దరఖాస్తులు చేసుకోవాలని, ఉన్నవారు తమ ఎక్స్‌పైరీ డేట్‌ను సరిచూసుకోవాలని, పాస్‌పోర్ట్ వ్యాలిడిటీ 2018 ఫిబ్రవరి 28 వరకు తప్పనిసరిగా ఉండాలని, ఒక్కరోజు తక్కువగా ఉన్నావెంటనే రిన్యువల్ చేసుకోవాలని హుస్సేన్ వివరించారు. దరఖాస్తు చేసే రోజుకు 70 సంవత్సరాలు నిండిన వారు ఎ – కేటగిరికి చెందిన సీనియర్ సిటిజన్స్ కిందకి (రిజర్వ్ క్యాటగిరీ) వస్తారని, ఒకవేల వీరు ప్రైవేటుగా హజ్‌చేసి వుంటే రిజర్వ్ క్యాటగిరీ కిందకి రారని స్పష్టం చేశారు. అలాగే గతంలో హజ్ చేయకుండా మూడుసార్లు డ్రాలో పేరు రానివారు నాలుగవ సారి దరఖాస్తు చేసుకున్న వారికి బి క్యాటగిరీ కింద అవకాశం లభిస్తుంది ప్రైవేటుగానైనా, మజ్‌కమిటీ ద్వారానైనా ఎలా హజ్ చేసినా రిజర్వ్ క్యాటగిరీ కిందకి వారురారు. రిపీటర్ ఫుల్ విమాన టికెట్ కొనాల్సివుంటుంది. గ్రీన్ క్యాటగిరిలో వండుకోవడానికి ఎట్టిపరిస్థితిలోనూ అనుమతించరు. వచ్చే ఏడాది హజ్ యాత్రికులకు సిమ్ కార్డు ఇచ్చే ప్రసక్తే లేదని సౌదీ ప్రభుత్వం స్పష్టం చేసినట్లు ఆయన తెలిపారు. మెహరం లేకుండా మహిళ హజ్ యాత్ర చేయడానికి వీలులేదు. గర్భిణీ స్త్రీలకు కూడా అనుమతి లేదు. అలాంటి వారు దరఖాస్తు చేసుకోరాదని ఆయన స్పష్టం చేశారు. ఒకసారి హజ్‌యాత్ర చేస్తే వారిని రిపీటర్‌గా పరిగణిస్తారు. ఎ క్యాటగిరీ కింద వారు డ్రాతో సంబంధం లేకుండా హజ్‌యాత్రకు వెళ్లవచ్చని హుస్సేన్ తెలిపారు.

## అంతంత మాత్రమే వాహన విక్రయాలు

**న్యూఢిల్లీ :** నవంబర్ నెలలో దేశీయ ప్రయాణ వాహన విక్రయాల్లో 1.82శాతం వృద్ధి నమోదైంది. గతేడాది. 2,36,664 యూనిట్ల అమ్మకాలు జరగ్గా ఈ ఏడాది 2,40,979 వాహనాలు విక్రయమైనట్లు సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మానుఫ్యాక్చర్స్ (ఎస్ఐఏఎం) తెలిపింది. ఇక దేశీయంగా కార్ల విక్రయాలకు వస్తే పెద్దగా వృద్ధి నమోదు చేయలేదట. గతేడాది 1,73,606కు మాత్రమే చేర్చాయి మోటార్‌సైకిల్ రంగం విక్రయాలు 10,21 శాతం క్షీణించాయి. 2015లో 8,66,696 వాహనాలను విక్రయించగా, ఈఏడాది. కేవం 7,78,178 వాహనాలను మాత్రమే కంపెనీలు అమ్మగలిగాయి. ద్వీచక్రవాహనాల అమ్మకాలు కూడా 5.85 శాతం తగ్గాయి. కమర్షియల్ వాహనాల విక్రయాలు 11.58 శాతం తగ్గాయి.

# కార్మికులకు భీమా.. చంద్రన్న భీమా..




**రాజధాని ప్రతినిధి,కోనసీమ న్యూస్-జిఎన్.రావ్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 13 జిల్లాల్లో చంద్రన్న బీమా పథకంలో 2కోట్ల మందికి బీమా ప్రీమియం చెల్లించగా ఇప్పటివరకు ప్రజాసాధికారక సర్వే ద్వారా 1కోటి 73లక్షల మందికి పైగా ఈ పథకంలో చేరారు. చంద్రన్న బీమాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కార్మిక శాఖ ద్వారా అమలు చేస్తుంది. ఈ పథకం ప్రధాన లక్ష్యం ఆర్థికంగాను, సామాజికంగాను బలహీన వర్గాలైన 2కోట్ల అసంఘటిత కార్మికులు, వారి కుటుంబాలకు భరోసా కల్పించడమే ఈ బీమా పథకం లక్ష్యం. అసంఘటిత కార్మికుని మరణం, ప్రమాదం లేదా అంగవైకల్యం సంభవించిన సందర్భంలో ప్రమాదం కారణంగా వైద్య ఖర్చులు రూపంలో ఆ కుటుంబం మీద ఆర్థిక భారం పడుతుంది. ఈ నేపథ్యంలో అసంఘటిత కార్మికుడి మరణం లేదా అంగవైకల్య బీమాను అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కార్మికుడి కుటుంబం యొక్క ఆర్థిక అవసరాలు దృష్టిలో ఉంచుకుని అసంఘటిత కార్మికులకు ఈ బీమా పథకం రూపొందించబడింది. ఈ బీమాలో చేరేందుకు సంవత్సరానికి రూ.15 ప్రీమియంతో పాటు ఆధార్ కార్డు తప్పనిసరి.

**ఈ పథకం ప్రయోజనాలు**

చంద్రన్న బీమా పథకంలో భాగంగా ఆమ్ ఆద్మీ పథకాన్ని(కేంద్ర ప్రభుత్వ పథకం) లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా మరియు రాష్ట్ర ప్రభుత్వ బీమాను ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా అమలవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 2కోట్ల అసంఘటిత కార్మికుల కోసం రెండు ఇన్సూరెన్స్ కంపెనీలకు ప్రీమియం చెల్లించింది. నమోదుకాని కార్మికలకు కూడా ఈ బీమా వర్తింపు చేసేవిధంగా ఏర్పాటుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 2కోట్ల పైబడి ఉన్న అసంఘటిత కార్మికులందరినీ ప్రభుత్వం చేపట్టిన ప్రజాసాధికార సర్వేలో నమోదు చేస్తారు. సర్వేలో నమోదు కాని అసంఘటిత కార్మికులకు కూడా చంద్రన్న బీమా అమలుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సర్వేలో నమోదు కాని అసంఘటిత కార్మికుడు మరణించినట్లయితే అతని కుటుంబానికి బీమా పరిహారం అందజేయడానికి, అతని వారసులు(లీగల్ హేర్) స్వీయ ధ్రువీకరణతో పాటు మరణించిన కార్మికుడి ఆధార్, రేషన్ వివరాలు పరిగణలోనికి తీసుకుని పరిహారం అందజేస్తారు. మరణ సమాచారాన్ని కాల్ సెంటర్ నంబర్ : 155214కు ఫోన్ చేసి ఆధార్ నంబర్, పాలసీ నంబర్‌ను తెలియజేయాలి. ఇవి లేని సందర్భంలో మరణించిన కార్మికుడి పేరు, గ్రామం, మండలం, వార్డు, మున్సిపాలిటీ, జిల్లా వివరాలు తెలియజేయాలి. రాష్ట్రస్థాయి కాల్ సెంటర్ నంబర్‌కు వచ్చిన కాల్‌ను జిల్లా మహిళా సమాఖ్య కాల్ సెంటర్‌కు కలుపుతుంది. జిల్లా మహిళా సమాఖ్య కాల్ సెంటర్ వివరాలను నమోదు చేసుకుని వెంటనే మండలంలో ఉన్న బీమా మిత్రులకు అందజేస్తుంది. గ్రామస్థాయిలో వెలుగు మహిళా సంఘ సభ్యులకు తెలియజేసినా తక్షణమే మరణ సమాచారాన్ని నమోదు చేస్తారు. చంద్రన్న బీమా పథకంలో అసంఘటిత కార్మికుడు ప్రమాద మరణం లేదా పూర్తి అంగవైకల్యం సంభవిస్తే రూ.5లక్షలు, పాక్షిక శాశ్వత అంగవైకల్యం రూ.3లక్షల 62వేల 500, సహజ మరణం రూ.30వేలు, 9,10, ఇంటర్, ఐటిఐ చదువుతున్న ఇద్దరు పిల్లలకు ఒక్కొక్కరికి ఉపకరావేతనంగా రూ.1200 ఇస్తారు.

### అసంఘటిత కార్మికులుగా గుర్తింపు పొందనివారు

నెలసరి ఆదాయం రూ.15వేలు కన్నా ఎక్కువ ఆర్జించేవారు. ప్రభుత్వ, ప్రభుత్వ రంగసంస్థల, బ్యాంకుల బీమా కంపెనీలు మొదలగు వాటిలో శాశ్వత ఉద్యోగులు. 5ఎకరాల మెట్ల లేదా, 2ఎకరాల మాగాణి పొలం కన్నా ఎక్కువ కలిగిన వ్యవసాయాదారులు. 18 సంవత్సరాలు లోపు, 70 సంవత్సరాలు పైబడివారు అనర్హులు.

**అర్హత కలిగిన వారు**

వ్యవసాయ మరియు అనుబంధ ఉపాధుల పనివారు : 5ఎకరాలు లోపు మెట్ట లేదా 2.5 లోపు మాగాణి పొలం రైతులు, వ్యవసాయ కూలీలు, ఉద్యానవన, నర్సరీలు, ఆటవీ ఉత్పత్తులు, పాడి పరిశ్రమ, పట్టుపురుగులు పెంపకం, కొబ్బరి పరిశ్రమల పనివారు, మత్స్యకారులు.

**భవన,ఇతర నిర్మాణల్లో పనిచేసేవారు**

తాపీ, త్రవ్వకం, రాళ్ళు కొట్టుల, సెంట్రింగ్, రాడ్‌బెండింగ్, ప్లంబింగ్, శానిటరీ, వడ్రంగి, రంగులు వేయడం, టైల్స్, ఎలక్ట్రీషియన్, వెల్డింగ్, రిగ్గర్లు, బోర్‌వెల్, ఇంటీరియర్ డిజైన్, ఇటుక-సున్నం బట్టీలు, ఇసుక, రాళ్ళ క్వారీలు, రాళ్ళ క్రషర్లు, కాంక్రీటు మిక్సర్లు, బావులు త్రవ్వడం, పూడిక, నిర్మాణరంగ పనివారు, ఉపాధిహామీ పథకంలో మట్టి నిర్మాణ పని, రవాణామార్గ నిర్మాణ, నిర్వహణ పనులు, నీటిపారుదల, నిల్వ నిర్మాణ నిర్వహణ పనులు, ఎలక్ట్రికల్, టెలిఫోన్, టివి లైన్ల నిర్మాణం నిర్వహణ, విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ.

**చేతివృత్తుల పనివారు**

చేనేత, కుమ్మరి, స్వర్ణకారులు(బంగారుపని) క్షౌరవృత్తి, బ్యూటిపార్లర్లు, చర్మకారులు, బట్టలు ఉతికే చాకలివారు, ఇతర ఏదేని చేతివృత్తుల పనివారు.

**స్వయం ఉపాధి పనివారు**

వీధి వ్యాపారస్తులు, తోపుడుబండి వ్యాపారస్తులు, ఇంటి వద్ద వస్తువుల తయారీ, చిరు వ్యాపారస్తులు, అన్నిరకాల చిన్న మెకానిక్‌లు, టైలర్లు, కల్లుగీత, పారిశుధ్య, రిక్షా కార్మికులు, వస్తువుల రవాణా కార్మికులు, గిరిజన కార్మికులు(అడవుల్లో పనిచేసేవారు), బిడి, చుట్టల కార్మికులు, చెత్తవేరేవారు, ఇతర స్వయం ఉపాధి.

**సేవారంగం పనివారు**

ఇండ్లలో పనిచేసేవారు, ఆఫీసులు దుకాణాల్లో పనిచేసే స్వీపర్లు, ఇంటివద్ద వృద్ధులకు, రోగులకు సేవలు అందించేవారు, కొరియర్ బాయ్స్, కమిషన్ మీద వస్తువులు సరఫరాచేసేవారు, సేవారంగంలో ఇతర కార్మికులు.

**ప్రభుత్వ పథకాల అమలు పనివారు**

అంగన్‌వాడీ సిబ్బంది, విద్యా వాలంటీర్లు, ఆశావర్కర్లు, ఆరోగ్యమిత్ర, బీమా మొదలగువారు, 104, 108 వైద్యసేవల్లో పనివారు, సిర్ప్, మెప్మా, ఇతర ప్రభుత్వ పథకాల సిబ్బంది. బిల్లింగ్, డేటా ఎంట్రీ సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బంది.

**హమాలీలు(లోడింగ్ అన్‌లోడింగ్)**

మార్కెట్‌యార్డు, బజార్లు, గోదాములు, ఫ్యాక్టరీల్లో హమాలీలు, పోర్టులు, ఓడరేవుల్లో హమాలీలు, రైల్వేస్టేషన్. పార్సిల్ కార్యాలయాలు, బస్టాండు హమాలీలు, రాష్ట్ర కేంద్ర గిడ్డంగులు, రాష్ట్ర కార్పోరేషన్ హమాలీలు, ఇతర ప్రదేశాల్లో లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికులు.

**రవాణా రంగం**

ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు, రిక్షా డ్రైవర్లు, రవాణా రంగంలో పనిచేసే ఇతర కార్మికులు.

**దుకాణాలు, సంస్థల్లో పనిచేసేవారు**

దుకాణాలు, హోటళ్లు, సినిమా హాలులు, ప్రైవేటు పాఠశాలలు, హాస్టళ్లలో బోధన మరియు ఇతర సిబ్బంది. ప్రైవేటు ఆసుపత్రుల్లో పనివారు.

**ప్రత్యేక ఉపాధుల్లో పనివారు**

అవుట్ సోర్స్, కాంట్రాక్టు పని, పత్రికా విలేకరులు(వర్కింగ్ జర్నలిస్ట్ చట్టం క్రింద రానివారు), టివి, మీడియాలో పనిచేసే రిపోర్టర్లు, కెమెరా మెన్ మొదలగువారు.

# అంతర్జాతీయ కూచిపూడి నృత్యోత్సవం



**23 నుంచి 25 వరకు అమరావతిలో**

**రాజధాని ప్రతినిధి, విజయవాడ :** అమరావతి రాజధానిలో నిర్వహించ తలపెట్టిన అంతర్జాతీయ కూచిపూడి డాన్స్ కన్వేషన్, అంతర్జాతీయ మ్యూజిక్ ఫెస్టివల్, జాతీయ మహిళా పార్లమెంటరీ సదస్సులకు వచ్చే అతిధులకు భోజన ఏర్పాట్లు ఘనంగాచేయాలని జిల్లా కలెక్టర్ బాబు ఎ హోటల్, క్యాటరింగ్ ప్రతినిధులకు సూచించారు. డిసెంబర్ 23,24,25 తేదీలలో అంతర్జాతీయ కూచిపూడి డాన్స్ కన్వేషన్, జనవరి 12,13,14 తేదీలలో అంతర్జాతీయ మ్యూజిక్ ఫెస్టివల్, ఫిబ్రవరి9,10,11 తేదీలలో జాతీయ మహిళా పార్లమెంటరీ సదస్సులకు సన్నాహాలు చేసున్నామన్నారు. ఈ కార్యక్రమాలకు దేశ, విదేశాల నుండి అత్యంత ప్రముఖ వ్యక్తులతో పాటు సినీ,కళలు,సంస్కృతిక సంబంధించిన ప్రముఖులు రానున్నారు. నగరానికి వచ్చే అతిధులకు వసతులతో పాటు భోజన సదుపాయాలు కల్పించవలసి ఉందన్నారు. కృష్ణా పుష్కరాలలో చేసిన వసతి, భోజన ఏర్పాట్ల వల్ల నగరానికి మంచి ఖ్యాతి వచ్చిందని, అదే స్ఫూర్తితో జరగబోయే కార్యక్రమాలను మరింత బాధ్యతాయుతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆయా సంస్థల ప్రతినిధులకు సూచించారు.

**7 వేల మందితో కూచిపూడి నృత్యం**

అంతర్జాతీయ కూచిపూడి డాన్స్ ఫెస్టివల్‌ను గిన్నిస్‌బుక్‌లో చోటు కల్పించే విధంగా నిర్వహకులు పనిచేస్తున్నారని చెప్పారు. భారతదేశానికే తలమానికమైనకూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించనున్నారు. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ, సిలికాన్ ఆంధ్ర సంయుక్తంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. 7000 మంది కూచిపూడి నృత్య కళాకారుణియులతో డిసెంబర్ 25 వ తేదీన ఆదివారం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్నారు.

**ఫిబ్రవరి 9,-11 వరకు జాతీయ మహిళా పార్లమెంటెరియన్‌ల సదస్సు**

మహిళా పార్లమెంటెరి యన్‌ల సదస్సును రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర శాసనసభాపతి ప్రారంభించ నున్నారు. ఈ సందర్భంగా నగరానికి వచ్చే ప్రముఖులకు, అతిధులకు కావాల్సిన ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని కలెక్టర్ ఆదేశిం చారు. ఇబ్రహీంపట్నం పవిత్రసంగమం వద్ద నిర్వహించే ఈ సదస్సుకు 10000 మంది వివిధ స్థాయి మహిళా ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఈ నెల 9 వ తేదీన శాసనసభాపతి కోడెల శివప్రసాద్ నేతృత్వంలో ఏర్పాట్లపై సమావేశం జరగనునందున కావాల్సిన ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. అదే విధంగా జనవరి 12,13,14 తేదీలలో ఎయిర్‌షో ఉంటుందన్నారు. పున్నమి, భవానీద్వీపం లో ఈ షో జరుగుతుం దన్నారు. 4 నుంచి 5 వరకు ఎయిర్‌క్రాఫ్ట్‌లు ఈ ప్రదర్శనలో పాల్గొంటాయన్నారు. ఎయిర్‌షోను తిలకించడానికి పెద్ద ఎత్తున ప్రజలు వస్తారని, దీనికి సంబంధించిన ఏర్పాట్లు ముందస్తుగానే చేపట్టాలన్నారు. జనవరి 12 వ తేదిన గన్నవరం విమానాశ్రయం వద్ద నూతనంగా నిర్మించిన కొత్త టెర్మనల్‌ను ప్రారంభమవుతుందన్నారు. జనవరి 8 వ తేదిన అమరావతి మారథాన్ నిర్వహిస్తున్నామని కలెక్టర్ అధికారులకు ప్రతినిధులకు కలెక్టర్ తెలిపారు.

## అంబేద్కర్ జాతీయ పురస్కార గ్రహీత యర్రా



**రాజధాని ప్రతినిధి,కోనసీమ న్యూస్-జిఎన్.రావ్ :** తూర్పుగోదావరి జిల్లా కోనసీమ ప్రాంతం అంబాజీపేట మండలం కె.పెదపూడి గ్రామానికి చెందిన యర్రా నాగబాబుకు అంబేద్కర్ జాతీయ పురస్కార అవార్డు లభించింది. బిఆర్.అంబేద్కర్ 125వ జయంతి సందర్భంగా విశ్వజన కళామండలి ఆధ్వర్యంలో అంబేద్కర్ జాతీయ పురస్కారాన్ని శ్రీయర్రా బలరామ్మూర్తి కోనసీమ ఐ బ్యాంకు కన్వీనర్ యర్రా నాగబాబు అందుకున్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన్ భవన్‌లో జరిగిన సభలో జాతీయ విశ్వజన కళామండలి అధ్యక్షుడు మాస్టర్జి సమక్షంలో రాష్ట్ర అధ్యక్షుడు వి.నాగేశ్వరరావు నుండి ఈ పురస్కారాన్ని నాగబాబు అందుకున్నారు. ఐ బ్యాంకు ద్వారా అంధుల జీవితాల్లో వెలుగులు నింపడంతో, సామాజిక సేవలు అందిస్తున్న నాగబాబుకు ఈ పురస్కారం లభించింది. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

# వచ్చే ఏడాది మారిషస్‌లో ప్రపంచ తెలుగు మహాసభలు


**50 దేశాల నుంచి ప్రతినిధులు హాజరు**

**హైదరాబాద్ :** ప్రపంచ 5వ తెలుగు మహాసభలను మారిషస్‌లో నిర్వహించనున్నట్లు మారిషస్ తెలుగు కల్చరల్ ట్రస్ట్ తెలిపింది. ట్రస్ట్ చైర్మన్ రాజీవ్ రాజాగైరిస్సు పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతిని కలిసి మహాసభల జయప్రదానికి సహకరించాలని కోరారు. మారిషస్ ప్రభుత్వ అనుమతితో పోర్టులూయిస్‌లో ప్రపంచ 5వ తెలుగు మహాసభలను నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. మహానభల జయప్రదానికి రెండు తెలుగు రాష్ట్రాలలహాయ సమకారాలను కోరడం కోసం వచ్చినట్టు తెలిపారు. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులను మహాసభలకు ఆహ్వానించనున్నట్టు స్పష్టం చేశారు. మహాసభల సందర్భంగా 108 అడుగుల వెంకటేశ వరస్వామి విగ్రహాన్ని ప్రతిష్టించనున్నట్టు తెలిపారు. దేశంలో ఉన్న వందకుపైగా హిందూ దేవాలయాల ద్వారా ప్రతి రోజు ఒక నూతన తెలుగు పదాన్ని భక్తులకు నేర్పించే ప్రయత్నిం చేస్తున్నట్టు తెలిపారు. దీంతోపాటుగా మారిషస్ ప్రభుత్వ బ్రాడ్‌కాస్టింగ్ ద్వారా ఒక కొత్త తెలుగుపదాన్ని శ్రోతలకు చేరవేస్తున్నట్టు చెప్పారు. 2017 డిసెంబర్‌లో జిగే ప్రపంచ 5వ మహాసభలకు నిర్వహణలో తెలుగు యూనివర్సిటీ పూర్తి సహాయ సహకారాలను అందిస్తుందని వీసీ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ స్పష్టం చేశారు. మారిషస్ తెలుగు కల్చరల్ ట్రస్ట్ సభ్యులను వీసీ ఘనంగా సన్మానించారు. ట్రస్ట్ బోర్డు సభ్యులు కృష్ణారామస్వామి, రవి వెంకట స్వామి, అంతర్జాతీయ తెలుగు కేంద్రం సంచాలకులు ఆచార్య మునిరత్నం నాయుడు, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య సత్తిరెడ్డి పాల్గొన్నారు.

## బ్యాంకు అధికారి, ఇద్దరు వ్యాపారుల అరెస్టు

**న్యూఢిల్లీ :** భారత రిజర్వ్ బ్యాంకు ఆదేశాలను పట్టించుకోకుండా రద్దు అయిన పెద్దనోట్లను మోసపూరితంగా మార్చేందుకు ప్రయత్నించిన సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీనియర్ మేనేజర్, బెంగళూరు కంపెనీకి చెందిన ఇద్దరు యజమానులను సీబీఐ అరెస్టు చేసింది. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బసవనగుడి బ్రాంచ్ హెడ్, సీనియర్ మేనేజర్ ఎస్.లక్ష్మీనారాయణ, ఓంకార్ పరిమల్ మందిర్ డైరెక్టర్లు ఎస్.గోపాల్, అశ్విన్ జి. సుంకుర్‌లపై ఎఫ్ఐఆర్ దాఖలు చేసినట్టు దర్యాప్తు సంస్థ వెల్లడించింది. వివిధ ప్రాంతాల్లో సోదాలు నిర్వహించినట్టు పేర్కొంది. ముగ్గురు నిందితుల్ని బెంగుళూరులోని సీబీఐ కార్యాలయంలో ప్రశించారు. వారు సరైన సమాధానాలు ఇవ్వలేదని, దీంతో వారిని నిర్బంధించామని తెలిసింది. ఐపీసీ నేరపూరిత కుట్ర, మోసం సెక్షన్ల క్రింద కేసులు పెట్టినట్టు పేర్కొంది. బెంగుళూరులోని బ్యాంకు అధికారులు, ప్రైవేటు వ్యక్తుల ఇళ్లను తనిఖీ చేయగా వివిధ బ్యాంకు వోచర్లు, నకిలీ పత్రాలు, డీడీలు, ఆస్తిపత్రాలు, హార్డ్‌డిస్కులు, పెద్దనోట్లలో రూ.5,91,500 నగదు లభించిందని సీబీఐ తెలిపింది. నవంబరు 15 నుంచి 18వ తేదీలోపు పూణెకు చెందిన ఫైనాన్స్ కంపెనీకి రూ.50 వేలకన్నా తక్కువ మొత్తాలతో కూడిన 149 డీడీలను బ్యాంకు మేనేజరు ఆమోదించారని పేర్కొంది. రూ.71 లక్షల విలువగల డీడీల మంజూరుతో పాటు వాటి మొత్తాలను పెద్దనోట్లలో అంగీకరించారు.

## కోనసీమలో ఘనంగా షష్ఠి మహోత్సవాలు



**రాజధాని ప్రతినిధి,కోనసీమ న్యూస్-జిఎన్.రావ్ :** కోనసీమ ప్రాంతంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి షష్ఠి మహోత్సవాలు పురస్కరించుకుని స్వామివారి కల్యాణోత్సవాలు అంత్యంత ఘనంగా జరిగాయి. కల్యాణోత్సవాలతో పాటు షష్ఠి మరియు తీర్థ మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. అమలాపురం పట్టణం హైస్కూల్ రోడ్‌లో వేంచేసియున్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి కల్యాణ, షష్ఠి, తీర్థం పురస్కరించుకుని 4 నుండి 9వ తేది వరకు కార్యక్రమాలు జరగనున్నాయి. 4న ఉదయం 12.50 గంటలకు స్వామివారి రథోత్సవం, రాత్రి 2.05 గంటలకు శ్రీశ్రీశ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి కల్యాణోత్సవం యేడిద సత్యనారాయణ కళామందిరం సుబ్రహ్మణ్య మైదానం నందు అమలాపురం వాస్తవ్యులు అమ్ము సుబ్బారావు కుమారులు అమ్ము అన్నాజీ సోదరులచే జరిగింది. 5వ తేది పల్లకీ ఊరేగింపు, సాయంత్రం శంకర విద్యానిలయం విద్యార్థులచే భక్తి సంగీత పాటల కచేరి జరిగింది. ఎన్‌టిఆర్ మార్గ్‌లోని తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం, రూరల్ మండలం బండారులంకలోని సుబ్రహ్మణ్యస్వామివారి పుట్ట వద్ద, ఏ.వేమవరం గుమ్మడి సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయంలో కూడా అధిఖ సంఖ్యలో భక్తులు పోటెత్తారు. అలాగే ముమ్మిడివరంలో షష్ఠి వేడుకలు గేదెలలంక, క్రాపచింతలపూడి, సిహెచ్.గున్నేపల్లితో పాటు పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఐ.పోలవరం గుత్తెనదీవి-వేమరంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి భక్తులు అధిఖ సంఖ్యలో దర్శించుకున్నారు.

## టైమ్ ఈ ఏటి వ్యక్తి ... ట్రంప్

**తుది 11 మంది జాబితాలో మోదీకి చోటు**

**న్యూయార్క్ :** టైమ్ మేగజైన్ ఈ ఏటి (2016) వ్యక్తిగా అమెరికా అధ్యక్షపదవికి ఎన్నికైన డోనాల్ ట్రంప్ ఎంపికయ్యారు. ' మంచికో.. చెడుకో ...అధక్ష ఎన్నికల్లో విస్తుగొలిపే విజయం సాధించినందుకుగాను ఆయన్ను 'పర్సన్ ఆఫ్ ద ఇయర్' గా ఎంపిక చేసినట్టు టైమ్‌మేగజైన్ సంపాదకవర్గం పేర్కొంది. న్యూయార్క్‌లోని ట్రంప్ టవర్స్‌లో 66వ అంతస్తులోని పెంట్‌హౌస్‌లో తీసిన ఫోటోను టైమ్ మేగజైన్ ముఖచిత్రంగా ప్రచురించి... "డోనాల్డ్ ట్రంప్" ట్రంప్ ... ప్రెసిడెంట్ ఆఫ్ ద డివైడెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరిక' గా ఆయన్ను అభివర్ణించింది. కాగా... ట్రంప్ దీనిపై స్పందిస్తూ ఇది తనకు లభించిన గొప్ప గౌరవంగా పేర్కొన్నారు. తాను చిన్నప్పటి నుంచి ... గతంలో సైతం తన చిత్రం టైమ్ మేగజైన్ కవర్‌పై రావడం అదృష్టమని వ్యాఖ్యానించారు. ఇక, టైమ్ జాబితాలో ట్రంప్ తర్వాత నిలిచిన వ్యక్తి హిల్లరీ క్లింటన్. టైమ్ ఎడిటర్స్ రూపొందించిన తుది జాబితాలో భారత ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఉన్నారు. ఆన్‌లైన్ రీడర్స్ పోల్‌లో మోదీయే అగ్రస్థానంలో నిలిచిన సంగతి తెలిసిందే. 2014లో కూడా ఆన్‌లైన్ రీడర్స్ పోల్‌లో మోదీయే అగ్ర స్థానంలో నిలవడం గమనార్హం.

### ఇల్లు తగలబడుతుంటే.. నుయ్యి తవ్వుతున్న వైనం

# ఈ వెతలు తీరేదెన్నడు ?

నోట్లరద్దుతో నల్లడబ్బు బయటకు రావడం మాట ఎలా ఉన్నా..... వచ్చిన కొత్త డబ్బంతా దొంగదారిని నల్లకుబేరుల ఇళ్లకు తరలి పోవడంతో నానాటికీ క్యూలు పెరుగుతున్నాయే తప్ప తరగటం లేదు. నెల రోజుల నుంచి ఇదే తంతు.. పసిపిల్లలను తీసుకొని బాలింతలు క్యూల్లో నిలబడటం అన్ని చోట్ల కనిపిస్తూనే ఉంది. డిసెంబరు రెండో వారం సమీపిస్తున్నా ఇంకా వృద్ధులు, దివ్యాంగులు, ప్రభుత్వ కుటుంబ పింఛనుదార్లు ఇంకా క్యూల్లో నిలబడే ఉన్నారు. ఎంతో అవసరం వచ్చి, గంటలు తరబడి క్యూల్లో నుంచొని వారి డబ్బును వారే తీసుకెళదామనుకుంటే కేవలం నిరాశే మిగులుతుంది. బ్యాంకు సిబ్బంది క్యాష్ లేదని చెప్పేస్తున్నారు. ఒక్కోచోట డబ్బులు లేనప్పుడు బ్యాంకులెందుకంటూ ప్రజలు సిబ్బందిపై ఎదురుతిరుగుతున్నారు. నోట్ల రద్దుకు ముందే ప్రభుత్వం వాటి స్థానే కొత్త నోట్లు ఎందుకు ప్రవేశపెట్టలేదు... వారి బాధ్యతారాహిత్యానికి ప్రజలు బలవుతున్నారు. బ్యాంకుల ముందు క్యూలు చూసి ప్రతిపక్షాలు ఉభయ సభలను స్థంభింపచేయడంతో ప్రభుత్వం అప్పటికప్పుడు కొత్తనోట్లను ముద్రించడానికి నిర్ణయం తీసుకుంది . ఇప్పటికే రూ. 20,50 కొత్తనోట్లు వస్తాయని, అయినప్పటికీ పాతవి కూడా వాడుకోవచ్చని తెలిపింది. మరో ముఖ్య విషయం ఏమంటే రూ.100 నోట్లు కూడా వస్తున్నాయి. ఏతావాతా ఇవన్నీ వచ్చేటప్పటికి కొత్త ఏడాది వస్తుందని రిజర్వు బ్యాంకు తెలిపింది. ఇప్పటికే అక్కడి ఉద్యోగులు మూడు షిఫ్టులు పనిచేస్తున్నారని ఆ సంస్థ తెలిపింది. రూ. 500, 1000 నోట్లు స్థానే రూ. 2000 ప్రవేశపెట్టడంతో చిల్లర సమస్య మరింత తీవ్రమైంది.



ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లోనే రెండువేలకు చిల్లదొరకటం కష్టమైతే 1978లో అంటే అప్పటి రూపాయికి విలువ ఎంత ఉండేది, దాదాపు 38 ఏళ్ల క్రితం 10 వేలు, ఐదు, రెండు వేల నోట్లు ఎవరి దగ్గర ఉండేవి ? అప్పటి రూపాయికే ఎంతో విలువ ఉండేది... అప్పటి 10 వేలు ఎంతమంది వద్ద ఉండేది ? వాటిని రద్దు చేయడం వల్ల ఎంతమంది ఇబ్బందులు పాలయ్యారు ? ఇప్పటి రూపాయి విలువ ఎంత ? సామాన్యజనంలోని 76 శాతం ఉన్న ఐదువందలు, వెయ్యినోట్లు రద్దుచేస్తే ఎంత డిమాండు ఉంటుందన్న కనీస అవగాహనలేకుండా చేసిన ప్రభుత్వం ఎందుకు రద్దుకు తెగించింది ? క్యూల్లో నిలబడి కాళ్లులాగి, శోషవచ్చి పడిపోతున్నవాళ్లకు తెలుస్తుంది బాధంటే ఎంటో ? నాయకులు కబుర్లు చెప్పడానికి దీనికి ఉన్న తేడా అదే...ఇప్పటికిప్పుడు నగదురహిత సమాజం ...లావాదేవీలు అంటే ఎవరు ముందుకొస్తారు ? వాటిపై ఉన్న పరిజ్ఞానం ఎంత ? మొన్న ఉద్యోగులకు నగదు రహిత లావాదేవీలపై అవగాహనా సదస్సు నిర్వహిస్తే.. వారే ఎంతో భయపడుతున్నారు. అలాంటిది గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలు, నిరక్షరాస్యులు నగదురహిత లావాదేవీలను ఎంతవరకు సమర్థిస్తారు ? ఎంతవరకు వినియోగిస్తారు ? తుగ్లక్‌ను మించి చేస్తున్నారు మన పాలకులు ...దానికి సమిధలయ్యేది మాత్రం ప్రజలే...

అభివృద్ధి చెందిన దేశంమైన అమెరికాలోనే పెద్దనోటు 100డాలర్లు మాత్రమే ...అలాంటిది మనదేశంలో అంతకన్నా పెద్ద నోట్లు ఎందుకు నల్లకుబేరులకు తప్ప... గనుల దిగ్గజం గాలిజనార్ధన రెడ్డి కుమార్తె, గుంటూరు ఎమ్మెల్యే కూతురు , కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ కుమార్తె, కేంద్రమంత్రి గడ్కరీ కుమార్తెల పెళ్లిళ్లు అత్యంత ఆర్భాటంగా జరగటానికి కొత్త నగదు ఎలా వచ్చింది ?సామాన్యుల తాము దాచుకున్న సొమ్మే తమకు అందక పెళ్లిళ్లు ఎలా చేయాలని తల్లడిల్లుతున్నారు. పత్రికలు మాత్రం ఈ విషయాన్ని ప్రస్తావించకుండా, రూ. 500తో ఎలా పెళ్లి చేసుకున్నారో ప్రముఖంగా ప్రచురిస్తున్నాయి.

#### విదేశాల స్పందన

నోట్లరద్దుపై చైనా స్పందిస్తూ దీన్ని మేము ఒక గుణపాఠంగా తీసుకుంటామంటే, రష్యాఎంబసీ మాత్రం దీనిపై నిరసన వ్యక్తం చేయడం ఖాయమని, వారానికి రూ. 50 వేలు ఇవ్వడంతో తాము ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. అమెరికా లాంటి అగ్రదేశాల్లో100 డాలర్లు పెద్దనోటుగా ఉంటేభారత్‌లాంటి అభివృద్ధి చెందుతున్న దేశానికి రూ.2000 ఎందుకని ప్రశ్నిస్తున్నాయి. ఇన్ని ప్రతికూలతల మధ్య మోదీ అంతర్జాతీయ సర్వేలో ప్రధమ స్థానం రావడం సర్వే నిబద్ధతను ప్రశ్నించే విధంగా ఉంది.

### మాటలు ఇవి..వాస్తవాలు ఇవి

**బ్యాంకుల్లో చాలినంత నగదు. వారానికి 24 వేలు తీసుకోవచ్చు. లేదా ఒక్కసారిగా కూడా.**

బ్యాంకు బ్రాంచీల సైజును బట్టి, పది లక్షల నుంచి ముప్పై లక్షలు మాత్రం రోజుకు అందుతున్నాయి. మనిషికి ఆరు నుంచి పదివేలు మాత్రమే ఒక రోజుకు ఇస్తున్నారు. అంటే బ్రాంచికి రోజుకు వంద మంది నుంచి అయిదు వందల మందికి మాత్రమే అందుతాయి.

**ఎటీఎమ్ ల్లో చాలినన్ని డబ్బులు వున్నాయి**

ఎప్పుడు డబ్బులు పెడతారో తెలియదు. పెట్టిన గంట, రెండు గంటల్లోనే అయిపోతాయి. అది కూడా మనిషికి వెయ్యి రూపాయలు మాత్రమే.

స్వయిపింగ్ మెషిన్లు ఎక్కడిక్కడ ఏర్పాటు చేస్తున్నాం అత్యవసర సమయాల్లో స్వయిపింగ్ మెషీన్లు మొరాయిస్తున్నాయి. కార్డులు గీకి.. గీకి వ్యాపారులు విసిగిపోతున్నారన్నది వాస్తవం.

**ఆన్ లైన్ చెల్లింపులు ఎంకరేజ్ చేస్తున్నాం అందరూ ఆన్ లైన్ లో పేమెంట్లు చేయడం అలవాటు చేసుకోవాలి.**

ఒక్కసారి ఆంధ్రలోని ఆర్టీవో ఆఫీసుల్లో ఆన్ లైన్ చలాన్‌ల వ్యవహారం ఎలా వుందో చూడండి. గంటకు ఓ చలాన్ కట్టడం కష్టమవుతోంది. సర్వర్ల స్పీడ్ అలా వుంది. కేవలం రోజు సమీక్ష సమావేశాలు జరపడం, ఆ స్టేట్ మెంట్లు మర్నాడు పత్రికల్లో తాటికాయంత అక్షరాల్లో రావడం. అంతే తప్ప ప్రజల కష్టాలు అంగుళం మారలేదు.

**ఎలక్షన్లు ప్రకటించండి తెలుస్తుంది**

మోడీ : ఇంట్లో పెళ్లిళ్లుఉన్నా... ఆరోగ్య సమస్యలు ఉన్నా ప్రజలు నోట్ల రద్దుకు సహకరించారు. వారికి నా కృతజ్ఞతలు...

సామాన్యులు : రేపు ఎన్నికల ప్రకటన చేయండి... ప్రజలు సహకరించారో... అసహ్యించుకుంటున్నారో తెలుస్తుంది....

### నల్లడబ్బును అరికడుతున్నారా ? ఆదరిస్తున్నారా ?

కర్ణాటకలో బీజేపీ నేత ఒకడి దగ్గర పది లక్షల రూపాయల విలువజేసే కొత్త నోట్ల పట్టివేత, తమిళనాడు మరో బీజేపీ లీడర్ వద్ద ఇంకో కొత్త నోట్ల డంప్..బీజేపీ నేత వద్ద ఇరవై లక్షల రూపాయల విలువ చేసే కొత్త కరెన్సీ..పశ్చిమబెంగాల్ బీజేపీ లీడర్ మనీష్ శర్మ వద్ద ఇంకో పదిలక్షలు, చెన్నైలో దొరికిన నల్ల కుబేరుడి వద్ద ఏకంగా డెబ్బై కోట్ల రూపాయల కొత్త నోట్లు.. వీళ్లంతా దొరికిన దొంగలు! దొరకని దొంగల మాటేంటి? డెబ్బై కోట్ల? ఇలాంటి వారు ఎంత మంది? వాళ్ల దగ్గరకు చేరింది ఎన్ని వేల, లక్షల కోట్లు? సామాన్యుడు ఒక్క రెండు వేల రూపాయల నోటును సంపాదించుకోవడానికి అష్టకష్టాలూ పడుతుంటూ, అన్ని పనులూ మానుకుని క్యూ లైన్లలో వేచి ఉండాల్సిన పరిస్థితుల్లో ఏకంగా.. డెబ్బై కోట్ల రూపాయల విలువైన కొత్త నోట్లు ఒక్కడి వద్దకు చేరాయంటే, నల్లకుబేరులను అరికడుతున్నట్లా ? ఆదరిస్తున్నట్లా ?

నాలుగు లక్షల కోట్ల కొత్త నోట్లు పంపించేశాం.. అని ఆర్బీఐ గవర్నర్ చెప్పాడు, ఆ డబ్బులో ఇలాంటి నల్ల దొంగల వద్దకు చేరినది ఎంత? లోపం ఎక్కడ? నోట్ల రద్దు చేసి.. సామాన్యులను అష్టకష్టాలు పెడుతూ, ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసి.. అంతిమంగా ఏం సాధిస్తున్నట్టు? కమిషన్ వ్యాపారాలను, నోట్ల మార్పిడి చేసే మాఫియాలకు కొత్త ఉపాధి చూపడానికే ఈ పని పెట్టుకున్నారా? సామాన్యుడికి వ్యవస్థపై పూర్తిగా నమ్మకాన్ని పోగొడుతున్నారు. రెండు వేల నోటు కోసం.. ఐడీ కార్డు చూపాలి, పాన్ కార్డు చూపాలి.. చేతి వేలికి ఇంకు పెట్టించుకోవాలి. చేరే వాడి వద్దకుమాత్రం వందల కోట్లు చేరుతున్నాయి! ఇదీ మోడీ మాస్టర్ మైండ్ దెబ్బకు సామాన్యుడి, ధనికుడి మధ్య వ్యత్యాసం ..

#### 4 లక్షల ఉద్యోగాలు ఊస్టింగ్...

మోడీ ఆకస్మిక నిర్ణయంతో దేశంలో నిరుద్యోగుల సంఖ్య మరో 4 వేలు పెరుగనుంది. ఎందుకంటే డబ్బుకొరత కారణంగా వస్త్ర, తోలు, జ్యువెలరీ షాపుల్లో పనిచేసే 4 లక్షలమంది తమ ఉపాధిని కోల్పోతున్నారు. – ఖాన్

---

## అవినీతిని పెకిలిద్దాం కదలిరండి

**నెల్లూరుజిల్లా కలెక్టర్, ఎస్పీ పిలుపు**




**రాజధాని ప్రతినిధి, వెలిశెట్టి కేశవరావు - నెల్లూరు :** అవినీతిని పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు ప్రతీ ఒక్కరూ బాధ్యతగా తమ వంతు క అషి చేయాలని నెల్లూరుజిల్లా కలెక్టర్ ముత్యాలరాజు, ఎస్పీ విశాల్ గున్నీ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ అవినీతి నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకొని నెల్లూరు నగరంలో వారు ర్యాలీ చేపట్టారు. ఏసిబి డిఎస్పీ తోట ప్రభాకర్ ఆధ్వర్యంలో వి.ఆర్.సి. సెంటర్ నుండి ఏర్పాటు చేసిన ఈ ర్యాలీని జిల్లా కలెక్టర్ ముత్యాల రాజు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో కలెక్టర్ తో పాటూ ఎస్పీ విశాల్ గున్నీ, జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్, నగర డిఎస్పీ వెంకటరాముడు, పలువురు అధికారులు, వివిధ శాఖల ఉద్యోగులు, పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వి.ఆర్.సి. సెంటర్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ దర్గామిట్టలోని పోలీసు కవాతు మైదానం వరకూ సాగింది. అనంతరం అక్కడ కలెక్టర్, ఎస్పీ మాట్లాడారు. అవినీతి అనే ఛీడ పురుగును తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఎక్కడ, ఏ స్థాయిలో అవినీతి జరుగుతున్నా బాధ్యతల గల పౌరులు ఏసిబికి సమాచారం ఇవ్వాలని సూచించారు. అవినీతిని సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.అవినీతి రహిత పరిపాలన సాగినప్పుడే అభివృద్ధి ఫలాలు సామాన్యులకు అందుతాయని వారు వెల్లడించారు.

## నెల్లూరు జిల్లా వ్యాప్తంగా రూ.2380 కోట్ల రూపాయలు డిపాజిట్



**రాజధాని ప్రతినిధి, వెలిశెట్టి కేశవరావు - నెల్లూరు :** పెద్ద నోట్ల రద్దు తర్వాత నెల్లూరు జిల్లా వ్యాప్తంగా రూ.2380 కోట్ల రూపాయలు డిపాజిట్ అయినట్లు లీడ్ బ్యాంక్ మేనేజర్ తెలిపారు. వివిధ శాఖాధికారులతో మంత్రి శిద్దా సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. రిజర్వ్ బ్యాంకు నుంచి జిల్లాకు కేవలం రూ.930 కోట్లు మాత్రమే వచ్చాయి. దీంతో బ్యాంకు అధికారులపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంకుల వద్ద సామాన్యులు ఇబ్బందులు ఎదుర్కొకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగదురహిత లావాదేవీలపై ప్రజలకు అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. ఇప్పటికే జేసీ అవగాహనా కార్యక్రమాలు చేపట్టారని కలెక్టర్ మంత్రికి తెలిపారు.

## కార్యకర్తను పరామర్శించిన ఉండి ఎమ్మెల్యే శివ.

**తాళం హనుమంతరావు, ఉండి(రా.వా) :** కలిగొట్ల గ్రామంలో తెలుగుదేశం సీనియర్ కార్యకర్త సాగిరాజు వెంకటరాజు భార్య అచ్చెమ్మ మరణించడంతో ఉండి ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు ఈకుటుంబాన్ని పరామర్శించారు. ఆమె కుమారుడు విజయ రామకృష్ణరాజును ఎమ్మెల్యే ఓదార్చారు. పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తు చేసారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు జుత్తిగ శ్రీనివాస్, ఉండి ఏఎంసి చైర్మన్ కొత్తపల్లి గోపాలకృష్ణరాజు, జడ్పిటిసి కరిమెరక తులసి, గ్రామ పార్టీ అధ్యక్షులు ముదునూరి రూప్ కుమార్ వర్మ, జిల్లా నాయకులు యశోదకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్పలకు ప్రత్యేక రైళ్లు

**రాజధాని ప్రతినిధి-విజయవాడ (గాంధీనగర్) :** అయ్యప్ప భక్తుల సౌకర్యార్థ దక్షిణ మధ్య రైల్వేలో ఉన్న 11రైల్వేస్టేషన్ల నుండి 80 ప్రత్యేక రైలును నడుపుతున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైళ్ళు ఈ నెల నుండి జనవరి 16వ తేదీ వరకు నడుపుతున్నట్లు తెలిపారు.

**కాకినాడ టౌన్-కొల్లాం**
**(18 రైళ్లు, వయా గుంటూరు)**

రైలు నెంబర్ 07211గా డిసెంబర్ 12,15,18,22, జనవరి 2,5,8,12,15 తేదీల్లో కాకినాడ టౌన్‌లో రాత్రి 11.50 గంటలకు బయలుదేరి తెల్లవారుజామున 04.00 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. తిరిగి 04.15కు బయలుదేరి గుంటూరు.తిరుపతి మీదగా రెండూ రోజు ఉదయం 06.30 గంటలకు కొల్లాం చేరుకుంటుంది.తిరుగు ప్రయాణంలో 07212 గా డిసెంబరు 14,17,20,24 జనవరి 04,07,10,14,17 తేదీల్లో కొల్లాంలో ఉదయం 09.30కు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9,35కు విజయవాడకు చేరుకుంటుంది. తిరిగి 9.50కు బయలుదేరి మధ్యాహ్నం 01.30కు కాకినాడ టౌన్ చేరుకుంటుంది.

**విజయవాడ- కొల్లాం-విజయవాడ**
**(03 రైళ్లు,వయా గుంటూరు)**

రైలు నెంబరు 07213గా జనవరి07,10 తేదీలల్లో విజయవాడలో తెల్లవారుజామున 03.15 గంటలకు బయలుదేరి గుంటూరు,తిరుపతి మీదగా రెండవ రోజు ఉదయం 06.30 గంటలకు కొల్లాం చేరుకుంటుంది.తిరుగు ప్రయాణంలో 07214గా జనవరి 08వ తేదిన కొల్లాంలో ఉదయం 09.30కు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11.05కు విజయవాడకు చేరుకుంటుంది.

**విజయవాడ-కొల్లాం-విజయవాడ**
**(06 రైళ్ళు తెనాలి మీదగా)**

రైలు నెంబర్ 07219గా డిసెంబర్ 08,17,24 తేదీలల్లో విజయవాడలో తెల్లవారుజామున 04.00 గంటలకు బయలుదేరి తెనాలి,తిరుపతి మీదగా రెండువ రోజు ఉదయం 06.30 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 07220 గా డిసెంబర్ 15,22,25 తేదీల్లో కొల్లాంలో ఉదయం 09.30కు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 09.30కు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 09.35కు విజయవాడకు చేరుకుంటుంది.

**మచిలీపట్నం-కొల్లార్**
**(09 రైళ్లు,వయా గుంటూరు)**

రైలు నెంబర్ 07211గా డిసెంబర్ 10,13,20 జనవరి 09,12,18 తేదీలల్లో మచిలీపట్నర్‌లో రాత్రి 11.40 గంటలకు బయలుదేరి అర్ధరాత్రి 02.00 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. తిరిగి 02.10కు బయలుదేరి గుంటూరు, తిరుపతి మీదుగా మరాద్రు ఉదయం 06.30కు కొల్లాం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 07222గా డిసెంబర్ 09,12,18 జనవరి 11,15 తేదీల్లో కొల్లాంలో ఉదయం 09.30కు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.15 కు విజయవాడకు చేరుకుంటుంది. తిరిగి 10.25 కు బయలుదేరి మధ్యహ్నం 12.30కు మచిలీపట్నం చేరుకుంటుంది.

**మచిలీపట్నం-కొల్లాం-విజయవాడ**
**(02 రైళ్లు వయి గుంటూరు)**

రైలు నెంబర్ 07215గా జనవరి 03వ తేదీన మచిలీపట్నంలో రాత్రి 10.30 గంటలకు బయలుదేరి అర్ధరాత్రి 01.50 విజయవాడకు చేరుకుంటుంది. తిరిగి 02.00 గంటలకు బయలుదేరి గుంటూరు, తిరుపతి మీదగా రెండువ రోజు తెల్లవారుజామున 03.45 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. విజయవాడ నుండి కొల్లాంకు రైలు నెంబర్ 07219గా డిసెంబరు 7,11 తేదీల్లో బయలుదేరుతుంది. తిరుగు ప్రయాణంలో రైలు నెంబరు07220గా డిసెంబర్ 9.16,30వ తేదీల్లో కొల్లాం నుండి విజయవాడకు వస్తుంది.విజయవాడ నుండి కొల్లాంకు రైలు నెంబర్ 07213గా జనవరి 3వ తేదీన బయలుదేరుతుంది. తిరుగు ప్రయాణంలో రైలు నెంబర్ 07214గా జనవరి 8,14వ తేదీల్లో కొల్లాం నుండి విజయవాడకు వస్తుంది. మచిలీపట్నం నుండి కొల్లాంకు రైలు నెంబర్ 07215/07236గా డిసెంబర్ 28, జనవరి 6,12వ తేదీల్లో బయలుదేరుతుంది. తిరుగు ప్రయాణంలో రైలు నెంబర్ 07216గా జనవరి 5వ తేదీన కొల్లాం నుండి మచిలీపట్నంకు వస్తుంది. మచిలీపట్నం నుండి కొల్లాంకు రైలు నెంబర్07235గా డిసెంబర్ 21వ తేదీన మచిలీపట్నంలో బయలుదేరుతుంది. రైలు నెంబర్ 07221గా డిసెంబర్ 14వ తేదీన మచిలీపట్నం నుండి కొల్లాంకు బయలుదేరుతుంది. రైలు నెం 07222గా డిసెంబర్ 13వ తేదీన కొల్లాం నుండి విజయవాడకు వస్తుంది. రైలు నెం.07231గా డిసెంబర్ 18, జనవరి 9వ తేదీల్లో మచిలీపట్నంలో బయలుదేరి కొల్లాం వెళ్ళాంది. తిరుగు ప్రయాణంలో 07232గా డిసెంబర్ 19,22, జనవరి 10వ తేదీల్లో కొల్లాం నుండి విజయవాడకు వస్తుంది. రైలు నెం.07211గా కాకినాడ నుండి డిసెంబర్ 12,13,15,18,19,21,22,25,26, జనవరి 1,2,4,5,7,8,10,11,14,15వ తేదీల్లో బయలుదేరి కొల్లాం వెళ్తుంది. తిరుగు ప్రయాణంలో 07212గా కొల్లాంలో డిసెంబర్ 14,15,17,20, 21,23,24,27,28, జనవరి 3,4,6,7,9,10, 12,13,16,17వ తేదీల్లో బయలుదేరి కాకినాడ వెళు ్తంది. రైలు నెం.07217గా నర్సాపూర్‌లో డిసెంబర్ 30,31వ తేదీల్లో బయలుదేరి కొల్లాం వెళ్తుంది తిరుగు ప్రయాణంలో 07218గా జనవరి 1,2వతేదీల్లో కొల్లాంలో బయలుదేరి నర్సాపూర్ వెళ్తుంది.

## ఇస్రో రాకెట్ ప్రయోగం విజయవంతం



**రాజధాని ప్రతినిధి, వెలిశెట్టి కేశవరావు - నెల్లూరు :** భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం ఇస్రో పీఎస్ఎల్వీసిరీస్‌లో 38వ రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. పీఎస్ఎల్వీ సీ-36 ద్వారా 1235 కేజీల బరువైన రిసోర్స్‌శాట్-2ఎ ఉపగ్రహాన్ని నిర్ణీత వ్యవధిలో కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. సోమవారం రాత్రి 10.25 గంటలకు నుంచి నిరంతరాయంగా కొనసాగిన కౌంట్‌డౌన్ పూర్తికాగానే రిసోర్స్‌శాట్-2ఎ అనే ఉపగ్రహాన్ని పీఎస్ఎల్వీ-సీ26 రాకెట్ మోసుకెళ్లింది. బహుళ ప్రయోజనాల రాకెట్‌గా పేరుగాంచిన పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్ పీఎస్ఎల్వీ ద్వారా 36వరుస విజయాలు అందుకున్న ఇస్రో మరో మైలు రాయిని అధిగమించింది. పీఎస్ఎల్వీ సీ-36 రాకెట్ ద్వారా వెళ్లే రిసోర్స్‌శాట్-2ఎ ఉపగ్రహం రైతులకు ఎంతో మేలు చేయనుంది. ఎలాంటి పంటలు వేసుకోవాలి, ఏ మేరకు దిగుబడి వస్తుంది, వ్యవసాయానికి అనుకూల ప్రాంతాలు ఎక్కడ ఉన్నాయో తెలియజేస్తుంది.ఐదేళ్లపాటు ఈ ఉపగ్రహం సేవలందించనుంది. ఇప్పటి వరకు దేశవిదేశాలకు చెందిన 121 ఉపగ్రహాలను ఇస్రో అంతరిక్షంలోకి చేర్చింది. 1994నుంచి 79 విదేశీ ఉపగ్రహాలను వివిధ కక్ష్యల్లో ప్రవేశపెట్టింది. దేశానికి చెందిన 42ఉపగ్రహాలను ఇస్రో విశ్వంలోకి చేర్చి బలమైన సాంకేతిక వ్యవస్థ కలిగిన దేశంగా భారత్‌ను నిలబెట్టింది. తాజా ప్రయోగమైన పీఎస్ఎల్వీ సీ-36 ద్వారా 1235 కేజీల బరువైన రిసోర్స్‌శాట్-2ఎ ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి విజయవంతంగా చేర్చారు. రిసోర్స్‌శాట్-2 కాలపరిమితి ముగియడంతో దాని స్థానంలో ఇస్రో 2ఎ ఉపగ్రహాన్ని చేర్చింది. ఈ ఉపగ్రహంలో ఇస్రో శాస్త్రవేత్తలు మూడు పెలోడ్లను పొందుపర్చారు. 5.8మీటర్ల స్పేషియల్ రెజల్యూషన్ ఉన్న సెలో స్కానర్, మూడు స్పక్ట్రల్ బ్యాండ్లలో ఆపరేటింగ్ కెమెరాను అమర్చారు. 5రోజులు పాటు సందర్శించేలా వీటిని డిజైన్ చేశారు. మరోవైపు సమాచార సేకరణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆధునిక సాంకేతికను ఇస్రో రిసోర్స్ శాట్-2ఎలో పొందుపర్చారు.

## ఉండిలో జాతీయ స్థాయి ఏకపాత్రాభినయ పోటీలు!

**తాళం హనుమంతరావు, ఉండి(రా.వా):** వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రతిభావంతులైన కళాకారులు తమతమ నటనా కైశల్యాలతో ఉండి ప్రాంత ప్రజలను అలరించారు అనే కంటె ఉర్రూత లూగించారనవచ్చు! ఉండిలోని శ్రీవల్లీ దేవసేనా సమేత సుబ్రమణ్య స్వామి ఉత్సవ కమిటీ నిర్వహించిన ఆహ్వాన జాతీయ స్థాయి పోటీలు కళారంగానికే కలికితురాయిగా నిలిచాయి. కళాకారులందరూ తమ పాత్రలో నటించడం కాదు.. జీవించారు. బహుముఖ ప్రజ్ఞా పాఠకాలను ప్రదర్శించారు. ఆహార్యంలో సంభాషణల్లో అందరినీ ఆకట్టుకున్నారు. అంతేకాదు ఎంచుకున్న పాత్రలకు పూర్తి న్యాయం తెచ్చేందుకు కళాకారులు పోటీ పడి నటించారు. పోటీల్లో పాల్గొన్న కళాకారులు అందరూ జనావళికి తెల్సిన కధాంశాలనే ఎంచుకోవడంతో జనంలో రసజ్ఞత ఉట్టిపడింది! ఎవరినీ విజయ వరిస్తుందో అనే ఉత్కంఠత సర్వాత్రా నెలకొంది. ఈప్రాంతమంతటికీ సుపరిచితులైన వారినే న్యాయ నిర్ణేతలుగా కమిటీ నియమించడం అందరి ప్రశంసలను అందుకుంది! న్యాయనిర్ణేతలుగా చుక్కన శ్రీ, జవ్వాధి దాశరధీశ్రీనివాస్, మురళీనాయుడు వ్యవహరించారు. ఉత్సవ కమిటీ సభ్యులు మంతెన సాయి లచ్చిరాజు, పాకలపాటి రామరాజు, ముదునూరి శ్రీనివాసరాజు, ఉద్దరాజు వెంకట సుబ్బరాజు, ఇందుకూరి శ్రీహరిరామరాజు, భధ్రిరాజు, ములగపాటి రామచంద్రరాజు, ముదునూరి నర్శింహమూర్తిరాజు, ఉండి ఏఎంసి చైర్మన్ కట్టా గంగాధరరావు, ఉండి హెచ్‌ఎం ముదునూరి శివరామరాజు, ఎం గోపాలరాజు, తదితరులు చక్కని ఏర్పాట్లు చేసి అందరి ప్రశంసలను అందుకున్నారు. ఈపోటీల్లో ఫస్ట్ ప్రైజ్‌ను దృతరాష్ట్ర పాత్రధారి బి త్రినాధరాజుకు రూ5000లు, రెండవ బహుమతిని అల్లూరి పాత్రధారి ఎం అర్జునరావుకు రూ3000లు, తృతీయ బహుమతి రూ2000లను చిత్రాంగిని పాత్రధారి వాద్రేవు సుందరరావులకు కమిటీ పెద్దలు అందజేసారు. వీరితో బాటు చాణుక్య ధ్యేయం పాత్రధారి వి రాము, దుర్యోధన పాత్రధారి దుర్గాప్రసాదులు ప్రత్యేక బహుమతులను సాధించారు. వీరితో బాటు జి సాంబశివరావు(మయసభ), లలితకుమారి(మండోదరి), ఎస్‌కె అమర్(రావణబ్రహ్మ), గుండా మురళి(శకుని), కోపల్లె శ్రీనివాస్(బృహన్నల) పాత్రల్లో జనాలను అలరించారు.



## ఆత్మస్థైర్యం ఆమె ఆయుధం

# ఎదురీత ఆమె నైజం



తమిళనాడు ప్రజలను శోకసముద్రంలో ముంచి డిసెంబరు 6 రాత్రి 11.30 గంటలకు తిరిగి రానిలోకాలకు చేరుకున్నారు అమ్మగా పిలుచుకునే విజయలలిత. ఆమె తమిళనాట ఒక ప్రభంజనం.ఎన్ని ఆటుపోట్లనయినా అలవోకగా తట్టుకునే ఆమె మనోధైర్యం ముందు ఎంతటి వారైనా తల వంచాల్సిందే... సుదీర్ఘకాలం మధుమేహంతో బాధపడుతున్న ఆమె సెప్టెంబరు 22న చెన్నై అపోలోలో చేరారు. 75 రోజుల పాటు రాష్ట్ర ప్రజలంతా ఆమె ఆరోగ్యం కోసం అహరహం ప్రార్థించారు, పూజలు చేశారు, నమాజులు కూడా చేశారు. అయినా కనికరం లేకుండా దేవుడు తమ ప్రియతమ నాయకురాలిని దూరం చేశారని గుండెలు బాదుకుంటూ ఏడ్చారు.


కుటుంబం లేని వ్యక్తి జీవితం అందునా ఒక మహిళ జీవితం ఎలా ఉంటుందో తెలుసుకోవాలంటే జయ జీవితాన్ని చూడాల్సిందే... అనంత సంపద ఆమె చెంతనే ఉన్నా.. అయినవారెవ్వరూ లేరు... అనుక్షణం ఎవరు వెన్నుపోటు పొడుస్తారో అనే అభద్రతా భావం ఆమెను మానసికంగా వేధించింది. అయినా ఆమె ఎప్పుడూ వెరిసింది లేదు. వడ్డించడంలోనైనా, వెళ్లగొట్టటంలోనైనా ఆమె తన మనస్సాక్షినే అనుసరించారు. దీనిలో భాగంగానే మనసెరిగి నెచ్చెలి శశికళను కూడా రెండు సార్లు ఆమె ఇంటినించి తరిమెయ్యడమే కాకుండా, రెండేళ్లపాటు పార్టీ నుంచి కూడా బహిష్కరించారు. శశికళ ఎంతవరకు నిజాయితీగా ఉన్నారన్నదానికి కాలమే సమాధానం చెప్పాలి.

**పథకాల్లో తమిళనాడు ఫస్టు**
**అమలులో అమ్మ బెస్టు**

దేశం మొత్తంమీద తమిళనాడులో సంక్షేమ పథకాలు ఎక్కువ.. అది డీఎంకే కావచ్చు, లేదంటే అన్నాడీఎంకే కావచ్చు. అక్కడివారు దిగువ మధ్యతరగతి, మధ్యతరగతి వారికి ఎన్నో పథకాలను అమలు చేస్తారు. ఒక్కసారి హామీ ఇచ్చారంటే..తప్పనిసరిగా ప్రజలకు అందించే ప్రక్రియను చేపడతారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆ రాష్ట్రంలో ఎన్నికల ఖర్చు తడిసి మోపడవుతుంది. అందులో భాగంగానే ప్రజలకు కలర్‌టీవీలకు పెడస్టల్ ఫ్యాన్లు, వెట్ గ్రైండర్లు, విద్యార్థులకు లాప్‌టాప్‌లు, పేదరైతులకు వ్యవసాయ భూమిని అందచేశారు. పథకాలను ప్రవేశపెట్టడం, వాటిని అమలు చేయడంలో డీఎంకే అధినేత కరుణానిధికంటే అన్నాడీఎంకే అధినేత్రి విజయ లలితదే పై చేయని చెప్పక తప్పదు. "అస్యూర్డ్ మాక్సిమమ్ సర్వీస్ టు ది మార్జినల్ పీపుల్ ఇన్ ఆల్ విలేజెస్" సూక్ష్మరూపమే అమ్మపథకం. అమ్మ క్యాంటీన్లతో శుచి, శుభ్రత కలిగిన పౌష్టికాహారాన్ని కార్మికులు, రోజుకూలీలకు అందించారు. రూపాయికే రెండు ఇడ్లీలు, రూ. 5లకు సాంబారు అన్నం, మూడు రూపాయలకు పెరుగన్నం అందించి పేదసాదల హృదయాలను గెలుచుకున్నారు. అమ్మ మందుల దుకాణాలు నెలకొల్పి మార్కెట్ రైటుపై 15 శాతం తక్కువ రేటుకు మందుల అమ్మకాలు జరిపేలా చర్యలు తీసుకున్నారు. అమ్మ మొబైల్ ఫోన్లను ఏర్పాటు చేయడానికి మహిళలకు శిక్షణనిచ్చి ఉపాధి కల్పించారు. రాష్ట్రంలో మహిళా పోలీసు స్టేషన్లను నెలకొల్పి 33 శాతం మహిళా పోలీసులకు అవకాశం ఇచ్చారు. రాష్ట్ర ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు తక్కువరేటుకే సురక్షిత మినరల్ వాటర్‌ను అందుబాటులోకి తెచ్చారు. నాసిరకం విత్తనాలతో అడుగడుగునా మోసపోతున్న రైతన్నకు బాసటగా నిలిచేందుకు అమ్మ సీడ్స్‌ను సబ్సిడీ రేట్లకు అందించారు. దిగువమధ్యతరగతి కుటుంబాల వారు సొంతింటి కలను నిజం చేసుకునేందుకు ప్రభుత్వ గోడౌన్ల నుంచి సిమెంటును కేవలం రూ. 170 లకే అందించారు. ఇంటిని నిర్మించుకునేందుకు 750 బస్తాలు, ఇంటి మరమ్మతుల కోసం 100 బస్తాల సిమెంట అందించారు. నాసిరకం సాల్టులను సామాన్యమహిళలు కొనుగోలు చేయకుండా ఉండేందుకు అమ్మసాల్టులను అందుబాటులోకి తెచ్చారు.

**విద్యా, వైద్యరంగానికి ప్రముఖ ప్రాధాన్యత**

విద్యావైద్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థినీ,విద్యార్థులకు సైకిళ్లు పంచితే, అర్బన్ ఏరియా విద్యార్థులకు బస్‌పాస్‌లను ఉచితంగా అందించారు. తమిళనాడులోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు పాఠ్యపుస్తకాలు, స్కూలు యూనిఫారాలు, మధ్యాహ్న భోజన పథకం అమలులోకి తెచ్చి అక్షరాస్యతా శాతాన్ని పెంపొందించేందుకు ప్రయత్నిస్తున్నారు. 1 నుంచి 12 తరగతి వరకు ఉచిత విద్య అందిస్తారు. అంతేకాకుండా రాష్ట్ర స్థాయిలో అత్యధిక ప్రతిభ కనపరచిన మొదటి ముగ్గురికి నగదు బహుమతి అందించి పై చదువులకు ప్రోత్సాహమిచ్చింది జయలలిత ప్రభుత్వం. మహిళల ఆరోగ్యానికి ఆమె పెద్దపీట వేశారు. అందులో భాగంగా ఆరోగ్య పరీక్షల పథకాలు ప్రవేశ పెట్టారు. అమ్మమాస్టర్ హెల్త్ చెక్‌అప్, అమ్మమాస్టర్ చెక్‌అప్, అమ్మ ఆరోగ్య తిట్టం వివిధ కేటగిరీల వైద్య పరీక్షలతో మహిళల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత నిచ్చారు.


### అమ్మ ఔదార్యం

మానవత్వానికి అద్దంపట్టేలా ఆమె తీసుకున్న చర్యలు అసమానం.. దేశంలో ఆడపిల్ల అని తెలియంగానే భ్రూణహత్యలు, చంపి విసిరేయడం జరుగుతున్న నేపథ్యంలో 1992లో ఉయ్యాల పథకం ప్రవేశపెట్టారు. తల్లిదండ్రులు వద్దనుకున్న బిడ్డను ఈ ఉయ్యాలలో వేసేవిధంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ ఏర్పాట్లు చేసి బాల,బాలికల నిష్పత్తి తగ్గకుండా జయ దేశంలోనే బృహత్తర పథకాన్ని ప్రవేశపెట్టారు. ఆగస్టు 1 నుంచి 7 వరకు తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లిపాల బ్యాంకులను రాష్ట్రంలోని ఏడు ఆసుపత్రుల్లో ఏర్పాటు చేశారు. బస్సు, రైల్వేస్టేషన్లలో తల్లులు బిడ్డలకు పాలిచ్చేందుకు అనువుగా ఉండేందుకు ప్రత్యేక గదులను నిర్మించి ఆమెలోని అమ్మతనాన్ని ఆవిష్కరించారు. తమిళ రాజకీయాలలో ఆమెలేని లోటు పూడ్చలేనిది..








– బోస్

# కుటుంబంకోసం ప్రధాని పదవి త్యాగం



కుటుంబ సభ్యులతో న్యూజిలాండ్ ప్రధాని జాన్‌కే

భారత దేశానికి సాటి ప్రపంచంలో ఏదీ లేదని, ఇది వేదభూమని ఇక్కడి పెళ్లిళ్లు, కుటుంబం వారసత్వం ఇత్యాదులన్నీ ఎక్కడా కానరావని అంటారు. కాని ఇక్కడ అంతా ద్వంద్వ ప్రవృత్తని, డొల్లే బయటికి వస్తుందని ఒప్పుకుంటానికి ఎవరూ ముందుకు రారు. సోమవారం న్యూజిలాండ్ ప్రధాని జాన్‌కే తన ప్రధాన మంత్రి పదవికి రాజీనామా చేస్తూ అందరినీ ఆశ్చర్యానికి గురి చేశాడు. ఆయన మీద అభియోగాలేవీలేవు. అవినీతి ఆరోపణలు లేవు... మళ్లీ మరొకసారి పోటీ చేసినా గెలిచే అభిమానం ఉన్న నాయకుడు ఆయన మరి ఇంతకీ ఎందుకు ఆయన రాజీనామా చేశాడో తెలుసా ? కుటుంబంతో గడపటం కోసం నిజమేనండి...కుటుంబ సభ్యులు అడిగారట .. మీరు రాజకీయాల్లో లేనప్పుడు ఇంట్లో అందరితో సమయం గడిపేవారు. ప్రస్తుతం ఎప్పుడూ రాజకీయాలతోనే సరిపోతోందని కుటుంబసభ్యులు నిలదీసే సరికి ఆయన ప్రధాన మంత్రి పదవికి అలవోకగా రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ప్రధాని పదవిలో ఉన్న వారు ఇప్పటివరకు ఇలాంటి నిర్ణయం తీసుకోలేదు. బహుశ పదవిని వదులుకోవడం అంత తేలికైన పనికాదనుకుంటా అని అన్నారు. తన నేషనల్ పార్టీ దేశంలో బలంగా ఉందని, నిధులు పుష్కలంగా ఉన్నాయని నాయకత్వం వహించేవారికి గొప్ప పేరు వస్తుందని జాన్‌కే పేర్కొన్నారు. ఆయన 8 ఏళ్ల నుంచి ప్రధాని పదవిని సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు.



ఇటలీ ప్రధాని మట్టె రెంజి

కొడుకులు, మనవళ్లుకూడా తమ పదవి చేపట్టాలని ఉవ్విళ్లూరుతున్న మన దేశంలో ఎవరైనా కుటుంబంకోసం ప్రధాని పదవిని ఒదులుకుంటారా చెప్పండి...అఫ్‌కోర్స్ అధికార ఆడంబరాలకు అలవాటు పడ్డ కుటుంబసభ్యులు కూడా తండ్రి తమ దగ్గరకు రాకపోయినా పర్వాలేదు. వారసత్వంగా పదవి వస్తే చాలనుకునేవాళ్లే మనదేశంలో అందరూ... ఇప్పుడు చెప్పండి కుటుంబానికి ఎవరు ప్రాధాన్యత నిస్తారో ?

ఇదే రోజు ఇటలీ ప్రధాని మట్టె రెంజి కూడా పదవికి రాజీనామా చేశారు. ఇటలీలో రాజ్యాంగ సవరణ చేపట్టడానికి చేసిన రెఫరెండంలో ఆయనకు వ్యతిరేకంగా ఓట్లు నమోదవడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు.

### ఫిబ్రవరి 24 నాటికి జయ స్మారకం

**చెన్నై :** దివంగత ముఖ్యమంత్రి జయలలాత జన్మదినమైన ఫిబ్రవరి 24 నాటికి స్మారక చిహ్నాన్ని సిద్ధం చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మెరీనాతీరంలో ఉన్న ఎంజీఆర్ స్మారక ప్రదేశం సమీపంలోనే జయ భౌతికకాయాన్ని ఖననం చేసిన విషయం తెలిసిందే. ఆ స్థలంలో సందర్శకులు నివాళు లర్పించే విధంగా తాత్కాలికంగా ఇనుపకంచెను ఏర్పాటు చేశారు. మూడు రకాల నమూనాలను ఎంపిక చేశామని అధికారులు వివరించారు. కాగా ... స్థానిక పోయెస్ గార్డెన్‌లోని జయ స్వగృహం వద్దకు వెళ్లేందుకు ప్రజలను పోలీసులు అనుమతిస్తున్నారు.


### మరో జీవితాన్ని బలిగొన్న 'క్యూ'

**ముజఫర్‌నగర్ :** షామిలీ జిల్లాలోని ఓ బ్యాంకు క్యూలో నిల్చున్న 50 యేళ్ల వ్యక్తి హఠాత్తుగా కుప్పకూలిపోయినట్టు పోలీసులు తెలిపారు. టీబీ వ్యాధిగ్రస్తుడైన ఇయామ్ అహ్మద్ డబ్బు డ్రా చేసుకునేందుకు బ్యాంకుకు వెళ్లాడు. క్యూలో కుప్పకూలిపోయాడు. అక్కడికక్కడే మరణించాడని పోలీసులు వివరించారు.

### సవరణ

**గత వారం సంచిక 8వ పేజీలో కృతజ్ఞతలు యాడ్‌లో పొరపాటున అబ్దుల్ లతీఫ్ అహ్మద్ (లేటు) అని ప్రచురితం జరిగింది. క్షంతవ్యులం**


స్మృత్యంజలి



క్రమశిక్షణే ఊపిరిగా, కష్టమే ఇష్టంగా, నిరాడంబరతే ఆలంబనగా, జీవించిన మా జన్మదాత, మా స్ఫూర్తి ప్రదాత 'వజీర్ ఖాన్' గారికి స్మృత్యంజలి స్పరిస్తూ.... వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని .... "అల్లాహ్ ని" మనసారా కోరుకుంటూ.....

వజీర్ ఖాన్

కుటుంబసభ్యులు, బంధువులు, మిత్రులు
రాయపూడి





ఎం.బేగ్

శ్రీ కల్కి అందరివారు

విశ్వశాంతి ధర్మ స్థాపకులు,దైవ సత్యస్వరూపి, లోక రక్షకులు జగద్గురువులు శ్రీ కల్కి

కలియుగ కాల ప్రమాణము 4,32000 సంవత్సరాలు 3658 వ సం॥క్రీ॥ శ॥ 570 సం॥లో వచ్చారు. శ్రీ కల్కి

అంతిమ దైవ ప్రవక్త ముహమ్మద్ (స) వారు

కలియుగము మహా మంత్రమునకు సామ వేదములో

| హా హా | హూ హూ | హీ హీ |
|---|---|---|
| 1 | 2 | 3 |
| లా ఇలాహా | ఇల్లల్లాహు | మొహమ్మదుర్ రసూలుల్లాహి |

8143307812

ఎవరూ నరకాని పోకుండా స్వర్గానికి వెళ్లాలనే ఆకాంక్షిస్తూ.



విజయవాడ ఆటోనగర్ డిస్పోజబుల్ ఆటోమొబైల్స్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులకు, నన్ను ఆదరించి అధ్యక్షుడిగా గెలిపించిన మీ అందరికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ...




హబీబుల్లాఖాన్ ఉపాధ్యక్షుడు,
సయ్యద్ హుస్సేన్ ఆత్మీయ బంధువు

మహబూబ్ ఖాన్ సెక్రటరీ
అబ్దుల్ లతీఫ్ అహ్మద్
ముజాహిద్ అహ్మద్

ముజాహిద్ అహ్మద్ జవహర్ ఆటోనగర్, విజయవాడ, 9885217786



సామాజిక,ఆర్థిక,సాంస్కృతిక, రాజకీయ,వారపత్రిక

రాజధాని వార్తలు క్లాసిఫైడ్స్ - రూ.500/- మాత్రమే

94406 62699, 96768 44442


Editor : Pattan Hussain Khan, Printed and Published by him on behalf of Vastitude media pvt ltd. Published at 6-45/1, Rayapudi Post, Thullur Mandal, Guntur District, AP. 522237. Printed at Jagathi Publications Ltd.D.No: 5-625,Vadlapudi road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur District, AP. Cell: 9440662699, Email: info@rajadhanivartalu.com, RNI No. APTEL / 2015 / 66622. Postal Regd. No.GTR/84/2016-18